

రెండు మహానగరాలు
రూ॥250/-
పేజీలు:245
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 163 | బుధవారం | 13-05-2026 | ఖమ్మం

Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**

పేజీలు: 12+8 | వెల రూ. 5.00



అసోంలో వరుసగా రెండవసారి సిఎంగా హిమంత్ ప్రమాణం

పాదుపు చర్యల పిలుపుపై అఖిలపక్ష సమావేశం **07**

దేశ వ్యాప్తంగా కోర్టుల ఆధునికీకరణకు ఉన్నత స్థాయి కమిటీ


ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో

# నిర్లక్ష్యం సహించబోం

- ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచాలి
- అలా చేయని కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులకు వెనుకాడొద్దు
- కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా పర్యవేక్షించాలి

**నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపైనా చర్యలు తీసుకుంటాం**

- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**మిషన్ మోడ్‌లో ధాన్యం సేకరణ పూర్తి చేయాలి**



అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలి. కల్లాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలి. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక అధికారిని నియమించాలి. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి - ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

మిషన్ మోడ్‌లో పనిచేసి రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశించారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని, అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకూ వెనకాడొద్దన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాలని, ప్రతీ అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిందేనన్నారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని, ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత తీసుకుని పరిష్కరించాలని సిఎం ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకూ ప్రభుత్వం వెనకాడదని సిఎం హెచ్చరించారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలపై కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యాన్ని సహించేదిలేదని అధికారులకు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని సూచించారు. గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవడంతోపాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్‌కు తరలించాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాల్లో గోడౌన్స్ సమస్య ఉన్నట్లు తెలుస్తోందని, అలాంటి ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్లకు సిఎం సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్లకు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని,

తరువాయి 8లో



ప్రశ్నాపత్రం లీక్...

# నీట్ రద్దు

- పరీక్ష రద్దుకు బాధ్యత వహించిన ఎన్‌టిఎ
- రానున్న 7-10 రోజుల్లో కొత్త తేదీలను ప్రకటిస్తామని డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ ప్రకటన
- అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని సిబిఐకి ప్రభుత్వం ఆదేశం
- దేశ వ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆందోళన

**న్యూఢిల్లీ :** ప్రశ్నపత్రం లీక్ ఆరోపణల నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈనెల 3న నిర్వహించిన నీట్ (యుజి) 2026 పరీక్షను రద్దు చేసింది. ఈ అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రభుత్వం సిబిఐని ఆదేశించింది. ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో నీట్ (యుజి) 2026 పరీక్ష రద్దుకు బాధ్యత వహిస్తూ, పునఃపరీక్షల షెడ్యూల్‌ను 'రాబోయే ఏడు నుండి పది రోజుల్లో' ప్రకటిస్తామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ మంగళవారం తెలిపారు.జాతీయ పరీక్షా విధానంలో పారదర్శకతను, విశ్వాసాన్ని కాపాడే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఎక్స్ వేదికగా పేర్కొంది. 'కేంద్ర సంస్థల సమన్వయంతో ఎన్‌టిఎ పరిశీలించిన సమాచారం ఆధారంగానూ, అలాగే చట్ట అమలు సంస్థలు పంచుకున్న దర్యాప్తు ఫలితాల ఆధారంగానూ... భారత ప్రభుత్వ ఆమోదంతో, ఈ నెల 3, న నిర్వహించిన నీట్ (యుజి) 2026 పరీక్షను రద్దు చేయాలని, ఆ పరీక్షను వేరే తేదీల్లో మళ్ళీ నిర్వహించాలని నేషనల్

తరువాయి 8లో

ప్రధాని 'అమృత కాలం'..

## దేశానికి 'విష కాలం'

22 లక్షల మంది విద్యార్థుల కఠోర శ్రమ బిజెపి హయాంలో చితికిపోయింది : రాహుల్‌గాంధీ



నీటి (యుజి) పరీక్ష రద్దు వ్యవహారంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గొప్పగా చెప్పుకుంటున్న 'అమృత కాలం' దేశానికి 'విష కాలం' గా మారిపోయిందని వ్యాఖ్యానించారు. 22 లక్షల మందికి పైగా విద్యార్థుల కఠోర శ్రమ, త్యాగాలు, కలలు ఈ అవినీతిమయమైన బిజెపి ప్రభుత్వ హయాంలో చితికిపోయాయి రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు తండ్రులు అప్పులు చేశారు, కొందరు తల్లులు తమ ఆభరణాలను అమ్ముకున్నారు, లక్షలాది మంది పిల్లలు రాత్రంతా మేల్కొని చదువుకున్నారు; కానీ

తరువాయి 8లో

నీట్ స్కామ్ దోషులను గుర్తించి

## కఠినంగా శిక్షించాలి

- సిపిఐ డిమాండ్
- పరీక్ష వ్యవస్థలో మోదీ సర్కారు పూర్తి పతనానికి నిదర్శనమని ఆరోపణ
- నీట్, ఎన్‌టిఎలను రద్దుచేసి, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ కమిటీని ఏర్పాటుచేయాలి



ప్రశ్నపత్రాల లీకేజీ, భారీస్థాయిలో అక్రమాల నేపథ్యంలో జాతీయ అర్హత పరీక్ష (నీట్–యుజి) 2026ను రద్దు చేయడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండించింది. నీట్ పరీక్షను దేశ వ్యాప్తంగా ఈనెల 3వ తేదీన నిర్వహించారు. జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టిఎ), మోదీ ప్రభుత్వం పూర్తి వైఫల్యం కారణంగా ఎంతో

తరువాయి 8లో



ఇందిరమ్మ ఇండ్ల పథకం

## జూన్ 2 నుంచి రెండో విడత

- ఆదిలాబాద్‌లో లాంఛనంగా ప్రారంభం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటన
- పేదల నివాస ప్రాంతానికి 5నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇళ్లు నిర్మించాలని అధికారులకు ఆదేశం
- నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని స్థల సేకరణ చేయాలని సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను నిజం చేసే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక 'ఇందిరమ్మ ఇండ్ల' పథకం రెండో విడతను జూన్ 2వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం

తరువాయి 8లో

## తెలంగాణకు 10, ఎపికి 16 టిఎంసిలు

- నాగార్జునసాగర్ నీటిని కేటాయించాలని
- కెఆర్‌ఎంబి త్రిసభ్య కమిటీ నిర్ణయం
- శ్రీశైలం నుంచి తెలంగాణకు 16 టిఎంసిల నీటి కేటాయింపు
- ఆగస్టు 15 వరకు ఒప్పందం అమలులో ఉంటుందని అధికారులు వెల్లడి

ప్రజాపక్షం/ హైదరాబాద్



నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి తెలంగాణకు 10 టిఎంసిల నీటిని విడుదల చేయాలని, ఆంధ్రప్రదేశ్‌కు 16 టిఎంసిలు కేటాయించాలని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కెఆర్‌ఎంబి)కి చెందిన ఇరు రాష్ట్రాల త్రిసభ్య కమిటీ నిర్ణయించింది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి తెలంగాణకు 16 టిఎంసిల నీటిని కేటాయిస్తూ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ ఒప్పందం ఆగస్టు 15వ

తరువాయి 8లో



ఎన్‌డిడిబి నార్మల్ మధ్య

## కుదిరిన ఒప్పందం

- మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సమక్షంలో ఎంఒయు
- రైతు బకాయిల చెల్లింపునకు రూ.10 కోట్ల చెక్కును నార్మూల్‌కు అందజేసిన ఎన్‌డిడిబి

ప్రజాపక్షం/యాదాద్రి

ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి జిల్లాల పాడి రైతుల పాలిట ఆశాకిరణమైన మదర్ డెయిరీ (నార్మల్) పునర్వైభవానికి అడుగులు పడ్డాయి. మంగళవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సమక్షంలో నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు (ఎన్‌డిడిబి), నార్మల్ మధ్య ఒప్పందం కుదిరింది. పాడి రైతులకు నార్మల్ బకాయిపడిన పాల బిల్లులు చెల్లింపునకు ఎన్‌డిడిబి రూ.10 కోట్ల చెక్ ను నార్మల్ సంస్థకు మంత్రి సమక్ష్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ 'ఒకప్పుడు ఎన్‌డిడిబి హయాంలో వెలుగు వెలిగిన మదర్ డెయిరీ, 2015లో ఒప్పందం ముగిసినప్పటి నుండి గత బిఆర్ఎస్ పాలకుల అవినీతి వల్ల నష్టాల్లోకి వెళ్లిందన్నారు. గత తొమ్మిదేళ్లలో దాదాపు రూ. 72 కోట్ల నష్టాలు పేరుకుపోయాయని, రైతులకు చెల్లింపులు

తరువాయి 8లో

## బండి భగీరథను తక్షణం అరెస్టు చేయాలి



- సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ డిమాండ్
- కేసును నీరుగార్చే కుట్ర చేస్తున్నారని మహిళా సంఘాలు విమర్శ
- దర్యాప్తులో జాప్యమెందుకని ఎఐఎస్‌ఎఫ్ రౌండ్‌టేబుల్ సమావేశం నిలదీత

ప్రజాపక్షం/హైదరాబాద్

మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథను తక్షణమే అరెస్టు చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ్ డిమాండ్ చేశారు. పోక్సో కేసు నమోదైన 24 గంటల్లోనే నిందితులను అరెస్టు చేయాల్సి ఉండగా పోలీసులు ఉద్దేశపూర్వకంగానే బండి భగీరథను అరెస్టు చేయకుండా కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బండి భగీరథను 24 గంటల్లో అరెస్టు చేయకపోతే డిజిపి కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. బండి భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల చొక్కాలు నల్ల చీరలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా

తరువాయి 12లో

**భగీరథకు పోలీసులు నోటీసులు**

హైకోర్టును ఆశ్రయించిన బండి సంజయ్ కుమారుడు

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు పేట్‌బషీరాబాద్ పోలీసులు నోటీసులు ఇచ్చారు. పోక్సో కేసులో బుధవారం మధ్యాహ్నం పిఎస్‌లో విచారణకు హాజరుకావాలని పేర్కొన్నారు. కరీంనగర్‌లోని భగీరథ్ ఇంటికి పోలీసులు వెళ్లారు. ఇంట్లో ఎవరూ

తరువాయి 12లో

## కేరళ సిఎం ఎంపికపై కొనసాగుతున్న ప్రతిష్టంభన

**మిత్రపక్షాల పాత్రపై కాంగ్రెస్ నేతల్లో బేదాభిప్రాయాలు**



**తిరువనంతపురం/న్యూఢిల్లీ :** కేరళలో ముఖ్యమంత్రి ఎంపిక విషయంలో కూటమి భాగస్వామ్య పక్షాలకు ఏదైనా పాత్ర ఉండాలా వద్దా అనే అంశంపై కేరళ కాంగ్రెస్ నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు కనిపిస్తోంది. మరోవైపు పార్టీ అధిష్టానం ఆ రాష్ట్రంలోని సీనియర్ నాయకులతో చర్చలను కొనసాగిస్తోంది. కేంద్ర నాయకత్వం ఢిల్లీకి పిలిపించిన నాయకులలో మాజీ కెపిసిసి అధ్యక్షులు వి.ఎం. సుధీరన్, ముల్లపల్లి రామచంద్రన్, కె. మురళీధరన్, కె. సుధాకరన్, ఎం.ఎం. హసన్ ఉన్నారు. సీనియర్ ఎమ్మెల్యే తిరువంచూర్ రాధాకృష్ణన్‌తో పాటు, వర్కింగ్ ప్రెసిడెంట్లు పి.సి. విష్ణునాథ్, షఫీ పరంబిల్, ఎ.పి. అనిల్ కుమార్‌లను కూడా ఢిల్లీకి రావాలని పార్టీ ఆదేశించింది. చర్చల అనంతరం, బయటకు వస్తున్నప్పుడు, ఈ విషయంపై తన వైఖరిలో ఎటువంటి మార్పు లేదని, ముఖ్యమంత్రిని నిర్ణయించేటప్పుడు

తరువాయి 12లో

## ఎఐఎడిఎంకెలో చీలిక

సిఎం విజయ్‌కి మద్దతు ప్రకటించిన షణ్ముగం నేతృత్వంలో 30మంది ఎమ్మెల్యేలు



**చెన్నై :** తమిళనాడులో అసెంబ్లీ ఫలితాలు వెలువడినప్పటి నుంచి రాష్ట్రంలో రాజకీయాలు ఆసక్తిగా మారుతున్నాయి. అతిపెద్ద పార్టీగా అవతరించిన టివికెకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు తగిన సంఖ్యాబలం లేకపోవడంతో దాదాపు ఆరు రోజుల పాటు అనిశ్చితి ఏర్పడింది. చివరకు వామపక్షాలు, విసికె, ఐయుఎంఎల్ మద్దతు తెలపడంతో సద్దుమణిగింది. అయితే ప్రభుత్వ ఏర్పాటు తరువాత కూడా రాజకీయాలు వేగంగా మారుతున్నా యి. తాజాగా ఎఐఎడిఎంకెలో చీలిక ఏర్పడింది. ఆ పార్టీ అధినేత ఎడప్పాడి కె. పళనిస్వామి తమ చిరకాల ప్రత్యర్థి అయిన డిఎంకెతో పొత్తు పెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ, ఎమ్మెల్యేల బృందం ఆయనపై తిరుగుబాటు చేసింది. బుధవారం జరగనున్న బలపరీక్షకు ముందు, విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి తాము మద్దతు ఇస్తున్నట్లు వారు ప్రకటించారు. ఏప్రిల్ 23న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయాన్ని చవిచూసిన నేపథ్యంలో పోటీ చేసిన 164 స్థానాల కుగాను కేవలం

తరువాయి 12లో

## స్టార్మర్ రాజీనామా చేయాలి

- 81 మంది లేబర్ ఎంపిల డిమాండ్
- మరోమంత్రి జెస్సీ ఫిలిప్ రాజీనామా
- పదవిలోనే ఉంటా : స్టార్మర్



**లండన్:** ఎప్‌స్టీన్ ఫైల్స్ ఆరోపణలతోపాటు గత వారం జరిగిన ఎన్నికల్లో ఘోర పరాజయం జతకలిసి చినుకు చినుకు గాలివానగా మారడంతో బ్రిటన్ ప్రధాన మంత్రి స్టార్మర్‌కు పదవీగండం ముంచుకువచ్చింది. మొత్తం 403 మంది ఎంపిలలో అధికారపార్టీకి చెందిన 81 మంది ఎంపిలు ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు మంగళవారం మరోమంత్రి జెస్సీ ఫిలిప్ తన పదవికి రాజీనామా చేయడంతో స్టార్మర్‌పై మరింత ఒత్తిడి పెరిగింది. ఆయన మంత్రివర్గం నుండి ఇప్పటికి ఇద్దరు మంత్రులు రాజీనామా చేశారు. ప్రతిపక్షాలు రాజీనామాకు డిమాండ్ చేస్తూ వచ్చినప్పటికీ పదవిలో కొనసాగుతానని స్టార్మర్ ప్రకటించారు. మంత్రివర్గ సమావేశంలో ఎవరూ తనను సవాలు చేయలేదని చె ప్పారు. మంత్రివర్గ సమావేశానికి ముందుగా మాట్లాడుతూ, రాజీనామా చేసే ఉద్దేశం లేదన్నారు. కీలకమైన మంత్రివర్గ సమావేశం నుండి బయటకు వస్తున్న సమయంలో ఆయన మి త్రులు బాహాటంగా పూర్తి మద్దతు ప్రకటించా రు. ఆయనను వదిలించుకోవాలనే విషయంలో మంత్రివర్గంలోనే

తరువాయి 12లో

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
బుధవారం
13-05-2026
www.prajapaksham.in
ఎడిట్
PEOPLE'S VIEWS

# 'నీట్' పరీక్ష రద్దు విద్యార్థులకు షాక్

మెడికల్ కోర్సుల్లోకి అడ్మిషన్‌లకు ఉద్దేశించి ఈనెల 3న నిర్వహించిన 'నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్' (నీట్) ను రద్దుచేస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ మంగళవారం మధ్యాహ్నం జారీ చేసిన ప్రకటన దేశవ్యాప్తంగా లక్షలాదిమంది విద్యార్థులకు పిడుగుపాటు అయింది. ప్రశ్నాపత్రాల లీకేజి మాఫియాలు పరీక్ష నిర్వాహకుల కన్నా తెలివిగా, చాకచక్యంగా పని చేస్తున్నాయని ఈ ఘటన రుజువు చేస్తున్నది. ఎందుకంటే ఇటువంటి ఘటన ఇదే ప్రథమం కాదు. ఎన్‌టిఎ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ అఖిల భారత ప్రవేశ పరీక్షకు సంబంధించి గత 7 సంవత్సరాల్లో 17 రాష్ట్రాల్లో 70కిపైగా లీకేజీలు సంభవించినట్లు తెలుస్తున్నది. 2024లో హజారీబాగ్ (జార్ఖండ్)లో ప్రశ్నాపత్రంపై సిబిఐ దర్యాప్తు జరిగింది. ఈ సందర్భంలో భద్రమైన ప్రశ్నాపత్రాల కట్టలను తెరిచి ఫోటోలు తీసుకున్నట్లు దర్యాప్తు తేల్చింది. అధిక మార్కులు పొందిన 67మందికి అవి నిజమైన మార్కులు కావని, దొంగచాటుగా అదనపు మార్కులు చేర్చారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ సందర్భంగా దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమైనాయి. నీట్‌ను ఎత్తివేసి రాష్ట్రాలకే ఆ బాధ్యత అప్పగించాలన్న డిమాండ్‌లతో పాటు నీట్‌ను మరింత భద్రతతో కట్టుదిట్టంగా నిర్వహించాలని డిమాండ్‌లు వచ్చాయి.

ఏడాది విరామంతో మాఫియా గ్యాంగ్‌లు మరింత తెలివిగా ఈ 2026 నీట్ ప్రశ్నాపత్రాన్ని లీక్ చేశారు. కెమిస్ట్రీ విభాగంలో 140కి పైగా ప్రశ్నలతో 'గెస్ పేపర్' (ఊహాత్మక ప్రశ్నాపత్రం) అంటూ టెలిగ్రాం, వాట్సయాప్ ద్వారా పరీక్షలకు 48గంటల ముందు సర్క్యులేట్ చేశారు. అది గెస్ పేపరు కాదు – అసలు ప్రశ్నాపత్రమే సుమా! 410 ప్రశ్నలున్నట్లు మరో సమాచారం. రాజస్థాన్ పోలీసులు, కేంద్ర ఏజన్సీలు ఈ మోడస్ ఆపరెండీని బయటకు లాగాయి. ఇది ఒక్క రాజస్థాన్‌లోనే కాదు,10–15 రాష్ట్రాల్లో పంపిణీ జరిగినట్లు సిబిఐ గుర్తించింది. కొందరిని అరెస్టు చేశారు కూడా. గోప్యంగా ఈ ప్రశ్నాపత్రాన్ని కొనుగోలు చేసిన విద్యార్థులనుంచి మాఫియా ముఠా ఏజంట్లు లక్షల్లో వసూలు చేశారట! ఇటువంటివి పదేపదే జరుగుతున్నా మాఫియా ముఠాలను శిక్షించటంలో ప్రభుత్వం విఫలమవుతున్నది.

ఎప్పుడు ఎక్కడ ప్రశ్నాపత్రం లీకేజి జరిగినా అది విద్యార్థుల జీవితాలతో చెలగాటమే. మే 3న నిర్వహించిన 'నీట్' పరీక్షకు 27లక్షలమందికి పైగా విద్యార్థులు హాజరైనారు. వారిలో సగానికి పైగా విద్యార్థినులు. సైన్స్ పాఠ్యాంశాల్లో ఆసక్తిగల విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో బైపిసి తీసుకుని ఎంతో కష్టపడి చదివి ఈ పరీక్షకు హాజరవుతారు. అంతేకాదు, తొలి ప్రయత్నంలో సఫలీకృతులయ్యే కొద్ది శాతాన్ని మినహాయిస్తే, లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుని ఒకటి, రెండు ప్రయత్నాల్లో మెడిసిన్‌లో ప్రవేశార్హత సాధించే విద్యార్థులు అధికంగా ఉంటారు. దేశవ్యాప్తంగా లక్షలమంది విద్యార్థులు మూడు నాలుగు సంవత్సరాలు రాత్రింబవళ్లు కష్టపడితే తప్ప ఫలితం దక్కదు. తమ పిల్లల్ని డాక్టర్లుగా చూడటం కోసం వారి తల్లిదండ్రులు ఎన్ని లక్షలు వెచ్చిస్తారో ఊహించుకోవలసిందే. ఇంతమంది ఆశల్ని భంగపరిచే మాఫియా ముఠాలను అరికట్టగలిగిన సమర్థతలేని జాతీయ టెస్టింగ్ ఏజన్సీకి అసలు ఈ పరీక్ష నిర్వహించే అర్హత ఉందా? ఎయిమ్స్, జిప్‌మెర్ సహా దేశంలో వైద్యవిద్యా సంస్థల్లో ప్రవేశానికి నీట్ ఉత్తీర్ణత ర్యాంక్ మాత్రమే అర్హత. ఇంతటి ప్రాధాన్యతగలిగిన పరీక్ష నిర్వహణలో పదేపదే వైఫల్యం మోదీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం.

గతంలో సిబిఎస్ఇ, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంసెట్ పరీక్షా ఫలితాల ద్వారా మెడిసిన్ కోర్సుల్లో (ఎంబిబిఎస్, బిడిఎస్, బి.ఎ.ఎం.ఎస్, బి.హెచ్. ఎం.ఎస్, బి.ఫార్మసీ తదితరాలు అడ్మిషన్‌లు నిర్వహించేవి. అయితే ఒకే దేశం – ఒకే ప్రమాణం పేరుతో కేంద్రప్రభుత్వం ప్రవేశపరీక్ష బాధ్యత తీసుకుని హిందీ, ఇంగ్లీషుల్లో నీట్ పరీక్ష నిర్వహణకోసం జాతీయ టెస్టింగ్ ఏజన్సీ ఏర్పాటు చేసింది. దీనివల్ల ప్రాంతీయ భాషల్లో ఇంటర్మీడియెట్ వరకు చదువుకున్న విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. వారు సాధారణంగా గ్రామీణ విద్యార్థులే అయివుంటారు. వైద్య విద్య అభ్యాసకుల్లో పట్టణ–గ్రామీణ విద్యార్థుల మధ్య పెరుగుతున్న అంతరాన్ని నివారించేందుకై ప్రాంతీయ భాషల్లో కూడా నీట్ నిర్వహించాలని తమిళనాడు తదితర రాష్ట్రాలు డిమాండ్ చేశాయి. అయినా కేంద్రప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రశ్నాపత్రాల లీకేజి, ఇతర అక్రమాలకు తావు లేకుండా పకడ్బందీగా పరీక్ష నిర్వహణలోనూ టెస్టింగ్ ఏజన్సీ విఫలమైంది. ఇప్పుడు మళ్లీ పరీక్ష నిర్వహించటం తప్పనిసరి. త్వరలో పరీక్ష సంబంధిత వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటిస్తామని, పాత ఫీజు వాపసు చేస్తామని, కొత్తగా ఫీజు అక్కర్లేదని ఎన్టీఎ బాధ్యులు ఉదార ప్రకటన చేశారు. అది వారి అసమర్థతను కప్పిపుచ్చదు, విద్యార్థుల ఇక్కట్లు బాపదు. పునఃపరీక్ష అయినా ఆరోపణలకు తావులేకుండా నిర్వహిస్తే అదే పదివేలు. పేపర్ లీకేజిపై సిబిఐ దర్యాప్తు త్వరగా పూర్తిచేయాలి, దోషులను న్యాయస్థానం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షింపజేసినపుడే మరికొన్ని ముఠాలకు అది హెచ్చరికగా పనిచేస్తుంది. ●



## సంక్షోభం పెట్రో ఉత్పత్తులకే కాదు...

భారతదేశం ఎదుర్కొంటున్న సంక్షోభం కేవలం పెట్రోలియం ఉత్పత్తులకు మాత్రమే పరిమితం కాదు. ఇది మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్న ఒక విస్తృత ఆర్థిక సంక్షోభం. ఈ విషయాన్ని ప్రధాన–మంత్రి పొదుపు పిలుపు నిరూపిస్తోంది. ఈ పరిస్థితి ఇప్పటికే లక్షలాది మంది భారతీయుల జీవితాలను ప్రభావితం చేస్తోంది. ఇప్పటికే కొవిడ్ మహమ్మారి తీవ్ర దెబ్బను ఎదుర్కొన్న దేశంలోని దాదాపు కోటి మంది పౌరులు, తమ రోజువారీ జీవనోపాధిని కాపాడుకోవడానికి కూడా పోరాడుతున్న తరుణంలో, కోల్పోవడానికి గానీ, మరింత సంయమనం పాటించడానికి గానీ చెప్పుకోదగినదేమీ మిగిలి లేదు. ఈ పరిస్థితులలో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పేద, కష్టపడి పనిచేసే కుటుంబాలకు కొంత ఉపశమనం, మద్దతు అందించడానికి చురుకైన చర్యలు తీసుకోవాలి. ●

- బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి

# బొగ్గు పరిశ్రమలో 'జస్ట్ ట్రాన్సిషన్' అంటే...

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్, కాలుష్య నియంత్రణ వంటి అంశాలు అత్యంత ప్రాధాన్యంగా మారుతున్న ఈ కాలంలో బొగ్గు పరిశ్రమ భవిష్యత్తు గురించి పెద్ద చర్చ జరుగుతోంది. ఒకవైపు పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి, దేశ ఆర్థికాభివృద్ధికి బొగ్గు కీలకం కాగా, మరోవైపు కార్బన్ ఉద్గారాలకు ఇది ప్రధాన కారణంగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో జస్ట్ ట్రాన్సిషన్ అనే భావన ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యత పొందుతోంది. జస్ట్ ట్రాన్సిషన్ అంటే కేవలం బొగ్గు వినియోగాన్ని తగ్గించడం కాదు; బొగ్గు పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు, వారి కుటుంబాలు, స్థానిక ఆర్థిక వ్యవస్థలు నష్టపోకుండా న్యాయబద్ధమైన మార్పును తీసుకురావడం. అంటే పర్యావరణ పరిరక్షణతో పాటు కార్మికుల హక్కులు, ఉపాధి భద్రత, సామాజిక న్యాయం కూడా సమానంగా కాపాడటం. ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరగడం, హిమ నదులు కరగడం, అసాధారణ వర్షాలు, కరువు పరిస్థితులు వంటి వాతావరణ మార్పుల ప్రభావాలు తీవ్రమవుతున్నాయి. వీటికి ప్రధాన కారణాలలో బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాల నుంచి వెలువడే కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలు కూడా ఒకటి. అందుకే ఐక్యరాజ్యసమితి, ప్యారిస్ వాతావరణ ఒప్పందం వంటి అంతర్జాతీయ వేదికలు స్వచ్ఛమైన ఇంధనాలవైపు దేశాలు అడుగులు వేయాలని సూచిస్తున్నాయి. సౌరశక్తి, గాలి శక్తి, హైడ్రోజన్ శక్తి వంటి ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగం పెరుగుతోంది. ఈ మార్పువల్ల బొగ్గు పరిశ్రమ క్రమంగా క్షీణించే అవకాశం ఉంది. కానీ ఇక్కడే పెద్ద ప్రశ్న ఉత్పన్నమవుతోంది — బొగ్గు గనుల్లో పనిచేసే లక్షలాది కార్మికుల పరిస్థితి ఏమవుతుంది? భారతదేశం ప్రపంచంలో అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి దేశాలలో ఒకటి. దేశ విద్యుత్ ఉత్పత్తిలో ఇప్పటికీ అధిక భాగం బొగ్గుపైనే ఆధారపడి ఉంది. ముఖ్యంగా తెలంగాణలోని సింగరేణి, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా వంటి రాష్ట్రాలలో లక్షలాదిమంది కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా బొగ్గు పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. తెలంగాణలోని సింగరేణి సంస్థ కేవలం బొగ్గు తవ్వకాల సంస్థ మాత్రమే కాదు; అది వేలాది కుటుంబాల జీవనాధారం. కార్మికుల పిల్లల విద్య, వైద్యం, పట్టణాల అభివృద్ధి, స్థానిక వ్యాపారాలన్నీ సింగరేణి చుట్టూ తిరుగుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో సరైన ప్రణాళిక లేకుండా బొగ్గు పరిశ్రమను తగ్గిస్తే భారీ నిరుద్యోగం, బొగ్గు గనులు మూసివేసినా కార్మికులు ఉద్యోగాలు కోల్పోకుండా ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలి. కొత్త నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాలి. గనులపై ఆధారపడిన పట్టణాలు ఆర్థికంగా దెబ్బతినకుండా పరిశ్రమలు, చిన్న వ్యాపారాలు అభివృద్ధి చేయాలి. రిటైర్డ్ కార్మికులకు పెన్షన్, వైద్యసేవలు, కుటుంబ భద్రత కల్పించాలి. ప్రస్తుతం సింగరేణిలో యాంత్రీకరణ పెరగడం, ఓపెన్‌కాస్ట్ గనుల విస్తరణ, ప్రైవేటీకరణ భయాలు కార్మికుల్లో అసంతృప్తిని పెంచుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జస్ట్ ట్రాన్సిషన్ పేరుతో బొగ్గు పరిశ్రమను తగ్గిస్తే కార్మికుల భవిష్యత్తు మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉంది. అందుకే కార్మిక సంఘాలు ప్రభుత్వాలను ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని డిమాండ్ చేస్తున్నాయి. జర్మనీ, కెనడా, దక్షిణాఫ్రికా వంటి దేశాలు బొగ్గు పరిశ్రమ నుంచి స్వచ్ఛమైన ఇంధనాల వైపు మారుతున్న సమయంలో కార్మికులకు ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించాయి. కొత్త ఉద్యోగ శిక్షణ, ఆర్థిక సహాయం, ప్రాంతీయ అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టాయి. భారతదేశం కూడా అలాంటి విధానాలను అనుసరించాల్సిన అవసరం ఉంది. జస్ట్ ట్రాన్సిషన్ విజయవంతం కావాలంటే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కలిసి సమగ్ర విధానాలు రూపొందించాలి. కార్మిక సంఘాలతో చర్చలు జరపాలి. కొత్త పరిశ్రమలను బొగ్గు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి. యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలి. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో పెట్టుబడులు పెంచాలి. ప్రైవేటీకరణ వల్ల కార్మిక హక్కులు దెబ్బతినకుండా చట్టపరమైన రక్షణ కల్పించాలి. జస్ట్ ట్రాన్సిషన్ అనేది కేవలం పర్యావరణ నినాదం కాదు; అది సామాజిక న్యాయంకోసం అవసరమైన మార్గదర్శకం. బొగ్గు పరిశ్రమ నుంచి స్వచ్ఛమైన ఇంధనాల వైపు మార్పు అనివార్యం కావచ్చు. కానీ ఆ మార్పు వల్ల కార్మికులు నిరుద్యోగులై, వారి కుటుంబాలు రోడ్డున పడితే అది అభివృద్ధి కాదు. అందువల్ల పర్యావరణ పరిరక్షణ – కార్మిక సంక్షేమం రెండింటినీ సమానంగా కాపాడే విధంగా ప్రభుత్వాలు, పరిశ్రమలు, కార్మిక సంఘాలు కలిసి ముందుకు సాగాలి. నిజమైన జస్ట్ ట్రాన్సిషన్ అంటే ప్రకృతిని రక్షిస్తూ ప్రజల జీవితాలను కూడా రక్షించడం.

**ఆళవందార్ వేణు మాధవ్, 8686051752**

# ఇంటర్ విలీనంతో కొత్త దిశా? కొత్త సమస్యలా?



పుట్ట లక్ష్మణ్
ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్(ఎఐఎస్ఎఫ్)రాష్ట్ర కార్యదర్శి
9908814480

తెలంగాణలో ఇంటర్మీడియెట్ విద్యను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేయాలనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం (2027–28)కి వాయిదా వేసుకుంది. విద్యా విధానాన్ని ఒకే స్రవంతిలో నడిపించే ప్రయత్నంగా ప్రభుత్వం చెబుతోంది. అయితే ఇది నిజంగా విద్యకు కొత్త దిశ చూపుతుందా లేదా కొత్త సమస్యలను తెస్తుందా అన్నదానిపై చర్చ సాగుతోంది. ఒకవైపు ఈ నిర్ణయం ద్వారా ప్రాథమిక విద్య నుంచి ఇంటర్ వరకు ఒకే పరిపాలనా వ్యవస్థ ఏర్పడుతుంది. దీని వల్ల విధాన అమలులో సమన్వయం పెరుగుతుందని, విద్యార్థుల అభ్యాసంలో నిరంతరత్వం వస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇంటర్ విద్యను అందుబాటులోకి తేవడం ద్వారా విద్యా అవకాశాలు విస్తరించవచ్చని భావన ఉంది.

### విలీనంతో లాభాలు

ఇంటర్మీడియెట్ విద్యను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేయడం ద్వారా విద్యా పరిపాలనలో సమన్వయం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటివరకు పాఠశాల విద్య ఒక శాఖ ఆధ్వర్యంలో, ఇంటర్మీడియట్ విద్య మరో ప్రత్యేక బోర్డు ఆధ్వర్యంలో కొనసాగుతూ వచ్చింది. ఈ ద్వంద్వ వ్యవస్థ వల్ల అనేక పరిపాలనా సమస్యలు, నిర్ణయాలలో ఆలస్యం, విధాన భేదాలు ఏర్పడేవి. ఇప్పుడు ఒకే పరిపాలనా వ్యవస్థ కింద అన్ని స్థాయిల విద్యను నిర్వహించడం వల్ల పాలన సులభతరం అవుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రత్యేకంగా పాఠ్య ప్రణాళికల రూపకల్పనలో సమగ్రత సాధ్యమవుతుంది. 10వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్‌కు మారే సమయంలో విద్యార్థులు ఎదుర్కొనే అకస్మాత్తు మార్పులు తగ్గే అవకాశం ఉంది. ప్రత్యేకంగా ఇంటర్మీడియట్ దశను విద్యార్థుల జీవితంలో అత్యంత ఒత్తిడిగల కాలంగా భావిస్తారు. ఉదయం నుంచి రాత్రి వరకు తరగతులు, పరీక్షలు, ర్యాంకుల పోటీ, కోచింగ్ ఒత్తిడి కారణంగా విద్యార్థులు మానసికంగా అలసిపోతున్నారు. కొన్నిసార్లు ఈ ఒత్తిడి ఆందోళన, నిరాశ వంటి సమస్యలకు కూడా దారితీస్తోంది. విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకొని నిరంతర విద్యా విధానం అమలు చేయవచ్చు.

అలాగే ఉపాధ్యాయ నియామకాలు, బదిలీలు, శిక్షణ కార్యక్రమాలు వంటి అంశాలను సమన్వయంతో నిర్వహించవచ్చు. వేర్వేరు శాఖల మధ్య ఫైళ్లు వెళ్లడం, అనుమతుల ఆలస్యం వంటి సమస్యలు తగ్గుతాయి. ప్రభుత్వ పథకాలు కూడా ఒకే విధానంలో విద్యార్థులకు చేరే అవకాశం ఉంటుంది. డిజిటల్ విద్య, ఆన్లైన్ పర్యవేక్షణ, విద్యార్థుల డేటా నిర్వహణ వంటి రంగాల్లో సమగ్ర వ్యవస్థను రూపొందించవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఒకే విధమైన పరిపాలనా ప్రమాణాలు అమలు చేయడం సులభమవుతుంది. ప్రస్తుతం కార్పొరేట్ విద్యాసంస్థల్లో కనిపిస్తున్న ర్యాంకుల సంస్కృతి వల్ల విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోందని తల్లిదండ్రులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నియంత్రణ పెరిగితే ఈ పరిస్థితిలో కొంత మార్పు రావచ్చని కొందరు భావిస్తున్నారు.

### ఎన్ఇపి అమలులో భాగమే

ఎన్ఇపి ప్రకారం విద్యను విడివిడిగా కాకుండా సమగ్ర అభ్యాస ప్రక్రియగా చూడాలని సూచించబడింది. చిన్నతనం నుంచి ఉన్నత విద్య వరకు విద్యార్థిలో ఆలోచనా శక్తి, నైపుణ్యాలు, సృజనాత్మకత పెంపొందించే విధంగా విద్యా నిర్మాణం ఉండాలని ఈ విధానం ప్రాధాన్యం ఇస్తోంది.ఇప్పటి వరకు పాఠశాల విద్య,ఇంటర్మీడియెట్ విద్య వేర్వేరు వ్యవస్థల కింద కొనసాగడం వల్ల విద్యార్థుల అభ్యాసంలో నిరంతరత్వం లోపించేది. ఎన్ఇపి సూచించిన 5+3+3+4 నిర్మాణంలో చివరి నాలుగు సంవత్సరాలను సమగ్ర సెకండరీ విద్యగా పరిగణిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్‌ను స్కూల్ విద్య లో భాగంగా చూడడం సహజమైన మార్పుగా ప్రభుత్వం వివరిస్తోంది. అయితే ఎన్ఇపి అమలు పేరుతో ఇంటర్మీడియెట్ ప్రత్యేకత తగ్గిపోకూడదనే అభిప్రాయం కూడా ఉంది. ముఖ్యంగా ఉన్నత విద్య ప్రవేశ పరీక్షలకు అవసరమైన లోతైన అకాడమిక్ శిక్షణ కొనసాగాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

విలీనంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కొంతమేర ప్రయోజనం కలిగే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల విద్య పూర్తయ్యాక ఇంటర్మీడియెట్ చదవడానికి విద్యార్థులు సమీప పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి అనేక చోట్ల కనిపిస్తోంది. దీనివల్ల ఆర్థిక భారం, ప్రయాణ ఇబ్బంది లు, వసతి సమస్యలు తలెత్తుతున్నాయి. ఫలితం గ్రామీణ విద్యార్థుల డ్రాప్‌అవుట్ శాతం తగ్గే అవకాశం ఉంది. ప్రభుత్వ పథకాలు, డిజిటల్ విద్య, ఉచిత పుస్తకాలు, స్కాలర్‌షిప్‌ వంటి సదుపాయా లు సమగ్రంగా అందించడానికి వీలు కలుగుతుంది. గ్రామీణ ప్రాంతా ల్లో విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ఈ విలీనం దోహదపడవచ్చు. ప్రస్తుతం కార్పొరేట్ కాలేజీల ప్రభావం ఎక్కువగా పట్టణ ప్రాంతాలకే పరిమితమై ఉంది. విలీనంతో ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలపడితే గ్రామీణ విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందించే అవకాశం పెరుగుతుంది.

ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలు, డిజిటల్ విద్యా ప్రాజెక్టులు, విద్యార్థి సంక్షేమ పథకాలను కూడా ఒకే విధానంలో అమలు చేయడం ద్వారా నిధుల వినియోగం మరింత సమర్థవంతంగా మారవచ్చు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కొత్త భవనాల నిర్మాణం కంటే ఇప్పటికే ఉన్న వసతులను అభివృద్ధి చేయడం ద్వారా ఖర్చులను తగ్గించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం అనేక ప్రభుత్వ జూనియర్ కాలేజీలు తక్కువ విద్యార్థులతో కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పాఠశాలలు, జూనియర్ కాలేజీలు ఒకే ప్రాంగణంలో ఉన్నప్పటికీ వేర్వేరు పరిపాలనా విధానాల కారణంగా వనరులు పూర్తిస్థాయిలో వినియోగం కావడం లేదు. విలీనంతో ఈ లోపాలను సరిదిద్దే అవకాశం ఉంటుంది.

### విలీనంతో ఎదురయ్యే నష్టాలు

ఇంటర్మీడియెట్ విద్యను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేయడం వల్ల ప్రధానంగా వ్యక్తమవుతున్న ఆందోళనల్లో ఒకటి, ఇంటర్ విద్యకు ఉన్న ప్రత్యేకత తగ్గిపోవచ్చనే భావన. ఇప్పటి వరకు ఇంటర్మీడియెట్ వ్యవస్థ ఒక స్వతంత్ర విద్యా దశగా పనిచేస్తూ, ఉన్నత విద్యకు నేరుగా అనుసంధానమయ్యే కీలక దశగా గుర్తింపు పొందింది. ఈ దశలోనే విద్యార్థులు తమ కెరీర్ దిశను నిర్ణయించుకుంటారు. ఇంటర్ విద్యలో బోధన స్థాయి సాధారణ పాఠశాల విద్యతో పోలిస్తే లోతుగా ఉంటుంది. సబ్జెక్ట్ స్పెషలైజేషన్, కాన్సెప్ట్ క్లారిటీ, విశ్లేషణాత్మక అభ్యాసం వంటి అంశాలు ఇందులో ప్రధానంగా ఉంటాయి. ఈ ప్రత్యేక అకాడమిక్ నిర్మాణం వల్లే విద్యార్థులు ఇంజనీరింగ్, మెడిసిన్, ఇతర ఉన్నత విద్యా కోర్సులకు సిద్ధమవుతారు. విలీనంతో ఈ ప్రత్యేక అకాడమిక్ ఫోకస్ తగ్గిపోతుందేమోనని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్మీడియెట్‌కు ఉన్న ప్రత్యేక బోర్డు, నియమాలు, అకాడమిక్ స్వతంత్రత తగ్గితే నిర్ణయాల నాణ్యతపై ప్రభావం పడవచ్చని కొందరు భావిస్తున్నారు. ముఖ్యంగా సైన్స్, టెక్నికల్ సబ్జెక్టుల్లో లోతైన బోధన అవసరం ఉంటుంది. అది సాధారణ స్కూల్ వ్యవస్థలో సమర్థంగా కొనసాగుతుందా అనే ప్రశ్న ఉంది.అదేవిధంగా పోటీ పరీక్షల దృష్ట్యా ఇంటర్ విద్య ప్రత్యేక పాత్ర పోషిస్తుంది. ఆ పాత్ర తగ్గితే విద్యార్థులు బయటి కోచింగ్ మరింత ఆధారపడే అవకాశం కూడా ఉంది.

విలీనం కారణంగా పోటీ పరీక్షల సిద్ధతపై పడే ప్రభావం. ప్రస్తుతం ఇంటర్మీడియట్ విద్య ప్రధానంగా ఉన్నత విద్య ప్రవేశ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని రూపొందించబడింది. ముఖ్యంగా జెఇఇ, నీట్, ఎంసెట్, సిఎ ఫౌండేషన్ వంటి పరీక్షలకు విద్యార్థులు ఇంటర్ దశ నుంచే ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. ఇంటర్ విద్యా విధానంలో సబ్జెక్ట్ లోతు, పరీక్షా పద్ధతి, అకాడమిక్ ఒత్తిడి ఇవన్నీ పోటీ పరీక్షల అవసరాలకు అనుగుణంగా ఉంటాయి. కానీ పాఠశాల విద్యా విధానం ప్రధానంగా ప్రాథమిక అవగాహన, సాధారణ అభ్యాస పద్ధతులపై ఆధారపడి ఉంటుంది. ఈ రెండు వ్యవస్థలను ఒకే పరిపాలనలోకి తీసుకురావడం వల్ల ఇంటర్ ప్రత్యేకత తగ్గిపోతుందేమోననే ఆందోళన విద్యావేత్తల్లో కనిపిస్తోంది. ప్రత్యేకంగా సైన్స్ విద్యార్థులకు సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, బయాలజీ వంటి సబ్జెక్టుల్లో ఉన్నత స్థాయి బోధన అవసరం ఉంటుంది. పరిపాలనా మార్పుల వల్ల అకాడమిక్ ఫోకస్ తగ్గితే పోటీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభపై ప్రభావం పడే అవకాశం ఉంది.

ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేయడంపై ఉపాధ్యాయ వర్గాల్లో ఎక్కువగా వ్యక్తమవుతున్న ఆందోళన సేవా సమస్యల గురించే. ఇప్పటి వరకు పాఠశాల ఉపాధ్యాయులు మరియు జూనియర్ లెక్చరర్లు వేర్వేరు నియామక విధానాలు, అర్హతలు, సేవా నియమావళి ఆధారంగా పనిచేస్తున్నారు. ఇప్పుడు ఈ రెండు వ్యవస్థలను ఒకే పరిపాలనా కిందకు తీసుకురావడం వల్ల ఉద్యోగ భద్రత, వేతనాల లు, హోదా, పదోన్నతులు, పదవీ విరమణ ప్రయోజనాలు వంటి అంశాలపై అనేక సందేహాలు తలెత్తుతున్నాయి.

జూనియర్ లెక్చరర్ల నియామకానికి సాధారణంగా పిజి అర్హతతో పాటు ప్రత్యేక ఎంపిక విధానం ఉంటుంది. కానీ స్కూల్ టీచర్ల నియామక విధానం వేరుగా ఉంటుంది. ఈ భిన్నతలను ఎలా సమన్వయం చేస్తారనే విషయంలో ఇప్పటికీ స్పష్టత లేకపోవడం ఉపాధ్యాయుల్లో ఆందోళన పెంచుతోంది.

పదోన్నతుల విషయంలో కూడా సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. బదిలీలు కూడా మరో కీలక అంశంగా మారాయి. విలీనంతో ఉపాధ్యాయులను స్కూల్ స్థాయి బోధనకు పంపిస్తారా? లేక ఇంటర్ బోధనకే పరిమితం చేస్తారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఉద్యోగ సంతృప్తిపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

విలీనం కారణంగా ఒకవైపు సమన్వయం పెరుగుతుందని చెప్పబడుతున్నప్పటికీ, మరోవైపు పరిపాలనా భారము గణనీయంగా పెరిగే ప్రమాదం కూడా ఉంది. ఇప్పటివరకు పాఠశాల విద్యాశాఖ ఒక పెద్ద వ్యవస్థగా ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి విద్యను నిర్వహిస్తూ వస్తోంది. దీనికి అదనంగా ఇంటర్మీడియట్ విద్యను చేర్చడం వల్ల వ్యవస్థపై పని ఒత్తిడి మరింత పెరుగుతుంది.

అలాగే విద్యా నాణ్యత ఎలా ఉంటుందో అన్న అనిశ్చితి ముందుకు వస్తోంది. ఇప్పటివరకు ఇంటర్మీడియట్ విద్య ఒక ప్రత్యేక అకాడమిక్ దశగా ఉండి, నిర్దిష్ట బోర్డు, ప్రత్యేక పాఠ్య ప్రణాళిక, మరియు ప్రమాణిత పరీక్షా విధానం ద్వారా కొనసాగుతూ వచ్చింది. మొత్తంమీద తల్లిదండ్రులు, విద్యార్థుల అభిప్రాయాలు ఒకే దిశలో లేవు. ఈ మార్పు ప్రయోజనాలు ఉన్నాయని కొందరు భావిస్తే, మరికొందరు భవిష్యత్ ప్రభావాలపై ఆందోళన చెందుతున్నారు. కాబట్టి ఈ మిశ్రమ స్పందనను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం స్పష్టమైన విధానాలు, నమ్మకాన్ని కలిగించే అమలు ప్రణాళికలు రూపొందిస్తేనే ఈ విలీనం ప్రజల్లో విశ్వాసాన్ని పొందగలదు.

# సమానత్వపు దారులు పడుతున్నాయి



ధీరన్ కొడారి
8008200664

ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా భారతదేశంలో తిష్టవేసి, అనేక సామాజిక రుగ్మతలకు కేంద్ర బిందువుగా మారిన కుల వ్యవస్థను, ప్రక్షాళనచేసే దిశగా నేటి యువత అడుగులు పడుతున్నాయా అనే సందేహం మొదలైంది. ఎందుకంటే కాలక్రమంలో మనిషిలో సహజసిద్ధమైన మార్పులు రావడంతో, సంఘం, సామాజిక స్థితిగతులు, ప్రవర్తన, ఆలోచన సరళిలో సమూల మార్పులకు బీజం పడుతోందనేది ఎంత నిజమో, మన దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న పరిణామాలు రుజువు చేస్తున్నాయని చెప్పాలి. వేల సంవత్సరాలుగా మన భారత దేశ సమాజంలో వెళ్ళూనుకుపోయి ఉన్న కులం పునాదులను కదిలించడం మనం మాట్లాడుకున్నంత సులభం కాదు. అందుకు కాలానుగుణంగా ప్రజల ఆలోచన విధానంలో మార్పులు రావాలి. సాటి మనిషిని మనిషిగా గుర్తించి, గౌరవించే సంఘ నిర్మా ణం వైపు అడుగులు పడాలి. దానికి ఒక్క విద్య మాత్రమే సరిపోదు, విచక్షణతో కూడిన దీర్ఘకాలిక ప్రణాళిక ఎంతో అవసరం.

**కులం కాదు గుణం కావాలి**

దేశంలో కులంపోతే పుట్టుక ఆధారంగా జరిగే వివక్ష అంతమవుతుంది. అందరికీ సమాన అవకాశాలతో పాటు కుల ఘర్షణలు తగ్గి ప్రజల మధ్య సోదరభావం పెంపొందుతుంది. దీనివల్ల అంతర్వర్ణ వివాహాలు పెరిగి రక్త సంబంధాల ద్వారా ప్రజలు ఏకమవుతారనే నిజాన్ని మరిచి, కులాలుగా విభజించడం వల్ల ఒకే సంఘంలో నివసించే మనుష్యుల మధ్య ఎక్కువ, తక్కువ అనే విపతీతమైన అంతరాలు పెరిగాయని గమనించాలి. మనదేశంలో కేవలం కుల వ్యవస్థ వల్ల కలిగే నష్టాలు, సామాజిక, ఆర్థిక పరిణామాలు చాలా లోతైనవి మరియు కొన్ని సమూహాలను తీవ్రంగా ప్రభావితం చేసేవి కూడా అని గుర్తించాలి. వేల ఏండ్ల క్రితం బలవంతంగా రుద్దబడిన ఈ కుల వ్యవస్థ ఎన్ని తరాలు ఊడిగంలో బ్రతికి తనువు చాలించేలా చేసిందో, మరెన్ని తరాల బ్రతుకులను ఎంతగా ప్రభావితం చేసిందో చెప్పడానికి మాటలు చాలవు కదా.! మన దాకా వస్తే 60ఏండ్ల క్రితం ఎటైనా, ఏదైనా ప్రాంతం వెళ్లాలంటే ప్రయాణంలో పక్కవారు మీరు ఏ కులస్తులు అని అడిగే కాలం నుండి మీరు ఎక్కడికి వెళుతున్నారు అని అడిగే దాకా చేరాము అంటే ఇదేదో కాల మహిమ కానే కాదు, మనిషిలో కాలానుగుణంగా వస్తున్న మార్పు లు మాత్రమే అని గ్రహించాలి. అలా కులం పుట్టుక మనిషి మనుగడను నిర్దేశించే స్థితికి చేరిన క్రమం నుండి అదొక అవశేషంగా మిగిలే స్థితికి రాబోతోందని వివిధ రాష్ట్రాల్లో ప్రజల మనో పలకంపై వస్తున్న మార్పులే ఇందుకు రుజువులు.

**కులాన్ని వద్దనుకున్నారు**

తెలంగాణ రాష్ట్రంలో కులగణన (సమగ్ర కుటుంబ సర్వే 202425)ప్రకారం 242 కులాలు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అందు లో కేవలం 10కులాల జనాభా మాత్రమే 60%గా ఉన్నట్టు ప్రకటించింది. వారిలో రాష్ట్ర జనాభాలో 10.3% తో అంటరానివారుగా పరిగణించబడే మాదిగలు మొదటి స్థానంలో ఉండగా, 7.4% తో ముదిరాజులు రెండవ స్థానం, 6.8%తో లంబాడీలు మూడవ స్థానంలో ఉండి ఈ మూడు ప్రధానమైన కులాలుగా నిలవగా, అత్యధిక జనాభా కలిగిన పై మూడు కులాల తర్వాత గణనీయమైన పర్సంటేజ్ తో రాష్ట్రంలో కులాన్ని వద్దనుకున్న వారు సుమారు 14లక్షల మంది జనాభా (రాష్ట్ర జనాభాలో సుమారు 4%) ఉండటం గమనార్హం. అంటే రాష్ట్రాన్ని అత్యంత ప్రభావితం చేసే కులాల జనాభాకు సరితూగేలా, మాల 4.1%, మున్నూరు కాపు 3.9% లాంటి కులాల జనాభాకు తీసిపోకుండా, అలాగే పద్మశాలి 3.3%, రజక 2.8%, కురుమ 2.2%, వైశ్య (కోమటి) 1.4%, కోయ 1.2%, తదితర కులాల కంటే ఎక్కువగా జనాభా కలిగి ఉన్న ఒక సమూహం పరిణామ క్రమంలో కులానికి దూరంగా జరగడం ఆలోచించాల్సిన విషయం.

**కుల రహిత సమాజం వైపు అడుగులు**

బసవాది శరణులు 12వ శతాబ్దంలోనే కుల రహిత సమాజం కోసం ఒక సామాజిక విప్లవాన్ని తీసుకువచ్చి, శరణ మేళాల ద్వారా కృషి చేశారని చరిత్ర చెపుతోంది. కుల నిర్మూలన ద్వారానే సామాజిక సమతుల్యత సాధ్యమని నమ్మిన మహాత్మా పూలే, బాబాసాహెబ్ అంబేద్కర్ లు కలలుగన్న మనిషిని మనిషి గౌరవించే, కుల ఆధారిత వివక్ష లేని సమసమాజం భారతావనిలో సుసాధ్యం చేయడానికి చదువుకున్న నేటి యువత కులాన్ని త్యజించి, కులరహిత సమాజానికి అంకురార్పణ చేస్తున్నారనుకోవాలి. ఎందుకంటే ఒక్కరు కాదు, ఇద్దరు కాదు, చాపకింద నీరులా కులాన్ని వదలాలనే ఆలోచన లక్షలాది మంది మస్తిష్కాలను తొలిచివేస్తుండటం, దాన్ని క్రమ పద్ధతిలో ఆచరణలో పెట్టడం నిశ్శబ్ద విప్లవానికి సంకేతం. అక్షరాస్యులుగా మారి ఉన్నత విద్యకోసం పల్లెను వదిలి, పట్టణ బాట పట్టడం కూడా ఈమార్పుకు మొదటి మెట్టుగా అవగతం చేసుకోవాలి.

ఒకటే దేశం, ఒకటే జాతి, ఒకటే మతం ఉండాలని కోరుకునే కుహానా మేధావులు, రాజనీతిజ్ఞులు ఈ దేశంలో ఒకే కులం ఉండాలి అది మనిషి కులమై ఉండాలని కోరుకోకపోవడం కూడా సంఘంలో సర్వ అనర్థాలకు కారణంగా భావించాలి.

**సమానత్వపు దారులు**

మానవ పరిణామ క్రమంలో ఆటవిక దశను దాటి వ్యవసాయిక దశ ఉద్భవించి మనుషులు కలిసి ఉంటే ప్రగతికి దారులు వేయగలరని, ఏదైనా సాధించగలరనే చారిత్రక నిజాన్ని చాటి చెప్పినా, అనేక అధ్యయనాల ప్రకారం కుల వ్యవస్థలో మార్పులు నిరంతరం జరుగు తున్నప్పటికీ, అది పూర్తిగా అంతరించి పోలేదు. పట్టణ ప్రాంతాల్లో బలహీనంగా ఉన్నట్టు కనపడినా, అంతకంటే గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా బలంగానే ఉందనేది కాదనలేని నిజం. కుల వ్యవస్థ దేశం మీద శాపం లాంటిదని, దేశం ముందున్న సవాళ్ళను ఐక్యంగా ఎదుర్కోవాల్సిన సమయంలో అది మనుషులను విభజిస్తోందని సాక్షాత్తు మన దేశ అత్యున్నత కోర్టు న్యాయమూర్తులే చెపుతున్నప్పుడు ఈ వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం, సమయం వచ్చిందని నేటి చదువుకున్న యువత ఒక అభిప్రాయానికి రావడంలో తప్పులేదు. సమగ్ర కుటుంబ సర్వేలో తాము ఏ కులానికి సంభందించిన వారము కాదని, కులానికి దూరంగా ఉండాలనే కృతనిశ్చయంతో 'నో కాస్ట్' కాలంలో ప్రకటించడం నిజంగా స్వాగతించాల్సిన పరిణామం.

పట్టణాల్లో ప్రాశ్చాత్య మాల్ సంస్కృతిలో భాగంగా డబ్బు సంపాదన కోసం కులాలకు అతీతంగా ఏ కులం వాడు వచ్చినా, ఎంగిలి గ్లాసులు కడిగి, సాయంత్రం ఇంటికి చేరగానే కులం పద్ధతులు ఆచరించే పిడివాద కులవాదుల కంటే, కులాన్ని, కుల ఆలోచనను నిర్ద్వంధంగా పక్కన పెట్టే భావితరాలు ఈ దేశానికి ఎంతో అవసరం.

ఒరిస్సాతోపాటు దక్షిణ భారతావనిలోని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళం తదితర మన పక్క రాష్ట్రాలలో కులం వదులుకుంటున్న వారి జనాభా లక్షల్లోనే ఉండటం దేనికి సంకేతం.

ఈ పరిణామాన్ని నిజంగా కులం పై జరుగుతున్న నిశ్శబ్ద విప్లవంగా అభివర్ణించక మరేమనాలి. ఇలా ఎన్నో అనర్థాలకు కారణం అయిన కులాన్ని వదిలి మనిషిని మనిషి గౌరవించే, సమాన అవకాశలతో కూడిన, కుల రహిత సమాజం రావాలనే ఆలోచన విధానంతో నేటి యువత మానవత్వపు దారులు వేస్తూ లెక్కకు మిక్కిలి మేఘాలు జత కడితేనే నదిగా మారినట్టు ఒక ప్రవాహంలా ముందుకు సాగడం నిజంగా మనదేశ కుల వ్యవస్థకు పెను సవాలుగానే చూడాలి.

# కుమారుడి విషయంలో బండి ఎందుకు స్పందించడం లేదు?

## ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో చిన్న చిన్న విషయాలపై స్పందించి రాద్ధాంతం చేసే కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రమైన లైంగిన వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న తన కుమారుడి విషయంలో ఎందుకు స్పందించడం లేదని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రశ్నించారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ మైనర్ బాలిక పట్ల బండి భగీరథ్ లైంగిక వేధింపులు, ఈ కేసు విషయంలో ఆయన తండ్రి బండి సంజయ్ వ్యవహార శైలి అత్యంత దుర్మార్గమన్నారు. అమ్మాయిదే తప్పని కొందరు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని, ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వంపై నెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆయన గ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. బండి సంజయ్ కుమారుడి కేసుపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, మహిళా ఐపిఎస్ అధికారి ఆధ్వర్యంలో విచారణ జరగుతోందన్నారు. మహిళలను అడ్డం పెట్టుకుని బిజెపి, బిఆర్‌ఎస్‌లు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు.

# విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటం : మంత్రి జూపల్లి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నీట్ పరీక్ష పేపర్ లీకేజీలు, అవకతవకల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పరీక్షను రద్దు చేయాల్సిన పరిస్థితి రావడం బిజెపి కేంద్ర ప్రభుత్వ పాలన వైఫల్యానికి నిదర్శనమని పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. దేశవ్యాప్తంగా వైద్య విద్య ఆశావహులను నీట్ పరీక్ష వ్యవహారం తీవ్ర ఆందోళనలోకి నెట్టిందని, ఈ మొత్తం వైఫల్యానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమే బాధ్యత వహించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహణలో చోటుచేసుకున్న అక్రమాలు విద్యా వ్యవస్థకే మచ్చ తెచ్చాయని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల కష్టాన్ని కేంద్రం తన అసమర్థతతో గంగలో కలిపిందని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ముందునుంచీ హెచ్చరిస్తున్నట్లుగా, రాజ్యాంగబద్ధ సంస్థల నిర్వీర్యమే నేటి ఈ దుస్థితికి కారణమని మంత్రి స్పష్టం చేశారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ శాఖ (భూ సేకరణ)

ఫారం - 6

(చట్టం -30/2013 లోని సెక్షన్ 11 (1) లోని సబ్ రూల్ (1) రూల్ (19) ప్రకారం)

ప్రాధమిక నోటిఫికేషన్

G113743/2025 తేదీ: 25.04.2026
ఫైల్ నెం. C/155/2025, తేదీ: .04.2026

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ఆదేశానుసారం కొండపాకోనిగూడెం మజీర చెర్వుగట్టు గ్రామం, నార్కెట్‌పల్లి మండలం నల్లగొండ జిల్లా లో విస్తీర్ణం: **ఎ.2.39 గుంటల** భూమిని ప్రజా ప్రయోజనార్థం ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్ట్ యందుగల ఉదయ సముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ (U.S.L.I.S) యందలి 7 ఆర్ మైనర్ డి-1 ఎడమ ప్రధాన కాలువ యందు కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.658 వరకు మరియు 9 ఆర్ మైనర్ డి-1 ఎడమ ప్రధాన కాలువ యందు కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.050 వరకు ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించినందున భూ సేకరణ పునరుపాధీ, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 యందు చట్టం 30/2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారిచేయనైనది.

తెలంగాణా ప్రభుత్వం వారు జి.ఓ.యం.ఎస్. నెం.54 ఇరిగేషన్ (ఎల్.ఎ., ఆర్&ఆర్/2ఎ ) కాడ్ & డిపార్ట్‌మెంట్ తేది: 25-07-2017 నాడు జారీ చేసినారు అట్టి జి.ఓ. నందు ఉదయ సముద్రం భూసేకరణ చట్టం 2013 క్రింద అధ్యయము II & III ఈ ప్రాజెక్ట్ నుండి మినహాయించబడినది.

కావున ఈ ప్రాజెక్టు క్రింద కొండపాకోనిగూడెం మజీర చెర్వుగట్టు గ్రామం, నార్కెట్ పల్లి మండలం నల్లగొండ జిల్లా, యందు విస్తీర్ణం **ఎ.2.39 గుంటల** భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాధమిక ప్రకటన జారిచేయనైనది.

షెడ్యూల్

గ్రామం: కొండపాకోనిగూడెం మజీర చెర్వుగట్టు

మండలం: నార్కెట్‌పల్లి జిల్లా: నల్లగొండ

| క్ర. నం. | సర్వే నెం. భూమి స్వభావం ఖుష్కి/ తరి/ పట్టా/ ప్రభుత్వ విస్తీర్ణం | భూసేకరణ చేయు విస్తీర్ణం ఎ.గుం. | భూమిని కోల్పోయే రైతు పేరు తండ్రి/భర్త పేరు | ప్రదేశము పై ఉన్న చెట్లు/ నిర్మాణముల్లో ఉన్న ఇతరములు |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 7 ఆర్ మైనర్ డి-1 ఎడమ ప్రధాన కాలువ యందు కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.658 వరకు | | | | |
| 1 | 607 పట్టా / ఖుష్కి 0.25 | 0.12 1/2 | మేక శేఖర్ రెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి | పైప్‌లైన్, 2 బోర్లు |
| 2 | | 0.12 1/2 | మేక మల్లారెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి | పైప్‌లైన్ |
| 3 | 606 పట్టా / ఖుష్కి 0.33 | 0.33 | కొమ్మనబోయిన అండాలు భర్త యాదయ్య | 1 బోరు, పైప్‌లైన్ |
| 4 | రోడ్డు | 0.04 | రోడ్డు | -- |
| 5 | 605 పట్టా / ఖుష్కి 0.38 | 0.38 | సోమనబోయిన పార్వతమ్మ భర్త యాదయ్య | 3 బోర్లు, పైప్‌లైన్, టేకు చెట్లు-12, వేప-7 |
| 6 | 604 పట్టా / ఖుష్కి 0.13 | 0.03 1/2 | కొమ్మనబోయిన పారిజాత భర్త సత్తయ్య | 1 బోరు |
| 7 | | 0.03 1/2 | కొమ్మనబోయిన అశ్విని భర్త లింగస్వామి | -- |
| 8 | | 0.03 | కొమ్మనబోయిన కీర్తి భర్త కిరణ్ | -- |
| 9 | | 0.03 | పాల్వాయి భగవతి భర్త సత్తిరెడ్డి | -- |
| | మొత్తం | ఎ.2.33 గు.లు | | |
| 9 ఆర్ మైనర్ డి-1 ఎడమ ప్రధాన కాలువ యందు కి.మీ. 0.000 నుండి కి.మీ. 0.050 వరకు | | | | |
| 10 | 598 పట్టా / ఖుష్కి 0.06 | 0.04 | జీడిమడ్ల చలపతి రెడ్డి తండ్రి సత్తిరెడ్డి | 1 బోర్, పైప్‌లైన్ |
| 11 | | 0.02 | జీడిమడ్ల జశ్వంత్‌రెడ్డి తండ్రి శ్రీనివాస్‌రెడ్డి | -- |
| | మొత్తం | ఎ.0.06 గు.లు | | |
| | సరాసరి మొత్తం | ఎ.2.39 గు.లు | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని కేంద్ర భూసేకరణ చట్టం, 2013 (చట్టం నెం. 30/2013) లోని నియమంలోని సెక్షన్ (11) 1 సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, నల్లగొండ ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్ & ఎల్.ఎ.,విభాగం 2, నల్లగొండ మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇరిగేషన్, డివిజన్. నెం. 6, జి.వి.గూడెం, నల్లగొండ గారికార్యాలయములలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా కార్యాలయము పనిదినములలో మరియు పని వేళలలో తనిఖీ చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, నల్లగొండ గారు ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్ & ఎల్.ఎ.విభాగం-2, నల్లగొండ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్-12 ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే, భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టటానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణ కొరకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ముందస్తు అనుమతి లేకుండా, ప్రకటన జారీచేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకాలు, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయములో సంబంధించిన భూ యాజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల, మరియు నష్ట పరిహారము సంప్రదింపుల ద్వారా పరిష్కారం కొరకు చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం జిల్లా కలెక్టర్, నల్లగొండ గారికి లేదా ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్ & ఎల్.ఎ. విభాగము-2, నల్లగొండ గారికి లిఖిత పూర్వకముగా ప్రకటన జారీ చేసిన 60 (అరవై) దినముల లోపల తెలియజేయవలసి ఉన్నది.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్ & ఎల్.ఏ. విభాగం-2, నల్లగొండ
సం/- అదనపు కలెక్టర్ నల్లగొండ
సం/- జిల్లా కలెక్టర్ నల్లగొండ

DIPR RO NO. 184/LA/PP/Advt/Pub/2026-27

# శ్రమకు తగ్గ వేతనాలు

## కార్మిక సంఘాల డిమాండ్




**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** నోయిడా, హర్యానా ఉత్తర్‌ప్రదేశ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు శ్రమకు తగ్గ వేతనం చెల్లించాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. నోయిడాలో పనిచేస్తున్న కార్మికులకు కేంద్ర కార్మిక సంఘాలు, ఇండిపెండెంట్ ఫెడరేషన్లు, అసోసియేషన్లు, యునియన్లు ఐక్యంగా జాతీయ డిమాండ్ల దినోత్సవం, కార్మికుల పోరాటానికి సంఘీభావంగా జాతీయ పిలుపులో భాగంగా ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, సిఐటియు, టియుసిఐ, బిఆర్‌టియు, ఐఎఫ్‌టియు, తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నారాయణగూడ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజు, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మ, బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎస్.బాల్‌రాజు మాట్లాడుతూ గ్రేటర్ నోయిడా మానెస్సర్, గురుగ్రావ్, ఫరిదాబాద్ ఇతర ప్రాంతాలలో జరిగిన సమ్మెపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపి కార్మికులను భయభ్రాంతులకు గురిచేయటాన్ని తీవ్రంగా ఖండించారు. కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పోలీస్ బలగాలతో బల ప్రయోగం చేయడం అన్యాయమన్నారు., 3 నెలలుగా ఉత్తర భారతదేశంలో కార్మికులు తెగించి పోరాడుతుంటే, సమ్మెలు చేస్తుంటే చర్చలు జరిపి సమ్మెను ఆపాల్సిన ప్రభుత్వమే పారిశ్రామిక కార్మికులకు వ్యతిరేకంగా కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేసే కుట్రలను స్వయంగా పాలకులే చేయడం సిగ్గుచేటాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు వి.యస్.బోస్, బి.వెంకటేశం, ఎస్.విలాస్, కాశయ్య, ఐఎన్‌టియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ యాదవ్, ఐఎఫ్‌టియు అరుణ, అనురాధ, సిఐటియు నాయకులు పాలడుగు సుధాకర్ పాల్గొన్నారు.

### నీట్ పరీక్ష రద్దుచేయాల్సి రావడం

# కేంద్ర సర్కారుకు సిగ్గుచేటు : కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీట్ యూజీ 2026 పరీక్ష ప్రశ్నపత్రం లీకేజి కారణంగా ఏకంగా పరీక్షనే రద్దు చేయాల్సిన పరిస్థితి రావడం కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. ఈనెల 3వ తేదీన నిర్వహించిన నీట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ప్రకటించిన నేపథ్యంలో కెటిఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. 2024లో జరిగిన నీట్ పేపర్ లీక్ ఉదంతం నుండి కేంద్రం ఎలాంటి పాఠాలు నేర్చుకోలేదని, ఆ నిర్లక్ష్యం వల్లే ఇప్పుడు మళ్ళీ అదే ఘటన పునరావృతమైందని విమర్శించారు. పరీక్షకు ముందు రోజే వందకు పైగా ప్రశ్నలు లీక్ కావడమనేది వ్యవస్థలో ఉన్న దారుణమైన లోపాలకు అద్దం పడుతోందన్నారు. ఈ వైఫల్యానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని, తక్షణమే విద్యార్థులకు, తల్లిదండ్రులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని కెటిఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీని వెనుక ఎవరున్నా పట్టుకుని, కఠినంగా శిక్షించి, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, సాధ్యమైనంత త్వరగా అత్యంత పకడ్బందీగా నీట్ పరీక్షను తిరిగి నిర్వహించాలని కోరారు.

# తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు

## సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్



**ప్రజాపక్షం/హనుమకొండ :** నీట్ పరీక్షా పత్రాల లీకేజీ, దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రద్దు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఫల్యమేనని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, ప్రశ్నాపత్రాల లీకేజీ అత్యంత ఆందోళనకరమని శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలోనే సుమారు 71 వేల మంది విద్యార్థులు ఎంతో కష్టపడి, భవిష్యత్తుపై ఆశలు పెట్టుకుని పరీక్ష రాశారని, అలాంటి కీలక పరీక్షలో అవకతవకలు విద్యార్థులు, తల్లిదండ్రుల నమ్మకాన్ని దెబ్బతీసిందని తెలిపారు. కేంద్రంలో, రాజస్థాన్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వాల వైఫల్యాల వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న పరీక్షలను సక్రమంగా నిర్వహించలేని దద్దమ్మ ప్రభుత్వం కేంద్రంలో ఉండటం దురదృష్టకరమన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీ ఆరోపణలు దేశ విద్యా వ్యవస్థ పరువును దిగజార్చాయని, ఈ పరిస్థితి కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటని విమర్శించారు. ఈ సంక్షోభానికి పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వమే వహించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలు రాసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తక్కళ్లపల్లి భరోసా ఇచ్చారు.

# సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ

## ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ డిమాండ్

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజ్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపించడంతో పాటు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎన్‌టిఎ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ డిమాండ్ చేశాయి. నీట్ పరీక్షను దాదాపు దేశవ్యాప్తంగా 22 లక్షల మంది విద్యార్థులు రాయగా ప్రశ్నాపత్రం లీకైందని పరీక్షను రద్దు చేస్తున్నట్లు పరీక్ష నిర్వహణ సంస్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ప్రకటించడం పట్ల ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బ తీసే నీట్ పరీక్షను రద్దు చేయాలని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వాన్ని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నా ఏ మాత్రం పట్టించుకోకుండా లక్షలాది మంది ప్రతిభ గల విద్యార్థులను మెడికల్ విద్యకు దూరం చేస్తోందని కసిరెడ్డి మణికంఠరెడ్డిలు విమర్శించారు. దేశంలో ఇప్పటికే నిరుద్యోగం, కార్పొరేట్ విద్యా వ్యవస్థ, కోచింగ్ మాఫియా భారంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులపై ఇది మరో మోసపూరిత దాడి అని వల్లి ఉలాఖాద్రీ, ధర్మేంద్ర అన్నారు. ఇది కేవలం పేపర్ లీక్ కాదని, విద్యార్థుల భవిష్యత్తును అమ్ముకునే విద్యా మాఫియా కుట్ర అని వారు పేర్కొన్నారు. లీకేజీకి పాల్పడిన మాఫియా, అధికారులు, మధ్యవర్తులు, సంబంధిత సంస్థలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

### జాతీయ స్థాయి పరీక్ష నిర్వహణలో

# అవకతవకలు ఆందోళనకరం : మంత్రి పొన్నం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశవ్యాప్తంగా జరిగిన నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై తెలంగాణ రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు హాజరైన కీలకమైన జాతీయ స్థాయి పరీక్ష నిర్వహణలో అవకతవకలు చోటుచేసుకోవడం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. తెలంగాణలోనే సుమారు 71 వేల మంది విద్యార్థులు భవిష్యత్తుపై ఆశలు పెట్టుకుని పరీక్ష రాశారని, అలాంటి పరీక్షలో ప్రశ్నాపత్రాల లీకేజీ ఆరోపణలు వెలుగులోకి రావడం విద్యార్థులు, తల్లిదండ్రుల నమ్మకాన్ని దెబ్బతీసిందన్నారు. కేంద్రంలో, అలాగే రాజస్థాన్‌లో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వాల వైఫల్యాల వల్లే ఈ పరిస్థితి నెలకొందని మంత్రి విమర్శించారు. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం దేశ విద్యా వ్యవస్థ పరువును దిగజార్చిందని, దీనికి పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వమే వహించాలని డిమాండ్ చేశారు. లీకేజీకి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని, విద్యార్థుల భవిష్యత్తు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

# సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు

## గుర్తింపు సంఘం (ఎఐటియుసి)తో సమావేశంలో యాజమాన్యం అంగీకారం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి యాజమాన్యం కీలక నిర్ణయాలు తీసుకుంది. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘం (ఎఐటియుసి) నాయకులతో డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కార్మికులకు సంబంధించిన పలు అంశాలపై సానుకూల నిర్ణయాలు వెలువడ్డాయి. సమావేశంలో గుర్తింపు సంఘం నాయకులు కార్మికులు సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఒక నెలలోపు మెడికల్ బోర్డు ఏర్పాటు చేస్తామని, సొంతింటి పథకంపై వచ్చే స్ట్రక్చర్ మీటింగ్‌లో చర్చించి అమలు విధానాలు ఖరారు చేస్తామని తెలిపారు. పెర్క్స్‌పై ట్యాక్స్ సమస్యలను కూడా అదే సమావేశంలో పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. క్వార్టర్లు ఖాళీ చేసిన వెంటనే వెకేషన్ సర్టిఫికెట్ జారీ చేస్తామని, పెండింగ్‌లో ఉన్న 337 మందికి పైగా డిపెండెంట్లకు ఉద్యోగాలు కల్పించేందుకు చరయలు తీసుకుంటామని యాజమాన్యం వెల్లడించింది. రిటైర్డ్ కార్మికులకు నిలిపివేసిన లాభాల వాటా, దీపావళి బోనస్, పిఎల్‌ఆర్ చెల్లించేందుకు అంగీకరించారు. మిగిలిన సమస్యలను త్వరలో సీఎండీ, డైరెక్టర్(పా) స్థాయిలో జరిగే స్ట్రక్చర్ మీటింగ్‌లో చర్చించి పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఎఐటియుసి అనుబంధ సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శి నారయ్యతో పాటు జిఎం పర్సనల్ కవిత నాయుడు, డీజీఎం పర్సనల్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి వనరుల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు

## వెట్‌ల్యాండ్ రూల్స్ కచ్చితంగా పాటించాలి : మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో చెరువులు, సరస్సులు, నీటి వనరుల పరిరక్షణకు ప్రభుత్వం మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టనుంది. రాష్ట్రంలోని వెట్‌ల్యాండ్స్ గుర్తింపు, సరిహద్దుల నిర్ధారణ, అధికారిక నోటిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర వెట్‌ల్యాండ్ అథారిటీ సమావేశానికి మంత్రి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెట్‌ల్యాండ్స్ పర్యావరణ సమతౌల్యానికి కీలకమని, వాటి పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. వెట్‌ల్యాండ్స్ రూల్స్–2017 నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, చెరువుల సరిహద్దుల గుర్తింపు, డిజిటల్ మ్యాపింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌ఎసి అట్లాస్‌లో గుర్తించిన 12,249 వెట్‌ల్యాండ్స్‌పై గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయిందని అధికారులు వెల్లడించారు. వీటిలో ఇప్పటికే 4,023 వెట్‌ల్యాండ్స్‌కు సరిహద్దుల నిర్ధారణ పూర్తయిందని తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్త సర్వేలు పూర్తి చేసి బ్రీఫ్ డాక్యుమెంట్స్ సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. జిల్లా వెట్‌ల్యాండ్ అథారిటీల నుంచి ఖచ్చితమైన నివేదికలు వచ్చేలా శాఖల మధ్య సమన్వయం పెంచాలని ఆమె పేర్కొన్నారు. ఖమ్మం, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలకు చెందిన ప్రధాన వెట్‌ల్యాండ్స్ సహా 28 ప్రాంతాలకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రతిపాదనలు సిద్ధమైనట్లు సమావేశంలో వెల్లడించారు. త్వరలో ఇవి గెజిట్ నోటిఫికేషన్, ప్రజాభిప్రాయ సేకరణ దశలకు వెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు. అంతర్జాతీయ ప్రాధాన్యత కలిగిన రామ్‌సార్ సైట్‌గా మంజిరా వైల్డ్‌లైఫ్ సాంచురి గుర్తింపు పొందేందుకు పంపిన ప్రతిపాదనపై కూడా సమావేశంలో చర్చించారు. ప్రస్తుతం ఈ ఫైల్ ఇరిగేషన్ శాఖ వద్ద తుది అభిప్రాయాల కోసం ఉందని, అనంతరం కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖకు పంపనున్నట్లు అధికారులు వెల్లడించారు. వెట్‌ల్యాండ్స్‌లో ఆక్రమణలు, ఘన వ్యర్థాల పారవేత, శుద్ధి చేయని మురుగు నీటి విడుదల వంటి కార్యకలాపాలు పూర్తిగా నిషేధితమని మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు స్థానిక స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.



# ఖైదీలలో పరివర్తన తీసుకురావాలి

## జైళ్లలో సంస్కరణలు భేష్ : గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జైలుకు వచ్చిన ఖైదీలు మరోసారి తప్పుచేసే ఆలోచన రాకుండా వారిలో పరివర్తన తీసుకురావాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా జైలు అధికారులకు సూచించారు. ఖైదీలలో ప్రతి ఒక్కరూ క్రిమినల్స్ కాదని, ఆ సమయంలో పరిస్థితులు వారిని నిందితులుగా, దోషులుగా మార్చాయని, ఖైదీలలో మార్పు తీసుకురావడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ చంచల్‌గూడ జైలులో మంగళవారం జరిగిన జైల్ మ్యూజియం, 'ఫీల్ ది జైల్' ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిధిగా గవర్నర్ హాజరయ్యారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్యా మిశ్రా, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఖైదీలను పూర్తిగా బంధించి ఉంచాల్సిన అవసరంలేదని, ఆహ్లాదకర వాతావరణం ఉన్నప్పుడే వారిలో మార్పు తీసుకురాగలమన్నారు. తెలంగాణ పోలీసులు జైళ్లలో చేపట్టిన సంస్కరణలు బాగున్నాయని, ఓపెన్ జైలు విధానం కూడా మంచి ఫలితాలు ఇస్తోందన్నారు. జైల్ మ్యూజియంలో ఉన్నది కేవలం పురాతన సంబంధించిన వస్తువులు కాదని, స్వాతంత్రానికి ముందు జైళ్లు ఎంత అమానవీయంగా ఉండేవో, ఆనాడు జైళ్లలో ఉన్న వారు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో ఈ మ్యూజియం ద్వారా తెలుస్తుందన్నారు. శిక్షల పేరుతో సంస్కారాన్ని, శరీరాన్ని, మనస్తత్వాన్ని విరగ్గొట్టే ప్రయత్నం చేశారని బ్రిటిష్ పాలనలో సాగిన అకృత్యాలను ఆయన వివరించారు. మన కోసం మన పూర్వీకులు పడ్డ కష్టాన్ని తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ప్రజలకు గవర్నర్ సూచించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో తాను పలుమార్లు జైలుకు వెళ్లానని, ఎమర్జెన్సీ సమయంలో 21 రోజులు తాను జైల్లో ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పుడే జైలు ఎలా ఉంటుందో తనకు తెలిసిందని వివరించారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో కళ్యాణ్ సింగ్ ప్రభుత్వంలో జైళ్ల శాఖ మంత్రిగా తాను పనిచేశానని, అప్పుడు కొన్ని సంస్కరణలు చేపట్టానని గుర్తు చేశారు. ఈ సంస్కరణలతో ఖైదీలు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. నేడు మ్యూజియంలో చూసిన దృశ్యాలతో మళ్లీ ఆనాటి జ్ఞాపకాలు తనకు గుర్తుకు వచ్చాయన్నారు.

# రైల్ రోకో కేసులో కవితకు సమన్లు

## నేడు రైల్వే కోర్టుకు హాజరు కావాలని ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన రైల్ రోకో కార్యక్రమం కేసులో తెలంగాణ రక్షణ సేన (టిఆర్‌ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు సమన్లు జారీ అయ్యాయి. బుధవారం ఉదయం 10:30 గంటలకు సికింద్రాబాద్‌లోని సెకండ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ రైల్వే కోర్టుకు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. గతంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో బిసిలకు, విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో రైల్ రోకో కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించిన బిసి బిల్లులకు వెంటనే రాష్ట్రపతి ఆమోదం తెలపాలని కూడా ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఈ రైల్ రోకో కారణంగా సిర్నపల్లి, ఇందల్వాయి రైల్వే స్టేషన్‌ల మధ్య నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. హైదరాబాద్, నిజామాబాద్ మార్గంలో ప్రయాణిస్తున్న గూడ్స్ రైలుకు కూడా అంతరాయం ఏర్పడినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనపై కామారెడ్డి రైల్వే ఎఎస్‌ఐ రవీంద్రబాబు ఫిర్యాదు మేరకు కల్వకుంట్ల కవితతో పాటు మరో 12 మంది టిఆర్‌ఎస్ నాయకులపై కేసులు నమోదు చేశారు. రైల్వే రవాణాకు ఆటంకం కలిగించడం, రైల్వే చట్టాల ఉల్లంఘన వంటి ఆరోపణలతో రైల్వే యాక్ట్ సెక్షన్ 147, 74(ఎ) కింద కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. రైల్ రోకో సందర్భంగా పోలీసులు కల్వకుంట్ల కవితతో పాటు పలువురు టిఆర్‌ఎస్ నేతలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఈ కేసులో భాగంగా బుధవారం జరిగే విచారణకు కవితతో పాటు ఇతర నేతలు హాజరవుతారా లేదా అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. బిసి రిజర్వేషన్ల అంశం తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా మారిన నేపథ్యంలో ఈ కేసు రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది.

# 'మౌనం కాదు.. మద్దతుగా నిలుద్దాం'

## మహిళా భద్రత విభాగం డిజి చారుసిన్హా




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళలపై వేధింపులు, సోషల్ మీడియా ట్రోలింగ్, అసభ్యకర వ్యాఖ్యలపై సమాజం మౌనం వీడాలని పిలుపునిస్తూ తెలంగాణ పోలీస్ మహిళా భద్రత విభాగం చేపట్టిన 'స్టాండ్ విత్ హర్' ప్రచారం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమంగా మారింది. మహిళలపై అన్యాయాన్ని చూస్తూ మౌనంగా ఉండటం కూడా ఒక నేరమే అనే సందేశంతో ప్రారంభమైన ఈ క్యాంపెయిన్‌కు సినీ ప్రముఖులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు పెద్దఎత్తున మద్దతు తెలుపుతున్నారు. హైదరాబాద్‌లో మహిళా భద్రత విభాగం డిజిపి చారు సిన్హా ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ ప్రచారం మహిళల భద్రత కేవలం చట్టాలు, పోలీస్ పర్యవేక్షణతోనే సాధ్యం కాదని, ప్రతి పురుషుడి ఆలోచనా విధానంలో మార్పు వచ్చినప్పుడే నిజమైన రక్షణ సాధ్యమవుతుందని స్పష్టం చేస్తోంది. ఈ ప్రచారానికి హీరో అడివి శేష్ మద్దతు తెలుపుతూ ఇంటర్నెట్‌ను ఒక సముద్రంతో పోల్చారు. మహిళలపై జరిగే ట్రోలింగ్, అసభ్యకర వ్యాఖ్యలు ఆ సముద్రానికి అంటుకున్న ఇసుకలాంటివని, వాటిని తొలగించే బాధ్యత ప్రతి పురుషుడిదేనని పేర్కొన్నారు. అలాగే విరాజిత, దీపక్ కరముంగికర్, శరత్‌నిషా నల్లా, చిల్లర్ బాయ్ తదితర సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు కూడా వీడియోల ద్వారా ప్రచారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. కార్యాలయాల్లో, ఇళ్లలో మహిళల పట్ల గౌరవం పెంచాలని, బాడీ షేమింగ్, పెళ్లిపై వ్యంగ్య వ్యాఖ్యలు, ఉద్యోగ విజయాలను తక్కువ చేసి మాట్లాడే సంస్కృతికి ముగింపు పలకాలని మహిళా భద్రత విభాగం పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా చారు సిన్హా మాట్లాడుతూ, భద్రత అంటే కేవలం పోలీసుల సంఖ్య పెరగడం కాదు, సమాజ ఆలోచనల్లో మార్పు రావడం. మన ఇంటి మహిళలకు ఇచ్చే గౌరవమే బయట ప్రతి మహిళకు ఇవ్వాలి. ఎక్కడైనా తప్పు జరుగుతుంటే మౌనంగా ఉండకుండా ప్రశ్నించాలి. ప్రతి పురుషుడూ ఈ సామాజిక మార్పులో భాగస్వామి కావాలి అని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్యం మరియు పురపాలక ఇంజనీరింగ్ శాఖ

నెం. 29/EE PH/SRD/MDK/2026-27, తేది: 12.05.2026

హైదరాబాద్, సంగారెడ్డి డివిజన్, కార్యనిర్వాహక ఇంజనీర్ (PH) వారి కార్యాలయం నుండి, మెదక్ పురపాలక సంఘంలో TUIFDC రుణ సహాయం కింద చేపట్టే అభివృద్ధి పనుల కోసం ఒక టెండర్ ప్రకటన ఆహ్వానించడమైనది. రూ. 42.50 లక్షల అంచనా విలువ గల ఒక పనిని చేపట్టడానికి ఈ టెండర్ పిలువడమైనది. టెండర్ల ప్రక్రియ 15.05.2026న సాయంత్రం 5.00 గంటల నుండి 22.05.2026న సాయంత్రం 5.30 గంటల వరకు షెడ్యూల్ చేయబడింది. పూర్తి వివరాల కోసం https://tender.telangana.gov.in ను సందర్శించండి.

సం/- కార్యనిర్వాహక ఇంజనీర్ (PH)
ప్రజారోగ్యం, డివిజన్, సంగారెడ్డి

DIPR R.O. No. : 2303-PP/CL/ADVT/2026-27, Date: 12-05-2026

GHMC
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-23.

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీస్

NIT No. 03/EE-23/RJRNZ/GHMC/2026-27, పని పేరు: (1) నెం. పని, అంచనా విలువ : రూ.15.50 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 12.05.2026 సా.5.00గం.ల నుండి, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది: 15.05.2026న సా.5.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: శ్రీ బి.నరేందర్ గౌడ్, ఇఇ, సర్కిల్-23, ఆర్‌జెఎన్‌ఆర్‌జెడ్, జిహెచ్‌ఎంసి, ఫూల్‌బాగ్, హైదరాబాద్. ఫోన్ నెం. 9989930608. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-23, చంద్రాయణగుట్ట, ఆర్‌జెఎన్‌ఆర్‌జెడ్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 2307-PP/CL/ADVT/2026-27 Date: 12-05-2026

# పేదవారి ఆత్మగౌరవ ప్రతీక సొంత ఇళ్లు

**లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే నాగరాజు**



**ప్రజాపక్షం/హనుమకొండ:** పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి పేద కుటుంబానికి గూడు – నీడ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. హన్మకొండ సుబేదారి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 2, 46, 56, 64 డివిజన్ల పరిధిలోని 61 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఎమ్మెల్యే నాగరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను అభినందిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకుని పథకం ద్వారా అందే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, "పేదవారి ఆత్మగౌరవ ప్రతీక సొంత ఇల్లు" అని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇంటి స్థలం, భూమి పత్రాలు ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం 400 నుంచి 600 చదరపు అడుగుల మధ్య ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం నాలుగు దశల్లో మొత్తం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తుందని వివరించారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తయిన తర్వాత రూ.1 లక్ష, గోడల నిర్మాణం అనంతరం రూ.1 లక్ష, స్లాబ్ పూర్తయిన తర్వాత రూ.2 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయిన అనంతరం మరో రూ.1 లక్ష నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. ఈ సహాయం గ్రీన్ చానల్ ద్వారా పారదర్శకంగా అందజేయబడుతుందని స్పష్టం చేశారు.ఇల్లు నిర్మాణం జరుగుతున్న సమయంలో ప్రతి లబ్ధిదారుడి ఇంటికి స్వయంగా వచ్చి పరిశీలిస్తానని, ఒక కుటుంబ సభ్యుడిలా అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. లబ్ధిదారులు త్వరగా ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించి పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైతే మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎవరికైనా బ్యాంకు ఖాతాలు లేకపోతే తన సొంత ఖర్చుతో ఖాతాలు తెరవించేందుకు సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.అలాగే ఇళ్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేని లబ్ధిదారులకు అవసరమైతే ఆస్ట్రానిక్ కంపెనీ సహకారంతో ఇండ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరూ అధైర్యపడవద్దని, ప్రతి అర్హులైన లబ్ధిదారుడికి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నాగరాజు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో 2, 46, 56, 64 డివిజన్ల సంబంధించిన నాయకులు, కార్యకర్తలు , మహిళలు, యూత్ నాయకులు, లబ్ధిదారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌సర్కారుతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే దొంతి



**ప్రజాపక్షం/నల్లబెల్లి:** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని నర్సంపేట ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి అన్నారు. మంగళవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియార్ నాయకులు మాజీ ఎంపిటిసిలు వైనాల వీరస్వామి, జన్ను జయ రావుతో పాటు సామల దేవేంధర్‌లు బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి హన్మకొండలోని ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా కండువాలు కప్పినారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ దొంతి మాధవ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రజలకు అందించుటలో ముందున్నదని, అభయాస్తం ఆరు గ్యారంటి పథకాలను అమలు చేసి తీరుమని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాట ఇస్తే తప్పమని అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచితబస్సు సౌకర్యం కల్పించి మహిళల ఆత్మగౌరవాన్ని నిలబెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తిని మల్లయ్య, మాసంపెల్లి అఖిల్, మోర్తాల మనోహర్, ముర్కి రవి, గుండ్లపహాడ్ మాజీ సర్పంచు కద్దూరి కట్టయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు పురుషోత్తం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకులు ప్రజలకు మరింత చేరువ కావాలి: ఎమ్మెల్యే గండ్ర



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సహకార బ్యాంకుల వ్యవస్థ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటివని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి నియోజకవర్గంలోని మొగుళ్లపల్లి మండల కేంద్రంలో వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ నూతన బ్రాంచ్ ను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని నూతన బ్రాంచ్ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సహకార బ్యాంకులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలుగా నిలుస్తాయని అన్నారు. రైతులు, మహిళా సంఘాలు,చిన్న వ్యాపారులు సులభంగా రుణ సదుపాయాలు పొందేందుకు ఈ కొత్త బ్రాంచ్ ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ కావడం ద్వారా ఆర్థికాభివృద్ధికి దోహదం అవుతుందని పేర్కొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సహకార బ్యాంకుల పాత్ర ఎంతో కీలకమని, రైతులకు అవసరమైన సమయంలో ఆర్థిక సహాయం అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలు డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకొని పొదుపు అలవాటు పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

**ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ**

మొగుళ్ళ పల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 33 మంది లబ్ధిదారులకు 11,21,500/ రూపాయల విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఇవిఎం గోదాంలో కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/ములుగు:** ఇవిఎం గోదామును జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు నెలవారి తనిఖీ నిర్వహించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు కలెక్టరేట్ ఆవరణలోని ఈవిఎం గోదామును వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెలవారి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్‌ను తనిఖీ చేశారు. గోదాంలో అమర్చిన సిసి కెమెరాల పనితీరును, అగ్ని ప్రమాదాలు జరగకుండగా ముందస్తుగా ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్టింగిషర్లను ఇతర అగ్నిమాపక పరికరాలను తనికీ చేశారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. గోదాం వద్ద ఉన్న పోలీస్ బందోబస్తును, రిజిస్టర్లను కలెక్టర్ తనిఖీ చేశారు. భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం వహించకూడదని సెక్యూరిటీ సిబ్బందికి సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనే గోదాం తనిఖీ చేయడం జరిగిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సెల్ సూపరింటిండెంట్ ఎండి సలీం, సీనియర్ అసిస్టెంట్ మనోహర్, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, సంబంధిత అధికారులు,పాల్గొన్నారు.

## ఎల్లమ్మ దేవాలయ ప్రతిష్ఠాపనలో టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/దామెర :** హనుమకొండ జిల్లా దామెర మండలం ముస్త్యాల పల్లి గ్రామంలో బొల్లం లక్ష్మ ణ్ మంజుల ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టిన శ్రీ ఎల్లమ్మ తల్లి దేవాలయ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, డీసీసీ అధ్యక్షులు, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గార్లతో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందించారు.అనంతరం మాట్లాడుతూ గ్రామ దేవతల ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, తెలంగాణ రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పూర్తి మద్దతు కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/ములుగు:** బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులు మౌలిక సదుపాయాలు కల్పించాలని, వేసవి దృష్ట్యా మున్సిపాలిటీ పరిధిలో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ములుగు జిల్లా తాత్కాలిక బస్టాండ్ ఆవరణలో పరిసరాలను ములుగు మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రకృతి వనాన్ని చలి వేంద్రాలను పరిశీలిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా తాత్కాలిక బస్టాండ్ ఆవరణ పరిసరాలను పరిశీలించి బస్సులు సమయాపాలన, వసతుల కల్పన పలు అంశాలను అడిగి తెలుసుకొని తప్పనిసరిగా ప్రయాణికులకు మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. పట్టణ ప్రకృతి వనాన్ని పరిశీలించి మొక్కలు ఎండి పోకుండా సమృద్ధిగా నీరు అందించాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు రద్దీ ఉండే ప్రదేశాలలో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ జనగాం సంపత్ రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సబ్ సెంటర్‌ల్లో వైద్య సేవలు అందించాలి: సిపిఐ వినతి

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మండలంలోని తమ్మడపల్లి జి గ్రామలో లక్షలు వెచ్చించి నిర్మించిన సబ్ సెంటర్లో వైద్య సేవలు అందించాలని సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు వడ్లకొండ సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది సురేష్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు అందాక కార్పొరేట్ హాస్పిటల్‌కు వెళ్లలేక పేదలు కష్టాలపాలవుతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉన్నతాధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతంలో ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వేల్పుల పెద్ద రాములు, ఎండీ యాకూబ్ పాషా, అజయ్, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గూడూరులో మొక్కజొన్న రైతుల ఆందోళన

**కొనుగోలు కేంద్రాల వద్ద నెల రోజులుగా నిరీక్షణ**
**లారీలు లేక తీవ్ర ఇబ్బందులు**
**బస్టాండ్ సెంటర్‌లో ధర్నా**



**ప్రజాపక్షం/గూడూరు:** గూడూరు మండలంలోని మొక్కజోన్న రైతులు సమస్యల రోజు రోజుకు తీవ్రమవుతున్నాయి.కొనుగోలు కేంద్రాల్లో నెల రోజులగా పంట నిల్వ ఉండిపోవడం లారీలు అందుబాటులో లేక ధాన్యం తరలింపులో తీవ్ర జాప్యం చోటుచేసుకోవడంతో రైతులు అగ్రహం వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో సోమవారం గూడూరు మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో పెద్ద ఎత్తున రైతులు ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నివాదాలు చేశారు. రైతులు మాట్లాడుతూ వర్షాలు పడే పరిస్థితులు ఉన్నప్పటికి కొనుగోలు కేంద్రాల వద్దే కాపలా కాస్తూ రోజుల గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పంటను విక్రయించేందుకు కేంద్రాలకు తీసుకొచ్చినప్పటి నుంచి సరైన ఉర్పాట్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.లారీలు సమయానికి రాకపోవడంతో టోడింగ్ ప్రక్రియ నిలిచిపోగా గన్నె సంచులు కొరత కార్మికుల సమస్యలు కూడా రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో మొక్కజోన్న నిల్వలు పేరుకుపోవడంతో తేమ పెరిగి పంట నాణ్యత వుబ్బతింటుందనే భయం రైతుల్లో నెలకొంది. ఇప్పటికి అప్పులు చేసి సాగు చేసిన పంట అమ్ముడుపోకపోవడంతో ఆర్థికంగా తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నామని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు.ప్రభుత్వం వెంటనే స్పందించి అదనపు లారీలు ఏర్పాటు చేసి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని వారు డిమాండ్ చేశారు. ధర్నా కారణంగా బస్టాండ్ ప్రాంతంలో కొంతపేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న గూడూరు సిఐ విజయకుమార్ అక్కడి కి చేరుకుని రైతులతో మాట్లాడి పరిస్థితి ని అదుపులోకి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీకుంటామని హామి ఇవ్వడంతో రైతులు ఆందోళ విరమించారు.

## 'సర్' మ్యాపింగ్ ప్రక్రియ పూర్తిపై ప్రత్యేక దృష్టి

**కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**ప్రజాపక్షం/హనుమకొండ:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేసే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ ) ప్రక్రియను మరింత వేగవంతం చేయడంపై జిల్లా అధికారులు, తహసిల్దార్లతో సమీక్షా సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వారిగా ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి గురించి అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి చేయడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 146 పోలింగ్ కేంద్రాలలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ తక్కువగా ఉందని, దీంతో 34 పోలింగ్ కేంద్రాలకు మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి సాధించేలా పర్యవేక్షించేందుకు 46మంది జిల్లా అధికారులను నియమించినట్లు తెలిపారు. బూత్ లెవల్ అధికారులతో ఇంటింటికి తిరుగుతూ 2002 ఓటర్ల జాబితా వివరాలను సేకరించి 2025 ఓటర్ల జాబితాతో అనుసంధానం చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ 70శాతం వరకు పూర్తి చేయాలన్నారు. అధికారులు తమ కార్యాలయ పరిధిలో ఉన్న ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులతో ఎస్ఐఆర్ మ్యాపింగ్ చేయించాలన్నారు. బుధవారం నుండి వారం రోజుల్లోగా ప్రతి పోలింగ్ కేంద్రంలో 70శాతం కంటే పైగా ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. సోమవారం ఎస్ఐఆర్ పురోగతిపై అధికారులతో తిరిగి సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి చేయడంపై అధికారులు పూర్తిస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, జడ్పీ సీఈవో శేషాద్రి, డీఆర్డీవో మేన శ్రీను, జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, పలు శాఖల జిల్లా అధికారులు, తహసిల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం దిగుమతిలో ఇబ్బందులు సృష్టిస్తే మిల్లర్లపై చర్యలు



**ప్రజాపక్షం/జనగామ:** ధాన్యం దిగుమతిలో రైతులకు ఇబ్బందులు కలిగించేలా మిల్లర్లు వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా హెచ్చరించారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండ వచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకునేందుకు ప్రధాన్యత ఇవ్వాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బెన్షాలోమ్‌తో కలిసి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ధాన్యం దిగుమతులపై అధికారులలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రబీ ధాన్యం దిగుమతుల్లో జాప్యం జరిగితే ఊరుకునేది లేదన్నారు. మిల్లులకు వచ్చిన ధాన్యం లారీలకు త్వరగా దిగుమతి చేసుకోవాలని, లారీలు తిరిగిరి కొనుగోలు కేంద్రాలకు వెళ్లెతా చూడాలన్రాను. అవసరమైతే అదనపు హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని, ఓపెంఎస్ నమోదు, మిల్లర్ల ధృవీకరణ పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. పౌరసరఫరా శాఖ అధికారులు ప్రతి మిల్లును సందర్శించి ధాన్యం దిగుమతిపై ప్రత్యేక శ్రద్ధ వహించి పర్యవేక్షించాలన్నారు. ధాన్యం బస్తాల రవాణా విషయంలో స్పందించన లారీ డ్రైవర్లపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఏ కేంద్రానిక కేటాయించిన లారీ అదే కేంద్రానికి తరలి వెళ్లాలని, ధాన్యం బస్తాల రవాణా పరంగా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ధాన్యం బస్తాల నిలువ కోసం గోదాంలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి హతిరామ్, జిల్లా మార్కెటింగ్ అధికార రామకృష్ణ, ఇంఛార్జీ డిఇసి ఎస్ఓ సురేష్‌రెడ్డి, ఏపిడి నూరోదిదన్, రవాణ అధికారి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.


## మొక్కజొన్న రైతులు సహకరించాలని ఝాన్సీ విజ్ఞప్తి



**ప్రజాపక్షం/కమలాపూర్:** కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ యాడ్ నందు మార్క్ షెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్న మక్కలు అధిక సంఖ్యలో రావడం వల్ల స్థలం లేక వచ్చిన రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతులు మూడు రోజుల తర్వాత మార్కెట్ మక్కలు తరలించే విధంగా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి రవీందర్ తెలిపారు. ప్రస్తుతం మార్కెట్ లో ఉన్న మక్కలను కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసి అన్‌లోడ్ అయిన తర్వాత మిగతా రైతులు మక్కలను మార్కెట్ కు తీసుకురావాలని చైర్మన్ విజ్ఞప్తి చేశారు.


## వరంగల్‌లో రెచ్చి పోతున్న చైన్ స్నాచర్లు

**ఒకే రోజు నగరంలో మూడు చోట్ల చైన్ స్నాచింగ్**



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్:** వరంగల్ నగరంలో చైన్ స్నాచర్లు రెచ్చిపోతున్నారు. నగరంలోని కాలనీలలో ఇంటి ముందు కూర్చున్న వారిని కూడా వదిలిపెట్టడం లేదు. బైకులపై వచ్చి మెడలో ఉన్న చైన్స్ లాక్కెళ్తున్నారు.ఒక్కొక్క బైక్ పై ఇద్దరు లేదా ముగ్గరు వచ్చి బంగారు చైన్లు తెంపుకొని వెళ్తున్నారు. వరంగల్ లో మూడు చోట్ల సోమవారం రాత్రి చైన్ స్నాచింగ్ జరిగింది. ఇంటి ముందు కూర్చున్న వారిని టార్గెట్ చేసి మెడలో నుంచి చైన్లను ఎత్తుకెళ్లిపోయారు. వరంగల్లోని కాసిబుగ్గ సొసైటీ కాలనీలోని రోడ్ నెంబర్3లో రాత్రి దీపా శ్రీ అనే మహిళ ఇంటి బయట పిల్లలకు అన్నం తినిపిస్తుండగా పల్సర్ బైక్ పై వచ్చిన ముగ్గరు దుండగులు మెడలో చైన్ ను లాక్కెళ్లారు.చూస్తుండగానే కళ్లముందే చైన్ తెంపుకు పోవడంతో ఆ మహిళ మొత్తుకోగా పక్కన ఉన్న ఇళ్ల వారు వచ్చే లోపే దొంగలు పారిపోయారు. నగరంలోని క్రిస్టియన్ కాలనీలో అడ్వకేట్ మైదం వివేక్ ఇంటి ముందు కూర్చోనుండగా పల్సర్ బైక్ పై వచ్చిన ముగ్గరు యువకులు మెడలో చైన్ లాక్కెళ్లారు. కాలనీలో తిరుగుతూ ఎవరూ లేని సమయంలో లాక్కెళ్లారు. హన్మకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నైమ్ నగర్ లోని లోటస్ కాలనీలో రాత్రి మహిళ మెడలోంచి మూడు తులాల చైన్ ను లాక్కెళ్లారు.పల్సర్ బైక్ పై వచ్చిన ఇద్దరు దుండగులు గొలుసును తెంపుకెళ్లారు. మూడు చోట్ల సోమవారం రాత్రి ఒకే తీరున చైన్ స్నాచింగ్ జరగడంతో పలు కాలనీలో ఆందోళన నెలకొంది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చైన్ స్నాచింగ్ వల్ల లాయర్ వివేక్ కు కొంత గాయం కాగా ఆసుపత్రిలో చికిత్స చేశారు. పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా దొంగల కోసం గాలిస్తున్నారు. వరంగల్ లో ఒకే రోజు మూడు చోట్ల జరగడంతో దర్యాప్తు పోలీసులు కూడా పూర్తిస్థాయిలో కొనసాగిస్తున్నారు. గడిచిన నెల రోజుల్లో పలు చోట్ల చైన్ స్నాచింగ్ జరగడం వల్ల సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చైన్ స్నాచర్లను పట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## కాంగ్రెస్ నాయకుడు వెంకన్నకు ఎమ్మెల్యే నివాళులు



**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తంగళ్లపల్లి వెంకన్న హార్ట్ స్ట్రోక్‌తో మంగళవారం మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని వెంకన్న పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి దైర్యం చెప్పారు కాంగ్రెస్ తరపున కుటుంబానికి అండగా ఉంటామని హామి ఇచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తంగళ్లపల్లి వెంకన్న కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో పనిచేసిన నాయకుడని ఆయన మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమ్మాలునాయక్ చంటి స్వామి ఎండి రసూల్ పలువురు నాయకలు పాల్గొన్నారు.

## సిపిఐ సానుభూతిపరుడు వెంపటి ప్రభాకర్ కన్నుమూత



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 32వ వార్డుకు చెందిన సిపిఐ సానుభూతిపరుడు వెంపటి ప్రభాకర్(70) అనారోగ్యంతో ఇంటి వద్ద మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంత్‌రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ భౌతికకాయాన్ని సందర్శించి ఎర్రజెండాను కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, 28వ వార్డు కౌన్సిలర్ దండి రంగారావు, మున్సిపాలిటీ సిపిఐ నేతలు మిడకంటి పెద్ద వెంకట్‌రెడ్డి, చెరుకుపల్లి భాస్కర్, వెన్నం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## విఎఒల సమస్యల పరిష్కారానికి సమ్మె నోటీసు



ప్రజాపక్షం/కూసుమంచి: రాష్ట్ర జెకెపి విఎఒ జాయింట్ యాక్షన్ కమిటీ(జెఎసి)ఆధ్వర్యంలో విఎఒల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ మేరకు కూసుమంచి ఎస్ఐకు సమ్మె నోటీసు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ప్రభుత్వం సమస్యలను వెంటనే పరిష్కరించని పక్షంలో ఈనెల 18వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా శాంతియుత నిరవధిక సమ్మె చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. విఎఒలు గ్రామీణ ప్రాంతాల్లో కీలక సేవలు అందిస్తున్నప్పటికీ సరైన వేతనాలు, ఉద్యోగ భద్రత, సంక్షేమ సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు వడ్డెబోయిన జయమ్మ, ఉపాధ్యక్షురాలు దోమల రజని, కార్యదర్శి లోడిగ మంతాయి, సహాయ కార్యదర్శి షేక్ నసీమ, కోశాధికారి జి. ప్రమీలతో పాటు పలువురు విఎఒలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు.. వేగవంతం చేయండి: కలెక్టర్

### అధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలి



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : రానున్న 15 రోజుల్లో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు అత్యంత కీలకమని, అధికారులంతా సమన్వయంతో కొనుగోళ్ల వ్యవహారాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి నుండి జిల్లాలోని అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైతే మొక్కజొన్న నిల్వలు ఉన్నాయో వాటిని గుర్తించి వెంటనే సమీప గోదాములకు పంపాలన్నారు. గోదాముల సమస్య తలెత్తితే అప్పటికప్పుడు ఫంక్షన్ హాళ్లు, పాఠశాల భవనాలు, ఇతర భవనాలను వినియోగించుకోవాలన్నారు. రవాణా విషయంలో నిర్లక్ష్యం వహించరాదని, ఈ కొనుగోలు ప్రక్రియలో పోలీస్ శాఖ సహకారం కూడా తీసుకోవాలన్నారు. కొనుగోళ్ల నివేదకలు నిరంతరం రూపొందించాలని, అదనపు కలెక్టర్, డిసిఎస్ఒ, డిటిఒ, సివిల్ సప్లై అధికారులు సమస్యలు తలెత్తకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, వాతావరణశాఖ హెచ్చరికలు ఎప్పటికప్పుడు రైతులకు చేరవేయాలని అధికారులు అందుబాటులో ఉండి మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## నేడు దుకాణ సముదాయాలకు వేలం పాటలు



ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి మండలం విశ్వనాథపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్డులో నిర్మించిన దుకాణ సముదాయాలకు నేడు బుధవారం వేలంపాటలు నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ ఇస్లావత్ రాజు, కార్యదర్శి నాగలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ వ్యాపార అవసరాలకు అ నుగుణంగా మూడు షాపింగ్ కాంప్లెక్స్‌లను ఆధునిక సౌకర్యాలతో ఏర్పా టు చేసినట్లు పేర్కొన్నారు. వ్యాపారవేత్తలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని వేలంపాటల్లో పాల్గొని, దుకాణ సముదాయాలను పొందాలని కోరా రు. విశ్వనాథపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయంలో నిర్వహించే ఈ వేలంపాటలకు ఎంపీడీవో మల్లెల రవీంద్ర ప్రసాద్, డీపీవో రాంబాబు ము ఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్ర జాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, గ్రామస్తులు పాల్గొననున్నట్లు వెల్లడించారు.

## బండి సంజయ్‌ను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలి



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో బండి సంజయ్‌ను కేంద్రమంత్రి పదవి నుంచి వెంటనే తొలగించాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ప్ల కార్డులు పట్టుకుని కేంద్రం, , రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మైనర్ బాలికపై లైంగిక దాడి ఘటనలో బండి సాయిభగీరథపై పోక్సో కేసు నమోదైనప్పటికీ ఇప్పటి వరకు అరెస్టు చేయకపోవడంపై బిఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి పదవి నుంచి వెంటనే తొలగించాలని, తన పదవి ప్రభావంతో కుమారుడిని కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వెంటనే భగీరథను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉదయ్‌జ్యోతి, జుజ్జురి వెంకన్నబాబు, కాసాని పద్మ, చంద్రమోహన్, సంపూర్ణ, మాజీ జెడ్పిటిసి సున్నం నాగమణి, జుజ్జురపు శ్రీరామ్మూర్తి , గుడవర్తి వెంకటేశ్వరరావు, మోటూరు మోహన్, స్వరూపరాణి, జీవన్‌రావు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ అమలులో ప్రభుత్వం విఫలం

### నిధుల మంజూరులో సర్కార్ నిర్లక్ష్యం
### పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
### ఎమ్మెల్యే కూనంనేని



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : మిషన్ భగరీథ పథకం అమలులో ప్రభుత్వం విఫలమైందని, ప్రజల తాగు నీటి అవసరాల కోసం నిధులు మంజూరు చేయకుండా పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, సమస్యల పరిష్కారాల్లో చిత్తశుద్ధి లేకుంటే ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓవర్ హెడ్ ట్యాంకులు, రిజర్వాయర్లు, పైపులైన్ల నిర్మాణం, బోర్ల తవ్వకాల పనుల పురోగతిపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. పనుల్లో చోటు చేసుకుంటున్న నిర్లక్ష్యంపై ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ నిధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేదే లేదని అధికారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రజల తాగునీటి అవసరాల కోసం నిధులు మం జూరు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీరు ఏ మాత్రం ఆ శాజనకంగా లేదని మండిపడ్డారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చెప్పుకుంటున్న మిషన్ భగీరథ పథకం క్షేత్రస్థాయిలో విఫలమైందని, పనుల నిర్వహణలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. నిధులు మంజూ రీ విషయంలో ప్రభుత్వం చూపుతున్న వివక్షపై ఆయన నిప్పులు చెరిగారు. నీటి సమస్యల పరిష్కారం కోసం తాను అందించిన ప్రతిపాదనలను ప్రభుత్వం ప్రక్కన పెట్టడంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. వేసవి దృష్ట్యా ప్రజ లు నీటి కోసం అల్లాడకుండా నిరంతరం శుద్ధ జలం సరఫరా జరిగేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. నిధుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, ప్రస్తుతం ఉన్న వనరులతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో అధికారులు తిరుమలేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సా బీర్ పాషా, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## అవినీతి రహిత ఆదర్శ నేత తుమ్మల

### ఎమ్మెల్యే కూనంనేని



ప్రజాపక్షం/చుంచుపల్లి : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే కాక రాష్ట్రంలోనే అవినీతి రహిత ఆదర్శ నేతగా తుమ్మల నాగేశ్వరరావు చెరగని ముద్ర వేసుకున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలోని కమ్మ వారి కల్యాణ మండపంలో రాజకీయాలకు అతీతంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సభకు ఎమ్మెల్యే కూనంనేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి ఆయన అభిమానులతో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధిలో మంత్రి తుమ్మల అగ్రగామిగా నిలుస్తారని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే కాక రాష్ట్రంలోనే అవినీతి రహిత ఆదర్శ నేతగా చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. ఆయన ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేస్తారు గానీ గెలిచిన తరువాత ఏ పార్టీ నాయకుడికి అయినా ఏ పనినైనా చేసి పెడతారని అలాగే నేను రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ప్రతిసారీ ఆయన సహకారం మర్చిపోలేనిదని అన్నారు. అలాగే వామపక్షాలతో పొత్తు ధర్మానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిన నేత తుమ్మల అని అన్నారు. నలుగురు ముఖ్యమంత్రుల వద్ద పనిచేసిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. అలాగే ఆయన ఇంకా నలభై సంవత్సరాలు రాజకీయంలో ఉంటూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మున్సిపల్ కమిషనర్ మూడ్ గణేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి

### ఎఐటియుసి వినతి



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు నగర దీపికలకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ కల్లూరులోని కమిషనర్ రాజశేఖర్ కు ఎఐటియుసి ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందించారు. గత 8 నెలలుగా మున్సిపాలిటీ పరిధిలోని ఉన్న నగర దీపికలకు వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కుటుంబం గడవడం ఇబ్బందికరంగా ఉందని వారికి చెల్లించాల్సిన వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా వేము ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ నూతన మున్సిపాలిటీగా ఏర్పడి నెలలు దాటిన కూడా వేతనాలు అందించకపోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని 8 నెలలుగా వేతనాలు అందకపోవడంతో నిత్యవసరాలు కొనుగోలుకు జీవనభారం ఇబ్బంది కరంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం వారికి అందించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని స్వయం సహాయక సంఘాల వారికి ప్రతిరోజు బ్యాంకు రుణాలు స్త్రీ నిధి రుణాలు జీవనోపాధి, స్వయం ఉపాధి కొరకు రుణాలను అందించి వారి ఆర్థిక అభివృద్ధికి కుటుంబాభివృద్ధికి ప్రభుత్వం తరపున సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ప్రభుత్వం ఎనిమిది నెలలు దాటిన కూడా వేతన బకాయిలు చెల్లించడంలో ఆలస్యం, నిర్లక్ష్యం వహిస్తుందని పేర్కొన్నారు. కొద్ది రోజుల్లో వేతనాలను చెల్లించనిచో దశల వారి ఆందోళనలకు సిద్ధమవుతామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో నగర దీపికలు జొన్నలగడ్డ కుమారి, రమాదేవి, అనూష, పుల్లమ్మ, రామలక్ష్మి, షాహిదా బేగం, రమాదేవి, పద్మ, లక్ష్మి, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హయాంలోనే పల్లె రవాణా మెరుగు

### ఎమ్మెల్యే ఆదినారాయణ



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పల్లె రవాణా మెరుగుపడిందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండల గ్రామీణ ప్రజలకు మరింత రవాణా సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే కృషితో అశ్వారావుపేట బస్ డిపోలో నూతనంగా ఏర్పాటు చేసిన కొత్తగూడెం అశ్వారావుపేట నూతన బస్ సర్వీస్‌ను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సర్వీస్ ములకపల్లి, జగన్నాథపురం, గుండిముత్యాలమ్మ ఆలయ ప్రాంతం మీదుగా రెడ్డిగూడెం, తిరుమలకుంట, వినాయకపురం వైపుగా ప్రయాణిస్తూ మండలంలోని పలు గ్రామపంచాయతీల ప్రజలకు జిల్లా కేంద్రానికి చేరుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా మారనున్నదని తెలిపారు. అదే విధంగా సత్తుపల్లి డిపో నుంచి భద్రాచలం వరకు మరో నూతన పల్లెవెలుగు సర్వీస్ కూడా ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజల విద్య, వైద్యం, ఉద్యోగాలు, ప్రభుత్వ కార్యాలయాల అవసరాల కోసం సులభంగా ప్రయాణించే అవకాశం కల్పించడమే ఈ కొత్త బస్ సర్వీసుల ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో రెండు డిపోల మేనేజర్లు రాజ్యలక్ష్మి, లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ విజయ, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 16న రాష్ట్ర మహిళా సమాఖ్య సభలు



ప్రజాపక్షం/వైరా: రాష్ట్ర మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా 22వ మహాసభలను జయప్రదం చేయాలని మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పోటు కళావతి, కార్యదర్శి ఏపూరి లతాదేవి అన్నారు. మంగళవారం వైరాలో ఆహ్వాన పత్రాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల16న వైరాలో కమ్మవారి కల్యాణ మండపం నందు జరిగే తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య 22వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఈ సభ విజయవంతం చేసేందుకు పెద్ద ఎత్తున మహిళలు తరలిరావాలని అన్నారు. ముఖ్య అతిథిగా నేదునూరి జ్యోతితో పాటు పలువురు మహిళా నాయకురాళ్లు పాల్గొననున్నారని అన్నారు. 8 దశాబ్దాల స్వతంత్ర భారతదేశంలో మహిళల పట్ల నేటికి వివక్ష కొనసాగుతూనే ఉందని మహిళల హక్కుల ఉల్లంఘన సంక్షేమ పథకాల్లో కోత విధిస్తూనే ఉన్నారని, సమాన పనికి సమాన వేతనం అనేది కేవలం కాగితాలకే పరిమితం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు దొండపాటి రమేష్, యామాల గోపాలరావు పాల్గొన్నారు.

## తెలంగాణలో టిడిపి బలోపేతానికి కృషి

ప్రజాపక్షం/ మధిర : ఆంధ్రప్రదేశ్ ఎస్‌సి కమిషన్ చైర్మన్ టిడిపి మంత్రి కెఎస్ జవహర్ మంగళవారం మధిరలో పర్యటించారు. జిలుగుమాడులో త్వరలో జరుగనున్న కొత్తపల్లి ఇంట పెళ్లికి ఎస్‌కె జవహర్ హాజరు కావాల్సి ఉండగా షెడ్యూల్ కుదరకపోవటంతో ముందుగానే వచ్చి నూతన వధువు కొత్తపల్లి వసుంధరని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కెఎస్ జవహర్ మధిర విచ్చేసిన సందర్భంగా తెలుగుదేశంపార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా జవహర్ మాట్లాడుతూ తెలంగాణ టిడిపి పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, రానున్న ఎన్నికలకు పార్టీ జెండాను ఎగురవేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పలు సూచనలు సలహాలిచ్చారు. ఈకార్యక్రమంలో టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు మంత్రి తుమ్మల ఆత్మీయ సభ

### డిసిసి అధ్యక్షుడు నూతి సత్యనారాయణ పిలుపు

ప్రజాపక్షం / ఖమ్మం: తుమ్మల నాగేశ్వరరావు మంత్రి పదవి చేపట్టి 40 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నేడు సాయంత్రం ఐదు గంటలకు నగరంలోని యస్ఆర్ అండ్ బిజియన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించనున్న మంత్రి తుమ్మల ఆత్మీయ సభను విజయవంతం చేయాలని డిసిసి అధక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం సంజీవరెడ్డి భవన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ అభివృద్ధికి మారుపేరు తుమ్మల నాగేశ్వరరావు అని అయన అన్నారు.నగర అధ్యక్షుడు దీపక్ చౌదరి మాట్లాడుతూ ప్రజా సేవ , అభివృద్ధి, రైతు సంక్షేమం కోసం తుమ్మల కృషి చేశారన్నారు. ఈ సమావేశంలో జిల్లా రైతు కన్వీనర్ నల్లమల వేంకటేశ్వరరావు, గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా, జిల్లా నాయకులు బాలాజీ నాయక్, కోత్తా సీతరాములు, బోడ్డు బోందయ్య, యర్రం భాల గంగాదర తిలక్, బాణాల లక్ష్మ ణ్ ,నగర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బారు సద్వినియోగం

### ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోనిపలు వార్డుల ప్రజల కోసం 14వ తేదీ గురువారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు పెద్దతండాలోని ఏదులాపురం మున్సిపాలిటీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి వివరాలు వెల్లడించారు. సంబంధిత వార్డుల్లోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. ఈ సందర్భంగా చేయూత పెన్షన్స్, ఇందిరమ్మ ఇండ్లు, ఇంటి స్థలం, గృహజ్యోతి, రేషన్‌కార్డులు, భూభారతి, మహాలక్ష్మి పథకం, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, రైతు బీమా, రైతు భరోసా, స్త్రీశక్తిరుణాలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, రోడ్లు అండ్ భవనాలశాఖలు, రెవెన్యూతో పాటు పలు సమస్యలపై దరఖాస్తులను స్వీకరించి పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణపురంలోని టీసీవీరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 8గంటల నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కావున సంబంధిత 15వార్డుల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఘోర రోడ్డు ప్రమాదం, ఇద్దరు డ్రైవర్లు సజీవ దహనం

### తృటిలో తప్పించుకున్న క్లీనర్



ప్రజాపక్షం/తిరుమలాయపాలెం: రెండు లారీలు ఢీకొన్న ఘటనలో మంటలు అంటుకొని ఇద్దరు డ్రైవర్లు అక్కడికక్కడే సజీవ దహనమైన విచారకరమైన సంఘటన మంగళవారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో చోటుచేసుకుంది స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని మేకల తండా స్టేజ్ వద్ద ఖమ్మం–వరంగల్ జాతీయ రహదారిపై విజయవాడ నుండి ఖమ్మం మీదుగా కరీంనగర్ వెళ్తున్న బొగ్గు లారీ ఆగ్రా నుండి వరంగల్, ఖమ్మం మీదుగా గుంటూరుకు ఆలుగడ్డల లోడుతో వెళ్తున్న లారీ తిరుమలాయపాలెం మండలం మేకల తండా స్టేజ్ వద్ద ఎదురెదురుగా వస్తున్న లారీలు ఢీకొని క్షణాల్లో రెండు లారీలకు మంటలు అలుముకున్నాయి. ఇరు లారీల డ్రైవర్లు క్యాబిన్లలో చిక్కుకొని మంటల్లో పూర్తిగా ఖాళీ చనిపోయారు. బంగాళదుంపల లోడు లారీ డ్రైవర్ ఉత్తరప్రదేశ్‌కి చెందిన శ్రీ ప్రకాష్, బొగ్గులోడు లారీలో ఉన్న డ్రైవర్ ఆటారపు జేమ్స్ (50) కాగా ఇతనిది పల్లగిరి గ్రామం నందిగామ మండలం ఎన్టీఆర్ జిల్లా అమరావతి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ ప్రమాదాన్ని స్థానిక ప్రజలు ప్రత్యక్షంగా చూసి భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే స్థానిక ఎస్ కూచిపూడి జగదీష్ కి సమాచారం అందించగా ఘటనా స్థలానికి తన సిబ్బందితో చేరుకొని ట్రాఫిక్ ను నియంత్రించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందివ్వగా వెంటనే అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే ఒక లారీ పూర్తిగా దగ్ధం కాగా మరొక లారీ పాక్షికంగా దగ్ధం అయింది ఇదంతా ఖమ్మం నాయుడుపేట కు చెందిన బానోతు రామారావు అనే ప్రయాణికుడు మరిపెడ నుండి ఖమ్మం వెళ్తుండగా ప్రమాదాన్ని గమనించి మంటలనుంచి తప్పించుకున్న క్లీనర్ శ్రీకాంత్‌ను ఖమ్మం ఆస్పత్రికి తరలించి తన మానవత దృక్పథాన్ని చాటుకున్నాడు. అన్న ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ శ్రీనివాసరావు తన సిబ్బందితో వచ్చి కాలిన మృతదేహాలను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు ప్రయాణికులు చూస్తూ ఊరుకోకుండా తమకు తోచిన సహాయాన్ని అందించాలని స్థానిక పోలీసులు తెలిపారు.

## రఘునాథపాలెంను సోలార్ విలేజ్‌గా తీర్చి దిద్దుతాం

### కలెక్టర్ దివాకర్ టిఎస్



ప్రజాపక్షం/రఘునాథపాలెం : రఘునాథపాలెం గ్రామాన్ని భవిష్యత్‌లో సోలార్ విలేజ్‌గా తీర్చి దిద్దుతామని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు. మంగళవారం రఘునాథపాలెం గ్రామంలో సోలార్ మోడల్ ప్రాజెక్టును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు సన్సస్ 2027కు ప్రజలు పూర్తి సహకారం అందించాలని అన్నారు. తప్పుడు సమాచారం ఇవ్వకుండా సరైన వివరాలు నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పోత్రహించే దిశగా రఘునాథపాలెం గ్రామాన్ని సోలార్ రూఫ్‌టాఫ్ వ్యవస్థ కలిగిన పైలట్ గ్రామంగా అభివృద్ధి చేయాలని అన్నారు. గ్రామంలో మొత్తం 1081 మంది గృహజ్యోతి లబ్ధిదారులు ఉన్నారని వారిలో 821 మంది ఇండ్లలో సోలార్ రూఫ్‌టాఫ్‌లు ఏర్పాటు చేయడానికి అనుకూల పరిస్థితులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ప్రతిఇంటికి కనీసం 2 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ రూఫ్‌టాఫ్‌లు ఏర్పాటు చేసే లక్ష్యంతో ముందుకుసాగుతున్నట్లు తెలిపారు. గ్రామంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. సోలార్ రూఫ్‌టాఫ్‌ల ద్వారా ఉత్పత్తి అయ్యే అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, ఆర్ఐ వహీద్, సర్పంచ్ గాజుల కృష్ణారావు, సంబంధిత శాఖల అధికారులు, విద్యుత్‌శాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలులో ఆన్‌లైన్ ఇబ్బందులు పరిష్కరించాలి

ప్రజాపక్షం/కొణిజర్ల : మొక్కజొన్న కొనుగోలులో రైతులకు వస్తున్న ఆన్‌లైన్ ఇబ్బందులను పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ అన్నారు. మంగళవారం కొణిజర్ల సహకార సొసైటీ కార్యాలయం ఎదుట జరిగిన రైతుల ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు ధాన్యం ఆన్‌లైన్ కాక లారీ ట్రాన్స్‌పోర్టుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే ఆన్‌లైన్ ఇబ్బందులు తొలగించి రైతుల ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని పేర్కొన్నారు. నెలరోజులనుంచి రైతులు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల పర్యవేక్షణ లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోకపోవడంవలనే రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి, మొక్కజొన్న రైతుల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు కృషిచేయాలని తెలిపారు. ఈకార్యక్రంలో రైతు సంఘం జిల్లా నాయకులు స్వర్ణ రమేష్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, సోమయ్య, కృష్ణ, సీతారాములు పాల్గొన్నారు.

## మధిరలో హనుమాన్ జయంతి వేడుకలు

ప్రజాపక్షం/ మధిర : హనుమాన్ జయంతి సందర్భంగా మధిర మండలం, పట్టణంలోని హనుమాన్ ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుండి ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పట్టణంలోని దివ్యవసాయి మందిరం, కల్యాణ వెంకటేశ్వర స్వామిఆలయంలోని అభయాంజనేయస్వామి ఉపాలయాల్లో, ఆత్కూరు ఆంజనేయస్వామి ఆలయం నందు హనుమాన్ జయంతి సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## మందుబాబుకు జైలుశిక్ష



ప్రజాపక్షం/ధర్మపురి : మోతాదుకి మించి మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష పడినట్లు ధర్మపురి ఎస్సై గురుక మహేష్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం, ధర్మపురి పోలీసు స్టేషన్ పరిధిలో రెండురోజుల క్రితం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో పెద్దపల్లి జిల్లా గోపాలరావుపేటకు చెందిన శనిగారపు రాకేష్ (28) పట్టుబడ్డాడు. పరీక్షలలో రాకేష్ నిర్దేశించిన మోతాదుకు మించి 200 ఎంజి ఆల్కహాల్ సేవించినట్లు తేలింది. పోలీసులు ధర్మపురి ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట రాకేష్‌ను హాజరుపరుచగా మేజిస్ట్రేట్ నిందితుడికి రెండురోజుల పాటు జైలుశిక్ష విధించారు. అనంతరం రాకేష్‌ను జగిత్యాల సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

## ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నివారణ



జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

ప్రజాపక్షం/జగిత్యాల : ముందస్తు జాగ్రత్తల ద్వారా, ముందస్తు పరీక్షల ద్వారా క్యాన్సర్ నివారణ సాధ్యమవుతుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఐఎంఏ భవన్‌లో మిడ్వెర్ క్యాన్సర్ హాస్పిటల్ కరీంనగర్, ఐఎంఎ జగిత్యాల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ క్యాంప్‌ను నిర్వహించారు. జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల కోసం పాలియేటివ్ కేర్ యూనిట్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. సేవా ద్వారానే సమాజంలో తగిన గుర్తింపు వస్తుందన్నారు. 9 నుండి 18 ఏళ్ల మధ్య అమ్మాయిలకు హెచ్‌పివి వ్యాక్సిన్ వేయించడం ద్వారా సర్వైకర్ క్యాన్సర్ నివారించవచ్చునన్నారు. పచ్చకామెర్ల కు కూడా వ్యాక్సిన్ ఉంది అని ప్రజలు ఉపయోగించుకోవాలి అని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ శ్రీనివాస్, ఐఎంఎ అధ్యక్షులు డా.హేమంత్, ప్రధాన కార్యదర్శి డా.శ్రీనివాస్, కోశాధికారి డా.సుధీర్, డా.మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, నాయకులు క్యాదసు నాగయ్య, కౌన్సిలర్ దుమాల రాజ్ కుమార్, డా.కౌశిక్, డా.హారిక, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## హిందూ ఏక్తా యాత్ర ర్యాలీకి పటిష్ఠ బందోబస్తు

కరీంనగర్ సిపి గౌష్ ఆలం





ప్రజాపక్షం/కరీంనగర్ : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం కరీంనగర్ నగరంలో నిర్వహిస్తున్న హిందూ ఏక్తా యాత్ర ర్యాలీకి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. ఈ సందర్భంగా ర్యాలీ విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులకు ఆయన బ్రీఫింగ్ నిర్వహించారు. సుమారు 400 మంది పోలీసు అధికారులు బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారని ఆయన పేర్కొన్నారు. సున్నితమైన ప్రాంతాల్లో స్టాటిక్ ఫోర్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, రూఫ్‌టాప్ నిఘా, మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు వంటి పలు రకాల విధులను కేటాయించినట్లు కమిషనర్ తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన అన్ని చోట్ల దారి మళ్లింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు. హిందూ ఏక్తా యాత్ర శోభాయాత్రకు సంబంధించి పోలీసు శాఖ తరపున అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టినట్లు కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం స్పష్టం చేశారు.

## ఐఐఐటి హైదరాబాద్ యుజిఇఇలో "ఆల్ఫోర్స్" విద్యార్థుల ఎంపిక




ప్రజాపక్షం/కరీంనగర్ : అండర్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (యూజిఈఈ)లో అల్ఫోర్స్ విద్యార్థులు వూట్కూరి శ్రేయాన్ రెడ్డి, గుజ్జుల అశీశ్ రెడ్డి, గంగడి చైత్ర అద్భుత ప్రతిభ కనబరిచి ఐఐఐటి హైద్రాబాద్‌లో సీట్లు సాధించడానికి నిర్వహించిన ఇంటర్వ్యూకి ఎంపికయ్యారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి తెలిపారు. నిరంతరం కృషి చేస్తే ఎలాంటి పోటి పరిక్షలయిన విజయం సాధించవచ్చని, అల్ఫోర్స్ విద్యార్థులు నిరూపించారని అన్నారు. ఇంటర్వ్యూలోనూ సైతం ప్రతిభ కనబరిచి ఐఐఐటి హైదరాబాద్‌లో సీట్లు సాధిస్తారనే విశ్వసిస్తున్నానని అన్నారు. ఈ విజయాన్ని సాధించిన విద్యార్థులను నరేందర్ రెడ్డి అభినందించారు.

## ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో ముగ్గురు నిందితులు అరెస్టు

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: కులం పేరుతో దూషించి దాడి చేసిన ముగ్గురు నింధుతులను అరెస్టు చేసినట్లు గజ్వేల్ ఎసిపి నర్సింలు మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుమార్‌పై అదే గ్రామానికి చెందిన బోయిని పోచయ్య, బోయిని భాస్కర్, రుద్రారం ఇటీవల కులం పేరుతో దూషించి దాడి చేసిన సంఘటనపై విచారణ నిర్వహించిన అనంతరం అరెస్టు చేసినట్లు తెలిపారు. న్యాయస్థానం ముందు హాజరుపరిచి జ్యూడిషియల్ రిమాండ్ తరలించారు.

# పెద్దపల్లి నియోజకవర్గాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి నియోజకవర్గాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. మంగళవారం పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామంలో రూ.6 కోట్లతో గౌరి గుండాల జలపాతం అభివృద్ధి పనులకు, మండలంలోని గౌరెడ్డిపేట గ్రామంలో రూ.43 లక్షలతో ప్లాస్టిక్ వ్యర్థాల మేనేజ్మెంట్ యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడుతూ తెలంగాణలోని పెద్దపల్లి జిల్లాలో ఉన్న ఒక ప్రముఖ పర్యాటక ప్రదే శం సబ్బితం జలపాతం అని ఇది పెద్దపల్లి మండలం, సబితం గ్రామం సమీపంలో గట్టు సింగారం కొండల నుండి ఉద్భవించి, వర్షాకాలంలో (జులై నుండి నవంబర్ వరకు) ఆకట్టుకునేలా ప్రవహిస్తుంది. పెద్దపల్లి నుండి 15 కి.మీ దూరంలో ఉన్న ఈ జలపాతం, స్థానికంగా గౌరీ గుండాలుగా పిలవబడుతూ, దట్టమైన అటవీ ప్రాంతంలో సందర్శకులను ఆకర్షిస్తోదని రాష్ట్ర ప్రభుత్వం రూ.6 కోట్లతో జలపాతం అభివృద్ధి చేయడం జరుగుతుందని గత పాలకులు ఈ జలపాతాన్ని ఎన్నిసార్లు సందర్శించిన తట్టెడు మట్టికూడా తీసిన పాపాన పోలేదని కానీ ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత తాను శాసనసభ్యునిగా ఎన్నికైన తర్వాత రూ.6 కోట్లు వెచ్చించి అభివృద్ధి పరుస్తున్నామని అవసరమైతే జలపాతం అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చూపిస్తామని తెలిపారు. సబితం జలపాతాలు వర్షాకాలంలో గట్టుసింగారం కొండల నుండి నీరు ఉప్పొంగి ప్రవహించడంతో జలపాతాలలాగా మారి అద్భుతమైన దృశ్యాన్ని ఆవిష్కరిస్తాయి. దీనిని సందర్శించడానికి చాలామంది పర్యాటకులు వస్తుంటారని వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యాటకంగా ఆహ్లాదకరంగా తీర్చేందుకు జలపాతాన్ని అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల మేనేజ్మెంట్ యూనిట్ ద్వారా



ప్లాస్టిక్ రా మెటీరియల్ తయారీ అవుతుందని తెలిపారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి ప్రాసెసింగ్ చేసి ముడి సరుకులు తయారుచేసి టైల్స్, దారం వాటికి ఉపయోగిస్తారని తెలిపారు. ప్లాస్టిక్ వాడకం వలన క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని, ఈ యూనిట్ వలన పర్యావరణ కాలుష్యం తగ్గి పరిశుభ్రత పెరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ యూనిట్ మహిళా సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో పని చేస్తుందని, దీనికి గ్రామస్థులు అందరు సహకరించని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, తహసీల్దార్ రాజయ్య, పర్యాటక అధికారులు గ్రామ సర్పంచులు, కొమ్ము సుజాత, నూనె సరోజన, మున్సిపల్ చెర్మన్ నూగిళ్ల మల్లయ్య, మార్కెట్ చెర్మన్ కూర మల్లరెడ్డి, పాలకవర్గం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యకు మోక్షం

'ప్రజాపక్షం' కథనానికి స్పందన

రంగంలోకి దిగిన ట్రాన్స్‌కో అధికారులు, సర్పంచ్ కృషి, గ్రామస్తుల హర్షం

ప్రజాపక్షం ఎఫెక్ట్



ప్రజాపక్షం/ముత్తారం : చేతికందే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ వైర్లతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్న రైతుల కష్టాలపై ప్రజాపక్షం దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనం సత్ఫలితాన్ని ఇచ్చింది. విద్యుత్ వైర్లతో పొంచి ఉన్న ప్రమాదం.. అధికారుల నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం.. కర్రలే దిక్కు ప్రాణాలు అరచేతిలో..! అనే శీర్షికతో వచ్చిన వార్తకు ట్రాన్స్‌కో అధికారులు తక్షణమే స్పందించారు. స్థానిక ట్రాన్స్‌కో ఏఈ రాజేందర్ ఆదేశాల మేరకు విద్యుత్ సిబ్బంది యుద్ధప్రతిపాదికన గ్రామానికి చేరుకుని మరమ్మతులు చేపట్టారు. ప్రమాదకరంగా ఉన్న పాత వైర్లను తొలగించి, కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి వైర్లను పై ఎత్తుకు సరిచేశారు. సర్పంచ్ ప్రత్యేక చొరవతో ఈ సమస్య పరిష్కారానికి స్థానిక సర్పంచ్ గత కొంతకాలంగా అధికారుల చుట్టూ తిరిగినప్పటికీ ఫలితం లేకపోయింది. చివరికి ఈ విషయాన్ని విలేకరుల దృష్టికి తీసుకువెళ్లి, వార్తా పత్రిక ద్వారా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించడంలో సర్పంచ్ ఊట్ల చరణ్ చూపిన చొరవను గ్రామస్తులు కొనియాడారు. ఏళ్ల తరబడి నెలకొన్న భయానక వాతావరణాన్ని తొలగించి, తమ ప్రాణాలకు రక్షణ కల్పించినందుకు ప్రజాపక్షం పత్రికకు, సర్పంచ్ చరణ్‌కి, అధికారులకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మొక్కజొన్న నిల్వకు 5 వేల మెట్రిక్ టన్నుల గోదాం సిద్ధం




జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : జిల్లాలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్న నిల్వ కోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న గోదాములకు అదనంగా పెద్దపల్లి మండలం రంగాపూర్‌లో గల ఐజి గోదాంలో 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ పెద్దపల్లి మండలంలోని రంగాపూర్‌లో గల ధాన్యం గోదాములను పరిశీలించారు.అనంతరం అప్పన్నపేటలోని ఎస్.ఆర్.ఆర్ రైస్ మిల్‌ను తనిఖీ చేశారు. అలాగే పాలకుర్తి మండలంలోని కన్నాలలో గల గణపతి ఇండస్ట్రీస్‌ను పరిశీలించి మొక్కజొన్న నిల్వ సామర్థ్యం, అందుబాటులో ఉన్న సదుపాయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేపటి నుంచి పెద్దపల్లి జిల్లాలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నుంచి రంగాపూర్ ఐజి గోదాంకు మొక్కజొన్న తరలింపు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిల్వ ప్రక్రియలో ఎలాంటి అంతరాయం కలగకుండా తగినంత హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోలు, రవాణా, నిల్వ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. గోదాముల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించి నిల్వ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి,పాలకుర్తి తహసీల్దార్ సునీత, డీటీసీఎస్ మహేష్, రవీందర్, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు, ఎరువులు సరఫరా జరగకుండా కఠిన చర్యలు

కలెక్టర్ హైమావతి



ప్రజాపక్షం/సిద్దిపేట : జిల్లాలో నకిలీ విత్తనాలు ఎరువులు సరఫరా జరుగకుండ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో కాన్ఫరెన్స్ హాల్‌లో టాస్క్‌ఫోర్స్ కమిటీ కార్యచరణ ప్రక్రియ గూర్చి వ్యవసాయ ఎడిఎ, ఎంఎఓ, పోలీసు అధికారులకు జిల్లా కలెక్టర్ హైమావతి సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు మెలిరకమైన విత్తనాలు అందించటం కోసం టాస్క్‌ఫోర్స్ బృందం పనిచేయాలన్నారు. నియోజకవర్గం, మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేసి అయా రైతులతో సమావేశం నిర్వహించి నకిలీ విత్తనాలు గుర్తించటం, ఎరువులు అక్రమ రవాణ, ఫర్టిలైజర్ వాడకం గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. టాస్క్‌ఫోర్స్ బృందం లైసెన్స్, ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేయాలని, అక్రమంగా ఏదైనా క్రయ, విక్రయాలు జరిపితే యాక్షన్ తీసుకోవాలని ఆదేశించారు. అలాగే సబ్సిడీ అందించే యూరియా, ఇతర ఎరువులు అక్రమ రవాణా అరికట్టాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌కి విత్తనాలు లైసెన్స్ కలిగిన డీలర్ వద్ద అమ్మేలాగా విత్తనాలను ప్యాకెట్‌లో మాత్రమే కొనుగోలు చేసేలా, మంచి విత్తనాలు రైతులకు అందేలా చూడాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే గడ్డి మందులు, ఎచ్‌డి కాటన్ విత్తనాలు సాగుచేయటం నిషేద అని, అనుమతి లేని ఫర్టిలైజర్ అమ్మితే కేసులను బుక్ చేయాలన్నారు. ఏ ఒక్క ఫర్టిలైజర్ వదలకుండా టాస్క్‌ఫోర్స్ బృందం రైడింగ్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు



దీక్ష పరులతో కిటకిటలాడిన అంజన్న క్షేత్రం

ప్రజాపక్షం/మల్యాల : జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండ గట్టులో మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించిన పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. సోమవారం అర్ధరాత్రి దాటగానే హనుమాన్ దీక్షాపరులు భారీగా తరలిరావడంతో మంగళవారం కొండగట్టు క్షేత్రం కాషాయమయంగా మారింది. సుదూర ప్రాంతాల నుండి కాలినడకన వచ్చిన స్వాములు కాళ్ళకు బొబ్బలెక్కి నడవ లేని స్థితిలో పాదాలకు సాక్సులు కట్టుకొని చేతిలో హనుమాన్ జెండా కట్టిన కర్ర సహాయంతో స్వామిని స్మరిస్తూ ఘాట్ రోడ్, మెట్ల దారి మీదుగా ఆలయానికి చేరుకున్న దీక్షా స్వాములు ఆంజన్నకు ముడుపులు ముట్ట జెప్పి మాల విరమణ చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. కళ్యాణ కట్ట, కోనేరు బస్‌స్టాండ్ ప్రాంతం, భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో దాదాపుగా 4 లక్షల మంది దీక్షపరులు దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. బుధవారం ఉదయం వరకు భక్తుల రద్దీ కొనసాగే అవకాశం ఉందని వారు తెలిపారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ ఆలయాన్ని, పరిసర ప్రాంతాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈవో అంజన రెడ్డి ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులు సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. హనుమాన్ జయంతి రోజైన మంగళవారం స్వామివారికి తెల్లవారుజామునే తిరుమంజన కార్యక్రమాలు నిర్వహించి పల పంచామృత అభిషేకాలు, వివిధ పండ్ల రకాలతో స్వామిని అలంకరించారు. ద్రావిడ ప్రబంధ పారాయణాలు, విశేష అభిషేకాలు, తులసీ అర్చన, పట్టు వస్త్రాల అలంకరణ, సహస్రనాగవల్లి అర్చనలు వైభవంగా నిర్వహించారు. అనంతరం హోమం, మహాపూర్ణాహుతి, స్నపన తిరుమంజనం, ఉయ్యాల సేవ కార్యక్రమాలు నిర్వహించగా వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. మహానివేదనం అనంతరం తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

## రౌడీషీటర్ రిమాండ్

ప్రజాపక్షం/ధర్మపురి : ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రౌడీషీటర్‌ను రిమాండ్ చేసినట్లు ఎస్సై గురుక మహేష్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు ధర్మపురి స్టేషన్ పరిధిలోని నేరేళ్ల గ్రామానికి చెందిన తోకల గంగాధర్ (38)అనే వ్యక్తి ఈనెల 8న రాత్రి 8 గంటలకు గ్రామంలోని సంబేట నర్సయ్య అతని భార్య లక్ష్మి లు తమ బర్రెలకు మేత వేయడానికి వెళ్తుండగా గంగాధర్ అడ్డుకుని బీర్ సీసా పట్టుకుని బెదిరించగా నర్సయ్య అడ్డుకున్నాడు. అనంతరం అదేరోజు రాత్రి 10.30 ప్రాంతంలో తోకల గంగాధర్ అతని భార్య తోకల లక్ష్మి లు సంబేట నర్సయ్య లక్ష్మి లను చంపాలనే ఉద్దేశంతో వారి ఇంటికి వెళ్లి గడ్డపారతో తలుపులు పగలగొట్టడానికి ప్రయత్నించారు. అక్కడ నర్సయ్య దంపతులు లేకపోవడంతో వారి ఇంటిలోని మోటారు ఇతర వస్తువులను ధ్వంసం చేసారు. ఈ విషయంపై సంబేట నర్సయ్య ధర్మపురి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా నిందితుడిని ధర్మపురి జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుచగా మంగళవారం గంగాధర్‌కు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడు ఇదివరకు పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు ఎస్సై మహేష్ పేర్కొన్నారు.

## ఓపెన్ స్కూల్లో దోపిడీని అరికట్టాలి

ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

ప్రజాపక్షం/పెద్దపల్లి : ఓపెన్ స్కూల్లో జరుగుతున్న దోపిడిని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్లో (పాఠశాల & జూనియర్ కళాశాలలో) అడ్మిషన్ తీసుకున్నప్పటి నుండి కోర్సు అయిపోయే వరకు విద్యార్థుల నుండి పలు రకాలైనటువంటి ఆర్థిక దోపిడీ చేస్తున్నారని,అసలే ఓపెన్ స్కూల్ చదివే విద్యార్థులు అనేక రకాలైన కారణాల వల్ల చదువుకు దూరమైన వారు ఉంటారని, రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితుల్లో ఉన్న విద్యార్థులను ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొని వసూళ్లకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు. అడ్మిషన్ పేరిట, ప్రాక్టికల్స్ మార్కులు వెయ్యాలంటే అడిగినంత ఇవ్వాలని ఇవ్వకుంటే మార్కులు వెయ్యమని విద్యార్థులను అనేక రకాలైన ఇబ్బందులకు గురిచేస్తూ, వసూళ్లకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు తిరిగి వసూలు చేసినవి ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఓపెన్ స్కూల్లో జరుగుతున్న అవకతవకలపై పూర్తి విచారణ జరపాలని ,విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లేని యెడల పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

## ఇచ్చిన మాట తప్పారు.. ఇవ్వాల్సినవి ఎగ్గొట్టారు



బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మాజీ మంత్రి హరీష్‌రావు

ప్రజాపక్షం/సిద్దిపేట : ప్రజలను నమ్మించి మోసం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని, ఇచ్చిన మాట తప్పినారని.. ఇచ్చేటివి బంద్ చేసినారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా బండచెర్లపల్లి గ్రామం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి హరీష్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు అస్తవ్యస్తంగా మారాయని, ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, పంటలకు చెల్లింపులు ఆలస్యమవుతున్నాయని విమర్శించారు. వర్షాలు పడకముందే యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని హరీష్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం చింతమడక గ్రామంలో రైతులు, ఉపాధి హామి కూలీలతో మాజీమంత్రి హరీష్‌రావు మాట్లాడారు. మూడు వారాలుగా కూలీ డబ్బులు రాలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేయగా, వడ్లను బీ గ్రేడ్ కింద నమేదు చేస్తున్నారని రైతులు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు, ప్రజలకు అన్ని సౌకర్యాలతో సేవలను అందిస్తే, కాంగ్రెస్ సర్కార్ మాత్రం ఇచ్చిన మాట తప్పారని, ఇచ్చేటివి ఎగ్గొట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా నిద్ర లేవాలని, సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని హరీష్ రావు సూచించారు. ఢిల్లీ చుట్టూ తిరగడం మానేసి, రైతుల కష్టాలను చూడాలని, వెంటనే ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో కొనుగోళ్లు మెరుగ్గా జరిగాయని పేర్కొన్నారు. రైతులకు త్వరలో మంచి రోజులు వస్తాయని హరీష్ భరోసా ఇచ్చారు.

## ఆల్ఫోర్స్ హైస్కూల్‌కు సిబిఎస్ఇ గుర్తింపు



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తూ గత 14 సంవత్సరాలుగా సుల్తానాబాద్ పట్టణంలో విద్యార్థులకు సేవలు అందిస్తున్నామని ఉత్తమమైన స్థానాలలో స్థిరపడేదందుకు కృషి చేస్తున్నామని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు.సుల్తానాబాద్ లోని అల్ఫోర్స్ హై స్కూల్ పాఠశాలకు ప్రతిష్టాత్మక సంస్థ సీబీఎస్ఈ గుర్తింపు రావడం పట్ల ప్రత్యేక విలేకరుల సమావేశానికి ఏర్పాటుచేసి హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సుల్తానాబాద్ పట్టణంలో అల్ఫోర్స్ హై స్కూల్ పాఠశాల గత 14 సంవత్సరాలుగా అన్ని వర్గాల విద్యార్థులకు సేవలను అందిస్తూ,చక్కటి ప్రణాళికల ద్వారా చదువులోనే కాకుండా అన్ని రంగాలలో రాణించే విధంగా ప్రోత్సాహం అందిస్తున్నామని వారు చెప్పారు. పాఠశాల సాధిస్తున్నటువంటి విజయాలను దృష్టిలో పెట్టుకొని, రానున్నటువంటి రోజుల్లో మరనున్న విద్యా విధానాన్ని ఇప్పటినుండి అలవర్చడం, కేంద్ర సంస్థ అయిన సీబీఎస్ఈ నుండి గుర్తింపు రావడం చాలా హర్షించదగ్గ విషయమని పాఠశాలల్లోని మౌలిక సదుపాయాలను బోధనా సిబ్బంది దృష్టిలో పెట్టుకొని ఈ గుర్తింపు ఇవ్వడం జరిగిందని వారు గుర్తు చేశారు. ఇప్పటివరకు అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో రెండు సీబీఎస్ఈ పాఠశాలలు ఉన్నాయని ఇది మూడవదని తెలిపారు. సిబిఎస్ఈ విధానంలో విద్యార్థులకు పోటీతత్వం పెరుగుతుందని, కమ్యూనికేషన్ స్కిల్స్ సైతం మెరుగుపడతాయని ముఖ్యంగా జాతీయస్థాయి ఐఐటి, నిట్‌లో అర్హత సులువుగా సాధించడానికి దోహదపడుతుందని వారు చెప్పారు. సమగ్రంగా విశ్లేషణాత్మకంగా విషయాలను తెలుసుకోవడం ద్వారా పై చేయి సాధించిన వారవుతారని గుర్తుచేస్తూ పాఠశాలకు గుర్తింపు రావడానికి అహనిషను కృషి చేస్తున్నటువంటి బోధనా సిబ్బందికి, తరగని ఉత్సాహంతో ప్రోత్సాహం అందిస్తూ తల్లిదండ్రులకు, పాఠశాలలోని ప్రణాళికలను పాటిస్తూ విజేతలుగా నిలుస్తున్నటువంటి విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో సైతం అగ్రగామిగా నిలుస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. పాఠశాల యొక్క సీబీఎస్సీ అఫిలేషన్ నెంబర్ 3630668 అని తెలియజేసారు. అల్ఫోర్స్ విజయాలలో అందరి భాగస్వామ్యం ఉంటుందని తెలిపారు.

### అసోంలో వరుసగా రెండవసారి
# సిఎంగా హిమంత్ ప్రమాణం



**గువాహటి :** అసోంలో మంగళవారం కొత్త ప్రభుత్వం ఏర్పాటయింది. హిమంత బిశ్వ శర్మ వరుసగా రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీనితో ఈ ఈశాన్య రాష్ట్రంలో వరుసగా మూడోసారి బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కొలువుదీరినట్లయింది. నలుగురు ఎమ్మెల్యేలు— బిజెపికి చెందిన రామేశ్వర్ తేలి, అజంతా నేయోగ్; ఎజిపికి చెందిన అతుల్ బోరా, బిపిఎఫ్ కు చెందిన చరణ్ బోరో కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. గువాహటి ఖానాపారా ప్రాంతంలో ఉన్న వెటర్నరీ మైదానంలో జరిగిన ఒక కార్యక్రమంలో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, శర్మ, నలుగురు శాసన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, సర్బానంద సోనోవాల్, పవిత్ర మార్గరీటా, బిజెపిపాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, అలాగే బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్ హాజరయ్యారు. ధోతీ, కుర్తా ధరించి, మెడలో సంప్రదాయ 'గమోసా'ను అలంకరించుకున్న ముఖ్యమంత్రి, అసోమీ భాషలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆ నలుగురు శాసనసభ్యులలో ముగ్గురు— తేలి, బోరా, నేయోగ్ కూడా అసోమీ భాషలోనే ప్రమాణం చేయగా, బిపిఎఫ్ మంత్రి మాత్రం బోడో భాషలో ప్రమాణం చేశారు. శర్మ, ఇతర మంత్రులు ప్రమాణ స్వీకారం పూర్తి చేసిన అనంతరం, ప్రధాన మంత్రి వారికి అభినందనలు తెలిపారు. 'మా కామాఖ్య, మహాపురుష శ్రీమంత శంకరదేవ్, అసోం ప్రజల ఆశీస్సులతో, నేను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాను. నా మంత్రివర్గ సహచరులతో కలిసి, మా ప్రజలకు సేవ చేయడానికి, వారి ఆకాంక్షలన్నింటినీ నెరవేర్చడాన్ని కొనసాగించడానికి మేము ఆసక్తిగా ఎదురుచూస్తున్నాము' అని శర్మ ఎక్స్ వేదికగా పోస్ట్‌లో పేర్కొన్నారు. అంతకుముందు, మరొక సోషల్ మీడియా పోస్ట్‌లో, వారి ఆశీస్సులతో రాబోయే రోజుల్లో అసోం అభివృద్ధిలో కొత్త శిఖరాలను అధిరోహిస్తుందని ఆయన తెలిపారు. 126 మంది సభ్యులు కలిగిన శాసనసభలో బిజెపి గెలుచుకున్న 82 నియోజకవర్గాలతో కలిపి, ఎన్‌డిఎ రికార్డు స్థాయిలో 102 స్థానాలను కైవసం చేసుకుంది. బిజెపి మిత్రపక్షాలైన అసోం గణ పరిషత్ (ఎజిపి), బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (పిబిఎఫ్) చెరో 10 స్థానాలను గెలుచుకున్నాయి.

# పొదుపు చర్యల పిలుపుపై అఖిలపక్ష సమావేశం

- ప్రధాని మోదీని కోరిన శరద్ పవార్ • జాతీయ ప్రాధాన్యతలపై అందరితో చర్చించాకే నిర్ణయం తీసుకోవాలి
- యుద్ధ ప్రభావం దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారు • ప్రజల్లో విశ్వాసం పునరుద్ధరించాలి

**ముంబయి:** పొదుపు చర్యలు పాటించాలని, మిత వ్యయాలు చేయాలని దేశ ప్రజలకు చేసిన విజ్ఞప్తి నేపథ్యంలో ఈ అంశంపై చర్చించేందుకు అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ఎన్‌సిపి(ఎస్‌పి) అధినేత, రాజ్యసభ సభ్యుడు శరద్ పవార్ కోరారు. ఈ ప్రకటన చాలా తీవ్ర ఆందోళన కలిగించే విషయమని అన్నారు. జాతీయ ప్రాధాన్యతగల అంశాలపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సంప్రదింపులు చేసిన తర్వాతనే నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. దేశంలో నెలకున్న పరిస్థితులను ప్రతిపక్షాలతో చర్చించాలని,అందుకోసం అఖిలపక్ష సమావేశమే సరైన వేదిక అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆకస్మికంగా దేశ ప్రజలకు ఈ విధమైన విజ్ఞప్తి చేయడంతో సాధారణ ప్రజలు,వ్యాపారులు,పారిశ్రామిక వర్గాలు,ఇన్వెస్టర్ల మధ్య ఒక ఆవేదన ప్రారంభమైందన్నారు. ఈ పొదుపు చర్యల విజ్ఞప్తి ఆర్థికవ్యవస్థపై దీర్ఘకాల ప్రభావం కలిగించే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న సంక్లిష్ట పరిస్థితుల్లో ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించడమే ప్రభుత్వం చేపట్టాల్సిన ప్రధాన ప్రాధాన్యతాంశమని, దేశంలో స్థిరత్వాన్ని కాపాడాలని ఒక ప్రకటనలో శరద్ పవార్ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధ ప్రభావం



దేశం మీద పడిందని, ఈ ప్రభావాన్ని ప్రజలకు తెలియకుండా దాచిపెట్టేందుకు ప్రధానమంత్రి ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఉద్ఘాటించారు. ఉద్యోగులు వర్క్‌ఫ్రమ్ హోం చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని, పెట్రోలు,డీజిలు ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవాలని, ప్రభుత్వ రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని, ఎలక్ట్రికల్ వాహనాలను ఎక్కువగా ఉపయోగించాలని, మహా నగరాలలో ప్రజలు మెట్రో రైలు సేవలు ఉపయోగించుకోవాలని, సరుకు రవాణాకు రైల్వే పార్శిల్ వ్యవస్థను సద్వినియోగం చేసుకోవాలని మధ్యతరగతి వర్గాలు పొదుపు పాటించాలని, ఖర్చులు తగ్గించుకోవాలని, దేశ ప్రజలు ఏడాది పాటు బంగారం కొనుగోళ్ళు చేయకుండా దూరంగా ఉండాలని ఇలాంటి చర్యలు తీసుకుంటేనే విదేశీ మారక ద్రవ్యాన్ని దాచుకోగలమని, ఆర్థిక వ్యవస్థ




బలపడుతుందని ప్రధానమంత్రి రెండు రోజుల క్రితం విజ్ఞప్తి చేశారు.

"అస్థిరమైన,యుద్ధ తరహా పరిస్థితులు పశ్చిమాసియాలో ఉన్నాయి ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి దేశ ప్రజలకు పిలుపు ఇచ్చారు" అని శరద్ పవార్ అన్నారు. మోదీ తన అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని, అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని అదేసమయంలో జాతీయ ప్రయోజనాలరీత్యా ఆ సలహాల మేరకు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాల్లో కేంద్రం చాలా సున్నితత్వంతో వ్యవహరించాలని, ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు, భవిష్యత్ విధానాల రీత్యా జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసాన్ని పాదుగొల్పేందుకు, దేశంలో స్థిరత్వం తీసుకువచ్చేందుకే ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

**మధ్యతరగతే మీ లక్ష్యమా?**
**మంత్రులు,ధనికులను వదిలేశారేం?**

దేశ ఆర్థిక పరిస్థితి ఏమిటో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని ఆమ్‌ఆద్మీపార్టీ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్ కోరారు. దేశ ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన విజ్ఞప్తిపై స్పందిస్తూ, దేశ ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో కూడా ప్రధానమంత్రి ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని మోదీని నిలదీశారు. న్యూఢిల్లీలో మంగళవారం ఆయన పత్రికాగోష్టిలో మాట్లాడుతూ, దేశం చాలా సంక్లిష్టమైన సంక్షోభంలో ప్రయాణం చేస్తోందని, కానీ ప్రధానమంత్రి మాత్రం ఏడు కఠినమైన చర్యలు పాటించాలని ప్రజలకు పిలుపు ఇచ్చారని, వాటిని అనుసరించాలని కోరారన్నారు. అమెరికా—ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధమే ఈ పొదుపు చర్యల సలహావెనుక ప్రధాన కారణంగా బయటకు కనిపిస్తున్నప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థ గాడి తప్పుతోందన్న తెరవెనుక రహస్యం ఏదో ఉందని అన్నారు. మధ్యతరగతి వర్గాలను లక్ష్యంగా చేసుకున్నారు. ఎందుకని ప్రధానమంత్రి తనను, తన మంత్రులను, అధధికారులను, ఘనమైన సంపన్నవర్గాలను త్యాగాలు చేయాలని పిలుపు ఇవ్వలేదని ప్రశ్నించారు.


## 717 ప్రభుత్వ రిటైల్ మద్యం దుకాణాల మూసివేత

- తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఆదేశం

**చెన్నై :** తమమిళనాడులో కొత్త ముఖ్యమంత్రి విజయ్ పాలనను మొదలు పెట్టారు. మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని మహిళలు, కొన్ని రాజకీయ పార్టీల నుంచి వస్తున్న డిమాండ్ల నేపథ్యంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 717 ప్రభుత్వ రిటైల్ మద్యం దుకాణాలను మూసివేయాలని ఆయన ఆదేశించారు. వీటిలో ప్రార్థనా స్థలాల సమీపంలోని 276 దుకాణాలు కూడా ఉన్నాయి. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ చర్య తీసుకున్నారని, రిటైల్ మద్యం దుకాణాలను మూసివేయాలని విజయ్ ఆదేశాలు జారీ చేశారని ఒక అధికారిక ప్రకటన తెలిపింది. ప్రతిపక్ష డిఎంకె ఈ చర్యను 'కేవలం పిఆర్' అని ఎద్దేవా చేసింది. తమిళనాడులో ప్రభుత్వానికి కీలక ఆదాయ వనరులలో మద్యం అమ్మకాలు ఒకటిగా ఉన్నది. అయితే ప్రార్థనా స్థలాల సమీపంలోని 276 దుకాణాలు, విద్యాసంస్థల సమీపంలోని 186 దుకాణాలు, బస్ స్టాండ్‌ల సమీపంలోని 255 దుకాణాలను రానున్న రెండు వారాల్లోగా మూసివేస్తామని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలోని అన్ని మద్యం దుకాణాలను మూసివేసి, మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని ముఖ్యంగా మహిళలు, పిఎంకె వంటి కొన్ని రాజకీయ పార్టీల నుంచి విస్తృతమైన డిమాండ్ ఉంది. దీనిపై స్పందిస్తూ, మతపరమైన ప్రార్థనా స్థలాలు, విద్యా సంస్థల వెలుపల టాస్మాక్ అవుట్‌లెట్లు లేవని డిఎంకె అధికార ప్రతినిధి శరవణన్ అన్నదురై పేర్కొన్నారు. 'వారు కొత్త దుకాణాలు తెరిచి, పాతవాటిని మూసివేస్తారా? ఇది కేవలం పిఆర్ (పబ్లిక్ రిలేషన్స్) మాత్రమే' అని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. తమిళనాడు స్టేట్ మార్కెటింగ్ కార్పొరేషన్ (టాస్మాక్) రాష్ట్రవ్యాప్తంగా 4,765 రిటైల్ మద్యం అవుట్‌లెట్లను నిర్వహిస్తోంది. 2025లో, తమిళనాడులో మద్యం అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయం రూ.

## తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా జెసిడి ప్రభాకర్

**చెన్నై :** తమిళనాడు శాసనసభ స్పీకర్‌గా టివికె ఎమ్మెల్యే జెసిడి ప్రభాకర్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్ ఎన్నిక అనంతరం ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను పథకాలు, చట్టాలుగా మలిచే బాధ్యత శాసనసభపై ఉందని పేర్కొన్నారు. 17వ తమిళనాడు శాసనసభలో విజయ్ తొలి ప్రసంగంలోనే 'ఇక్కడ అందరూ సమానమే. ప్రతిపక్ష సభ్యులు, అధికార టివికె సభ్యులు వ్యక్తం చేసే అభిప్రాయాలకు సమాన ప్రాధాన్యత, విలువ ఇవ్వబడుతుంది. మంచి విషయాలు ఆమోదించబడతాయి. అదే సమయంలో అనవసరమైన అభిప్రాయాలు తిరస్కరించబడతాయి. ఈ శాసనసభ ప్రజాస్వామ్యానికి హృదయంగా, మెదడుగా పనిచేయాలి' అన్నారు. స్పీకర్ ప్రభాకర్, డిప్యూటీ స్పీకర్ ఎం. రవిశంకర్ తమతమ పదవులకు ఏకగ్రీవంగా, పోటీ లేకుండా ఎన్నికైనందుకు విజయ్ వారిని అభినందించారు. సభ కార్యకలాపాలను సజావుగా నిర్వహించాలని వారికి శుభాకాంక్షలు తెలిపారు. శాసనసభలో అందరూ సమానమే అని నొక్కిచెప్పడానికి, ముఖ్యమంత్రి తన ప్రసంగాన్ని మాజీ అమెరికా అధ్యక్షుడు అబ్రహం లింకన్ సూక్తితో ప్రారంభించారు. ప్రజల సంక్షేమం పట్ల ముఖ్యంగా యువత



సంక్షేమం పట్ల, పరిపాలనలో పారదర్శకత పట్ల తన ప్రభుత్వానికి ఉన్న ప్రాధాన్యతలను ఆయన వివరించారు. అంతేకాకుండా, సభా నాయకుడు, ప్రతిపక్ష నాయకుడు కలిసి, కొత్తగా ఎన్నికైన స్పీకర్ చేతులు పట్టుకుని ఆయనను స్పీకర్ స్థానానికి తీసుకువెళ్లే శాసనసభ సంప్రదాయ ప్రక్రియను కూడా ఆయన వివరించారు. అంతకుముందు, స్పీకర్ ఎన్నిక కోసం సభ సమావేశమైనప్పుడు ప్రొటెం స్పీకర్ ఎంవి కరుప్పయ్య సభలో ఒక ప్రకటన చేశారు. స్పీకర్ పదవికి ప్రభాకర్ నామినేషన్‌ను ముఖ్యమంత్రి ప్రతిపాదించారని, ఆ పదవికి అందిన ఏకైక నామినేషన్ అదేనని ఆయన తెలిపారు. కాబట్టి, ప్రభాకర్ ఏకగ్రీవంగా, పోటీ లేకుండా ఎన్నికయ్యారని ఆయన ప్రకటించారు. ఎన్నిక ప్రక్రియ ముగిసిన వెంటనే, తాత్కాలిక స్పీకర్‌గా తన బాధ్యతలు ముగిశాయని కరుప్పయ్య ప్రకటించారు. సభలో పాటిస్తున్న సంప్రదాయం ప్రకారం, కొత్తగా ఎన్నికైన స్పీకర్‌ను ఆయన స్థానానికి తీసుకువెళ్లాల్సిందిగా సభా నాయకుడు కెఎ సెంగుట్టయ్యన్, ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్‌లను ఆయన ఆహ్వానించారు. ఇక ఈ రోజు నుండి, సభా కార్యకలాపాలను ప్రభాకరే నిర్వహిస్తారని కురుప్పయ్య పేర్కొన్నారు.

## ప్రజలను విభజిస్తున్న సనాతన ధర్మం

- దాన్ని నిర్మూలించాలి: ఉదయనిధి స్టాలిన్

**చెన్నై :** సనాతన ధర్మం ప్రజలను విభజిస్తోందని, దానిని కచ్చితంగా నిర్మూలించాలని డిఎంకె నేత ఉదయనిధి స్టాలిన్ మంగళవారం పేర్కొన్నారు. 2023 సెప్టెంబర్‌లో తాను చేసిన ఈ వివాదాస్పద వ్యాఖ్యలను మళ్లీ పునరుద్ఘాటించారు. తమిళనాడు అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా చేసిన తొలి ప్రసంగంలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళ ప్రార్థనా గీతం 'తమిళ్ తాయ్ వాల్తు'ను పక్కన పెట్టే ఏ ప్రయత్నాన్ని ప్రతిపక్షం అనుమతించదు అని స్పష్టం చేశారు. గతంలో ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని కచ్చితంగా నిర్మూలించాలని చేసిన వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపాయి. ఆ సమయంలో హిందూ అనుకూల సంస్థల నుంచి ఆయన తీవ్ర విమర్శలను, కోర్టు కేసులను ఎదుర్కొన్నారు. కాగా, ఇటీవల జరిగిన నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తమిళ రాష్ట్ర గీతాన్ని మొదటగా పాడలేదు. వరుసగా వందేమాతరం, జనగణమన, తమిళ్ తాయ్ వాల్తు పాడారు. దీనిపై ఉదయనిధి అభ్యంతరం వ్యక్తం చేశారు. 'మీ ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవంలో జరిగిన ఇలాంటి పొరపాటు మళ్లీ జరగడానికి మీరు (విజయ్) అనుమతించకూడదు. మేము అయితే అస్సలు అనుమతించేది లేదు. అసెంబ్లీలోనే కాదు, తమిళనాడులో జరిగే ఏ ప్రభుత్వ కార్యక్రమంలోనైనా తమిళ్ తాయ్ వాల్తుకే ఎప్పుడూ ప్రథమ స్థానం ఇవ్వాలి. ఈ విషయంలో ఎప్పుడూ రాజీ పడకుండా చూడాలని నేను ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. మన హక్కులను, సంప్రదాయాలను కాపాడుకోవడంలో మనం అప్రమత్తంగా ఉండాలి. రాష్ట్ర గీతాన్ని కాదని, ముందుగా జాతీయ గేయం, గీతం పాడడం వల్ల ప్రజల్లో తీవ్ర దిగ్భ్రాంతి, ఆగ్రహం వ్యక్తమయ్యాయి' అని ఉదయనిధి అన్నారు. తన ప్రసంగంలో భాగంగా ఉదయనిధి స్టాలిన్ ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్, స్పీకర్ జెసిడి ప్రభాకర్, తాను ఇంతకు ముందు లొయోలా కాలేజీ కాలేజీ పూర్వ విద్యార్థులమేనని ఆయన గుర్తు చేసుకున్నారు.

## బలపరీక్షలో పాల్గొనొద్దు

టివికె ఎమ్మెల్యేకు మద్రాస్ హైకోర్టు షాక్



**న్యూఢిల్లీ :** తమిళనాడు నూతన ముఖ్యమంత్రి విజయ్ శాసనసభలో తన బలాన్ని నిరూపించుకునేందుకు సిద్ధమవుతున్న వేళ ఒక టివికె ఎమ్మెల్యేకు మద్రాస్ హైకోర్టు షాకిచ్చింది. ఈ ఎన్నికల్లో ఒక్క ఓటు తేడాతో నెగ్గిన ఆ ఎమ్మెల్యే.. సభలో సిఎం విజయ్ బలపరీక్షలో పాల్గొనవద్దని ఆదేశించింది. ఈ మేరకు న్యాయస్థానం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. దాంతో విజయ్ బలపరీక్షలో టివికె కూటమి బలం 119 సీట్లకు పడిపోయినట్లయ్యింది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో శివగంగై జిల్లా తిరుప్పత్తూర్ నియోజకవర్గం నుంచి టివికె నేత శ్రీనివాస సేతుపతి విజయం సాధించారు. ఇక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెరియకరుప్పన్‌పై కేవలం ఒకే ఒక్క ఓటు తేడాతో సేతుపతి గెలుపొందారు. డిఎంకె నేత పెరియకరుప్పన్‌కు 83,374 ఓట్లు పోలవగా.. శ్రీనివాస సేతుపతి 83,375 ఓట్లతో విజయాన్ని సొంతం చేసుకున్నారు. అయితే ఈ ఫలితాలపై టిఎంకె నేత పెరియకరుప్పన్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో పొరపాటు జరిగిందని తన పిటిషన్‌లో ఆరోపించారు. ఇవిఎం ఓట్ల లెక్కింపు ప్రక్రియలోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయని, కాబట్టి తిరుప్పత్తూర్‌లో రీకౌంటింగ్ జరపాలని ఆయన న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అప్పటివరకు శ్రీనివాస సేతుపతి ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పెరియకరుప్పన్ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. విజయ్ విశ్వాస పరీక్ష ఓటింగ్‌లో శ్రీనివాస సేతుపతి పాల్గొనవద్దని ఆర్డర్ వేసింది. మద్రాసు హైకోర్టు ఆదేశాలతో బల పరీక్షలో విజయ్‌కు ఒక ఓటు తగ్గినట్లయ్యింది. 234 శాసనసభ స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో విజయ్‌కి కాంగ్రెస్, వామపక్షాలు, విసికె, ఐయుఎంఎల్ కలుపుకుని ప్రస్తుతం 120 మంది ఎమ్మెల్యేల బలం ఉంది.

### అక్టోబరు నిందితుల విచారణకు
## ఇజ్రాయెల్ ప్రత్యేక సైనిక న్యాయస్థానం

**జెరూసలెం:** ఇజ్రాయెల్‌పై దాడిచేసి మారణకాండ సృష్టించిన హమాస్ ఉగ్రవాదులను విచారించి శిక్షించేందుకు ఆ దేశం ఒక ప్రత్యేక సైనిక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రత్యేక సైనిక న్యాయస్థానం ఏర్పాటు చేస్తూ ఇజ్రాయెల్ పార్లమెంటు క్నెస్సెట్ 93 ఓట్లతో తీర్మానాన్ని ఆమోదించింది. 2023 అక్టోబరు ఏడో తేదీన పొరుగున గాజా నుండి హమాస్ ఉగ్రవాదులు వందలమంది సరిహద్దు కంచెను పగలగొట్టి ఇజ్రాయెల్‌లో ప్రవేశించారు. మారణకాండ సృష్టించారు. దాదాపు 1200 మంది పైగా ఇజ్రాయెలీ పౌరులు ఈ దాడుల్లో మరణించగా అనేకమందిని బందీలుగా తీసుకుపోయారు. వందలమంది గాయపడ్డారు. ఈ ఘటన తర్వాత గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం ప్రకటించింది. సజీవులు,నిర్జీవులైన బందీలను తిరిగి దేశానికి తరలించింది. ఐతే దాడికి బాధ్యులైనవారిని విచారణ చేసి మరణశిక్షలు అమలు చేయడానికి వీలుగా ఒక ప్రత్యేక సైనిక న్యాయస్థానం ఏర్పాటు చేస్తూ పార్లమెంటు తీర్మానం ఆమోదించింది. ఈ తీర్మానానికి వ్యతిరేకంగా ఎవ్వరూ ఓటు వేయలేదు. అదేవిధంగా 1962 తర్వాత మొదటిసారి ఉరిశిక్షను పునరుద్ధరించింది. ఈ తీర్మానం మేరకు అమలులోకి వచ్చే చట్టం ప్రకారం, ఆనాడు ఇజ్రాయెల్‌పై దండయాత్ర చేసినవారిలో పట్టుబడిన 300 మంది ఉగ్ర



వాదులను విచారణ జరిపి ఉరిశిక్షలు అమలు చేయడానికి ఈ సైనిక కోర్టు సేవలు ఉపయోగించుకుంటారు. ఇజ్రాయెల్ న్యాయశాఖామంత్రి యూరీ లెవిన్ సభలో మాట్లాడుతూ, ఈ చట్టం ఆమోదం ఇజ్రాయెల్ చరిత్రలో ఒక ప్రముఖ ఘట్టంగా అభివర్ణించారు. ఈ ఏడాది చివరిలో ఎన్నికలు జరుగడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ దేశంలో పార్టీలమధ్య విభేదాలు కొనసాగుతున్నప్పటికీ, ఒక ఐక్య మార్గాన్ని కనుగొనేందుకు మనం సరైన దిశలో ప్రయాణం చేస్తున్నామనడానికి ఈ తీర్మానం ఒక ప్రముఖ ఉదాహరణ అన్నారు. హమాస్ దండయాత్రలో హతులైన వారి కుటుంబాలకు, బందీలకు,వారి కుటుంబాలకు ఈ చట్టాన్ని అంకితం చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

### ప్రతిపక్ష నేత ఎంపికలో
## ఎలాంటి జాప్యం ఉండదు

- ఎల్‌డిఎఫ్ కన్వీనర్ టి.పి. రామకృష్ణన్



**కోజికోడ్ :** కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కూటమిలో ముఖ్యమంత్రి పదవికి సంబంధించి అనిశ్చితి నెలకొనగా, కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిని ఎంపిక చేయడంలో ఎటువంటి జాప్యం ఉండదని సీనియర్ సిపిఐ(ఎం) నాయకుడు, ఎల్‌డిఎఫ్ కన్వీనర్ టి.పి. రామకృష్ణన్ మంగళవారం తెలిపారు. ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకునే బాధ్యతను సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో పార్టీ రాష్ట్ర విభాగానికి అప్పగించిందని ఆయన పేర్కొన్నారు.'ప్రతిపక్ష నాయకుడి ఎంపిక విషయంలో ఎటువంటి వివాదం లేదు. ఈ ప్రక్రియ జాప్యం కావడానికో లేదా వివాదాస్పద అంశంగా మారడానికో ఏమాత్రం ఆస్కారం లేదు. సిపిఐ(ఎం) వీలైనంత త్వరగా ఈ నిర్ణయం తీసుకుంటుంది అని రామకృష్ణన్ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. కాంగ్రెస్ కూటమిపై పరోక్ష విమర్శలు చేస్తూ, ఒకవేళ ముఖ్యమంత్రిని నిర్ణయించి, ప్రతిపక్ష నాయకుడి పదవిని మాత్రం తేల్చకుండా వదిలేసి ఉంటే, అప్పుడు తమపై వచ్చే విమర్శలు సమంజసంగా ఉండేవని ఆయన వ్యాఖ్యానించారు. 'ప్రతిపక్ష నాయకుడిని నిర్ణయించడంలో ఎల్‌డిఎఫ్ కూటమికి ఎటువంటి ఇబ్బంది లేదని ఆయన స్పష్టం చేశారు. ఎల్‌డిఎఫ్ కూటమిలో రెండవ అతిపెద్ద భాగస్వామ్య పక్షమైన సిపిఐ, ఉప ప్రతిపక్ష నాయకుడి పదవిపై హక్కు కోరుతోందన్న వార్తలపై స్పందిస్తూ... గతంలో సిపిఐ(ఎం) పార్టీయే ఈ రెండు పదవులను (ప్రతిపక్ష నాయకుడు, ఉప ప్రతిపక్ష నాయకుడు) నిర్వహించిన సందర్భాలు ఉన్నాయని రామకృష్ణన్ గుర్తుచేశారు. దివంగత సిపిఐ(ఎం) నాయకులు వి.ఎస్. అచ్యుతానందన్, కొడియేరి బాలకృష్ణన్ ఉదాహరణలను ఆయన ప్రస్తావించారు. ఈ విషయమై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం ఒక బహిరంగ లేఖ రాసినట్లు వచ్చిన వార్తలను ప్రస్తావిస్తూ... ఇటువంటి అంశాలను కూటమి అంతర్గత చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని రామకృష్ణన్ అభిప్రాయపడ్డారు. 'విశ్వం రాసిన బహిరంగ లేఖ గురించి నేను చదివాను. ఇవి కూటమి అంతర్గతంగా చర్చించుకోవాల్సిన అంశాలు; వీటిని బహిరంగంగా లేవనెత్తడం సరైన పద్ధతి అని నేను భావించడం లేదు' అని ఆయన అన్నారు. కొత్త అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు, ఉప ప్రతిపక్ష నాయకుడు— ఈ రెండు పదవులకు సంబంధించి ఎల్‌డిఎఫ్ కూటమి ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని కూడా ఆయన స్పష్టం చేశారు. ఏప్రిల్ 9న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో, వరుసగా రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న ఎల్‌డిఎఫ్ కూటమిని ఓడించి, కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కూటమి స్పష్టమైన మెజారిటీతో తిరిగి అధికారంలోకి వచ్చింది.

### దేశ వ్యాప్తంగా కోర్టుల ఆధునికీకరణకు
# ఉన్నత స్థాయి కమిటీ

- సిజెఐ సూర్యకాంత్ నిర్ణయం • కమిటీలో కలకత్తా, పంజాబ్, హర్యానా, బాంబే హైకోర్టుల జడ్జిలకు ప్రాతినిధ్యం

**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా కోర్టుల ఆధునికీకరణకు ఒక బ్లూ ప్రింట్ తయారుచేసి, ప్రభుత్వ నిధుల కేటాయింపును సురక్షితం చేసేందుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి అరవింద్‌కుమార్ నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ నిర్ణయించారు. ప్రభుత్వం నుంచి గణనీయమైన ఆర్థిక సహాయం ద్వారా న్యాయస్థానాల్లోని మౌలిక సదుపాయాలలో లోపాలను సవరించడానికి మౌలిక సదుపాయాల లోపాల సలహా కమిటీ ఏర్పాటును సిజెఐ సూర్యకాంత్ ప్రకటించారు. జస్టిస్ అరవింద్ కుమార్‌తో పాటు ఈ కమిటీలో వరుసగా కలకత్తా, పంజాబ్, హర్యానా, బాంబే హైకోర్టులకు చెందిన జస్టిస్‌లు దేబాంగ్సు బసక్, అశ్వనీ కుమార్ మిశ్రా, సోమశేఖర్ సుందరేసన్ కూడా ఉంటారు. వివిధ హైకోర్టులు, జిల్లా కోర్టుల విభిన్న మౌలిక సదుపాయాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భారత ప్రధాన న్యాయమూర్తి ఒక న్యాయ మౌలిక సదుపాయాల సలహా కమిటీని ఏర్పాటు చేశారు. 'అఖిల భారత స్థాయిలో ఏకీకృత మౌలిక సదుపాయాల వ్యవస్థను నిర్ధారించడమే ఈ కమిటీ ఉద్దేశం' అని సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలియజేశారు.ఈ కమిటీ తన నివేదికను భారత ప్రధాన న్యాయమూర్తికి



సమర్పిస్తుందని, ఆయన దానిని పరిశీలించిన మీదట ఈ విషయాన్ని భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చిస్తారని ఆ ప్రకటన తెలిపింది. ఈ ప్యానెల్ సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ జనరల్, సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ కూడా సభ్యులుగా ఉంటారు. వ్యవస్థాగత పరిమితులను గుర్తించడం, వ్యాజ్యదారులు, న్యాయవాదుల కోసం సౌకర్యాలను మెరుగుపర్చడం, కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయడానికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేయడం వంటి ఏడు కీలక రంగాలపై కమిటీ దృష్టి సారించే అవకాశం ఉంది. డిజిటల్ అంతరాన్ని తగ్గించేందుకు చేపట్టిన 'ఇ–కోర్టుల' కార్యక్రమంపైనా 21వ శతాబ్దానికి అనుగుణంగా రూపొందించిన ఆధునిక కోర్టు సముదాయాల పైన కూడా ఈ ప్యానెల్ దృష్టి సారించనుంది.

## ఎఎంఎంకె నుంచి ఎమ్మెల్యే కామరాజ్ బహిష్కరణ

**చెన్నై :** తమిళనాడులో అధికార టివికె పార్టీకి తన పార్టీ ఏకైక ఎమ్మెల్యే 'ఏకపక్షంగా' మద్దతు ప్రకటించినందుకుగాను, ఎఎంఎంకె వ్యవస్థాపకుడు టిటివి దినకరన్ మంగళవారం ఆ ఎమ్మెల్యేను పార్టీ నుండి బహిష్కరించారు. మంగళవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి తన పార్టీ ఏకైక ఎమ్మెల్యే ఎస్. కామరాజ్ మద్దతు ప్రకటించిన కొన్ని గంటల్లోనే దినకరన్ ఈ చర్య తీసుకున్నారు. ఇటువంటి చర్య ఏకపక్షమైనదని, అలాగే పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమని దినకరన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కామరాజ్ చర్య, ఎన్నికల్లో



అతని విజయం కోసం కృషి చేసిన ఎఎంఎంకె కార్యకర్తలకు, మిత్రపక్షాల సభ్యులకు, అలాగే అతనిపై నమ్మకం ఉంచి ఓటు వేసిన ప్రజలకు చేసిన ఒక పెద్ద ద్రోహం' అని ఆయన అన్నారు. ఎన్‌డిఎ కూటమిలో భాగమైన తమ పార్టీకి తన చర్య ద్వారా ఆయన అపఖ్యాతి తెచ్చారని, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించారని దినకరన్ పేర్కొన్నారు. అందువల్ల, కామరాజ్‌ను మంగళవారం నుంచి పార్టీలోని అన్ని పదవుల నుండి, అలాగే ప్రాథమిక సభ్యత్వం నుండి బహిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు. తన ఎమ్మెల్యే టివికెకు మద్దతు ప్రకటించడం వెనుక పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఉన్నాయని దినకరన్ చేసిన వ్యాఖ్యలను అధికార టివికె కొట్టివేసిన కొన్ని రోజులకే ఈ పరిణామం చోటుచేసుకుంది.

## భారత్‌కు ఇరాన్ మంత్రి అరాఘ్చీ

న్యూఢిల్లీలో 'బ్రిక్స్' విదేశీమంత్రుల సమావేశం



**టెహ్రాన్:** ఇరాన్ విదేశీవ్యవహారాల మంత్రి అబ్బాస్ అరాఘ్చి బుధవారం భారత్‌కు వస్తున్నారు. న్యూఢిల్లీలో 14,15 తేదీలలో బ్రిక్స్ విదేశీ మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొంటారు. సమావేశానికి ముందుగా ఆయన ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ముఖాముఖీ సమావేశం నిర్వహిస్తారు. ఐతే తమ దేశం నుండి గురువారం జరిగే సమావేశంలో పాల్గొనేందుకు ఉన్నతస్థాయీ ప్రతినిధి వర్గమేదీ భారత్‌కు వెళ్ళడంలేదని చైనా విదేశీవ్యవహారాలమంత్రి వాంగ్ యీ ప్రకటించారు. ముందస్తు కార్యక్రమాలతో తమ ఉన్నతస్థాయీ వర్గాలు ఊపిరి సలకుండా ఉన్నారని చెప్పారు.

# హోర్ముజ్ తెరిపించేందుకు జిన్‌పింగ్‌పై ట్రంప్ ఒత్తిడి?




**వాషింగ్టన్ :** చైనా పర్యటనలో ట్రంప్ హోర్ముజ్ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తారని భావిస్తున్నారు. అందుకే టారిఫ్‌లకు సంబంధించిన విషయాలను ట్రంప్ హైలైట్ చేసేందుకు ఇష్టపడటంలేదని మీడియా పేర్కొంది. చైనాపై ట్రంప్ 145 శాతం టారిఫ్‌లు విధించగా, చైనా కూడా అరుదైన మూలకాల అమెరికాకు ఎగుమతులు చేయకుండా నియంత్రణలు విధించింది. ఈ అంశాన్ని ఇప్పుడు ట్రంప్ ప్రముఖంగా ప్రస్తావించడంలేదు. బుధవారం నుండి శుక్రవారం వరకూ ఆయన చైనాలో పర్యటిస్తారు. మే 14, 15 తేదీలలో బీజింగ్‌లో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ట్రంప్ రెండు సార్లు ముఖాముఖీ సమావేశాలు, మధ్యాహ్న విందు, తేనీటి విందు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. గడచిన నెలరోజులుగా కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ తమకు అనుకూలమైన ఒప్పందం కోసం ఇరాన్‌ను ఒప్పించేందుకు ట్రంప్ ప్రయత్నం చేశారు. కానీ ఇరాన్ తన సార్వభౌమాధికారాన్ని వదులుకోవడానికి ఎంతమాత్రం అంగీకరించలేదు. పరస్పర మర్యాదతో కూడిన చర్చలు జరగాలని ఇరాన్ కోరుతున్నది. శత్రువుకు తలొగ్గేదిలేదని స్పష్టం చేసింది. ఈ పరిస్థితుల్లో ట్రంప్ చైనా పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ విషయంలో లోతుగా చైనా జోక్యం చేసుకోవడం కష్టమేనని బైడెన్ పాలనలో విదేశీవ్యవహారాల ఉపమంత్రిగా పనిచేసిన కుర్ట్ క్యాంప్‌బెల్ వ్యాఖ్యానించారు. ఇరాన్‌పై ఆశతో బలవంతంగా తాను కాల్పుల విరమణ ఒప్పందాన్ని కొనసాగిస్తున్నానని, ఈ ఒప్పందం అంతిమ ఘడియల్లో, మృత్యుముఖంలో ఉందని ట్రంప్ ప్రకటించారు. ఏ క్షణంలో అయినా ఈ ఒప్పందం ముగిసిపోతుందని, తూటాలతో తాము ఇరాన్‌కు బుద్ధి చెప్పేందుకు సిద్ధపడతామని చెప్పారు. దీంతో సర్వత్రా ఉత్కంఠ ఏర్పడింది. ఇరాన్ కూడా ఎంతమాత్రం వెనక్కు తగ్గలేదు. అమెరికా దాడి చేస్తే తాము ఎదురుదాడులు చేస్తామని స్పష్టంగా ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో జిన్‌పింగ్‌పై ట్రంప్ ఒత్తిడి తెస్తారని వార్తలు వెలువడ్డాయి. ఇరాన్ చమురు కొనుగోలు చేయడంలో చైనాదే అగ్రస్థానం. హోర్ముజ్‌తో ఇరాన్ ఓడరేవులపై నెలరోజులుగా దిగ్బంధం విధించడంవల్ల చైనాకు చమురు కొరత ఏర్పడింది. యుద్ధం ముగించాలని అమెరికాపై చైనా విజ్ఞప్తి చేసింది. శాంతి ఒప్పందం కుదిరేందుకు మధ్యవర్తి పాకిస్తాన్‌కు తాము సహాయం చేస్తామని చైనా బాహాటంగా ప్రకటించింది. చైనా వైఖరి మారేలా జిన్‌పింగ్‌ను ట్రంప్ ఒప్పిస్తారని అమెరికా అధికారులు భారీ అంచనాలు వేస్తుండగా, చైనా మాత్రం అలాంటి ఆలోచనలు చేయడంలేదు. హోర్ముజ్‌ను తెరిపించేందుకు జిన్‌పింగ్ ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ట్రంప్ ప్రయత్నం చేస్తారని భావిస్తున్నారు. కానీ ఈ వ్యవహారాల్లో నేరుగా జోక్యం చేసుకునేందుకు చైనా సిద్ధంగా లేదు. మూడు చైనా సంస్థలు సహా నాలుగు సంస్థలపై అమెరికా విదేశీమంత్రిత్వశాఖ గడచిన శుక్రవారం ఆంక్షలు విధించింది. ఈ విషయాలపై చైనా దృష్టి కేంద్రీకరించింది.

**వివాదాస్పద అంశాల ప్రస్తావన సంశిగ్ధత**

చైనా పర్యటనలో తైవాన్‌కు ఆయుధాలు, హాంగ్‌కాంగ్ మీడియా టైకూన్ జిమ్మీ లై అక్రమంగా నిర్బంధించి జైలు పాలు చేయడం వంటి అనేక అంశాలను ప్రస్తావించడానికి తాను సిద్ధంగా ఉన్నానని డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. తైవాన్‌కు ఆయుధాలు ఇవ్వడాన్ని చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఈ వ్యతిరేకత మధ్య గడచిన డిసెంబరునెలలో 11 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను తైవాన్‌కు ఇచ్చేందుకు ట్రంప్ ఒక ఉత్తర్వు జారీ చేశారు. తైవాన్‌కు దీర్ఘశ్రేణి క్షిపణులు, రాకెట్ లాంచర్లు, డ్రోన్లు, శతఘ్నులు వంటి అత్యంత ఆయుధాలను సరఫరా చేసేందుకు ఈ ఆయుధ విక్రయాల ప్యాకేజీని ట్రంప్ ప్రకటించారు. రక్షణరంగంలో తైవాన్‌కు అమెరికా కీలక మద్దతుదారుగా ఉంది. తైవాన్ సార్వభౌమాధికారాన్ని చైనా సవాలు చేస్తోందని ట్రంప్ చెబుతున్నారు. ఈ సందర్భంగా తైవాన్, హాంకాంగ్ విషయాలను ప్రస్తావించడానికి తాను వెనుకంజ వేయబోనని ట్రంప్ ప్రకటించారు. రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు, ప్రపంచశాంతిపై అగ్రదేశాల నాయకులిద్దరూ ప్రధానంగా సంభాషణలు జరుపుతారని చైనా వర్గాలు అధికారికంగా ప్రకటించాయి. వాణిజ్య సంబంధాలు బలోపేతం చేసుకోవడానికి ట్రంప్ వెంట పెద్దసంఖ్యలో వ్యాపార ప్రముఖులు కూడా చైనా పర్యటనకు వెళుతున్నారు.

## సోఫాలో నోట్ల కట్టల అవినీతి కేసు.. రాజీనామాకు రామాఫోసా తిరస్కృతి



**జోహన్నెస్‌బర్గ్ :** సోఫాలో నోట్లకట్టలు దాచిన అవినీతి కేసులో దక్షిణాఫ్రికా దేశాధ్యక్షుడు రామాఫోసాపై తీవ్ర ఆరోపణలు రావడంతో ఆయన రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. కానీ పదవికి రాజీనామా చేసేందుకు ఆయన తిరస్కరించారు. ఈ అవినీతిలోపై ఏర్పాటు చేసిన కమిటీ నివేదికను ఆయన చట్టబద్ధంగా సవాలు చేశారు. పార్లమెంటు అభిశంసన కమిటీని నియమించింది. 2022లో ఈ కేసుకు సంబంధించి ఇచ్చిన దర్యాప్తు కమిటీ నివేదిక రాజ్యాంగ విరుద్ధమైనదని న్యాయస్థానం ప్రకటించింది. ఈ అవినీతి కేసుపై విచారణకు మరోసారి ఒక దర్యాప్తు కమిటీ ఏర్పాటు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. నాలుగేళ్లక్రితం పార్లమెంటు ఆయనను అభిశంసించేందుకు సిద్ధమైనప్పుడు పార్లమెంటు అడ్డుకోవడం ద్వారా రాజ్యాంగ ఉల్లంఘన జరిగిందని న్యాయస్థానం పేర్కొంది. పదవికి రాజీనామా చేయాలని సొంత వర్గాలు కోరుతున్నప్పటికీ, రాజ్యాంగ న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో తనను రాజీనామాకు నిర్బంధించలేదని, అందువల్ల తాను రాజీనామా చేయ బోనని రామాఫోసా దేశ ప్రజలను ఉద్దేశించి ఇచ్చిన టెలివిజన్ సందేశంలో పేర్కొన్నారు. రామాఫోసాకు ఉన్న గ్రామీణ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న ఒక సోఫాలో ఆయన దాచిపెట్టిన 5.80 లక్షల డాలర్ల సొమ్మును ఎవరో దొంగలు 2020లో తస్కరించారు. ఈ విషయం ఆయన ఎవ్వరికీ చెప్పలేదు. ఈ నగదును కూడా ఆయన లెక్కల్లో చూపించలేదు. సోఫాలో తను దాచుకున్న డబ్బు వేటజంతువులు విక్రయించడం ద్వారా వచ్చిన సంపాదనగా ఆయన విమర్శకులకు సమాధానం చెప్పారు. దొంగతనం జరిగిందని సాక్ష్యాధారాలు ఉన్నాయని, కానీ పార్లమెంటు కమిటీ ఈ తీర్మానాన్ని ఉద్దేశపూర్వకంగా ఓడించిందని ఆయన ప్రత్యర్థులు విమర్శిస్తున్నారు.

## కాలిఫోర్నియా మేయర్ పదవికి ఎలీన్ రాజీనామా



**ఆర్కాడియా :** దక్షిణ కాలిఫోర్నియాలోని ఆర్కాడియా మేయర్ ఎలీన్ వాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. ఆమె చైనా ప్రభుత్వానికి ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై రాజీనామా చేశారు. ఆమె అనధికారికంగా చైనా ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని, ఈ ఆరోపణలను ఆమె అంగీకరించారని, పదవికి రాజీనామా చేశారని అధికారులు మంగళవారం ప్రకటించారు. ఒక విదేశీ ప్రభుత్వానికి ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని ఎఫ్‌బిఐ గత నెలలో ఆమెపై అభియోగం మోపారు. బీజింగ్‌కు అనుకూలంగా ఉండే కథనాలు పంచుకుంటూ ఆ దేశాధికారుల ఆదేశాలతో ఆమె పోటీస్తున్నారని అధికారులు ఆరోపించారు. ఆమె వయసు 58 సంవత్సరాలు. రొటేషన్ పద్ధతిలో ఆమె మేయర్ పదవి బాధ్యతలు చేపట్టారు. చైనా అనుకూల ప్రచారం చేస్తున్నట్లు ఆమె నేరం అంగీకరించారు గనుక ఆమెకు ఫెడరల్ న్యాయస్థానంలో పది సంవత్సరాలు జైలుశిక్ష పడే అవకాశాలు ఉన్నాయి.

## అమెరికాలో గ్యాసోలిన్ టాక్స్ హాలిడే

### రిజర్వుల నుండి లక్షల బ్యారెళ్ళ చమురు విడుదల

**వాషింగ్టన్ :** పశ్చిమాసియాలో యుద్ధం, చమురు రవాణ స్తంభించిపోవడంతో అమెరికాలో కూడా గ్యాస్ ధరలు పెరిగాయి. పెట్రోల్ కొరత ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో ప్రజలు విపరీతమైన ధరల పెరుగుదలతో సతమతమవుతున్నారు. ట్రంప్‌కు వ్యతిరేకత ఎదురవుతోంది. దీంతో ఆయన ఎమర్జెన్సీ స్ట్రాటజిక్ రిజర్వుల నుండి లక్షల బ్యారెళ్ళ చమురును విడుదల చేసేందుకు ట్రంప్ ఉత్తర్వులు జారీ చేశారు. పెట్రోల్ టాక్స్‌ను రద్దుచేశారు. గ్యాసోలిన్‌పై ఉన్న పన్నును తాత్కాలికంగా రద్దుచేస్తున్నట్లు ప్రకటించారు. ఈ టాక్స్ హాలిడే వల్ల నెలకు 3.50 బిలియన్ డాలర్ల ప్రభుత్వంపై భారం పడుతుంది. ఐతే ఫెడరల్ పన్నును ట్రంప్ తనంతట తానుగా నిలిపివేయలేరు. ఈ విషయంలో ఆయనకు కాంగ్రెస్ సహాయం అవసరం. కాంగ్రెస్‌లో ఈ మేరకు ఒక తీర్మానాన్ని ట్రంప్ యంత్రాంగం ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. పనులకు వెళ్ళేవారు, విద్యార్థులు అందరికీ ఈ టాక్స్ హాలిడే ఎంతగానో ఉపయోగపడుతుందని ట్రంప్ చెబుతూ, అధికార ప్రతిపక్షాలకు చెందిన సభ్యులందరూ టాక్స్ హాలిడే కోరుతున్నారని చెప్పారు. సోమవారంనాటి గణాంకాల ప్రకారం అమెరికాలో ఒక గ్యాలన్ గ్యాస్ ధర 4.52 డాలర్లుగా నమోదైంది. గతంలో ఈ ధర మూడు డాలర్లుగా ఉండేది. ప్రస్తుతం గ్యాసోలిన్‌పై గ్యాలన్‌కు పన్నుధర 18.4 'సెంట్లు, డీజిల్ ఇంధనంపై పన్ను 24.4 సెంట్లుగా నిర్ణయించారు.

# పాకిస్థాన్ స్థావరాల్లో ఇరాన్ యుద్ధ విమానాలు

### మధ్యవర్తిపాత్ర పునఃసమీక్షకు డిమాండ్



**ఇస్లామాబాద్ :** ఇరాన్ యుద్ధ విమానాలకు పాకిస్థాన్ రహస్యంగా ఆశ్రయం ఇచ్చిందని వచ్చిన నివేదికను ఆ దేశం తీవ్రంగా ఖండించింది. కానీ అమెరికా దాడులు తప్పించుకోవడానికి ఇరాన్‌కు చెందిన యుద్ధ విమానాలకు పాకిస్థాన్‌లోని నూర్ ఖాన్ వైమానిక స్థావరాలలో చోటు ఇచ్చినట్లు ఒక తాజా నివేదిక వచ్చింది. ఇరాన్‌తో ఏప్రిల్ ఎనిమిదో తేదీన ట్రంప్ కాల్పుల విరమణ ఒప్పందం ప్రకటించిన తర్వాత అనేక యుద్ధ విమానాలను నూర్‌ఖాన్ వైమానికి స్థావరానికి ఇరాన్ తరలించిందని వెలువడిన తాజా నివేదికను పాకిస్థాన్ ఖండించినప్పటికీ, ఈ మొత్తం వ్యవహారాన్ని తిరగదోడాలని, అమెరికాతో పాకిస్థాన్‌కు ఉన్న సంబంధాలను పునఃసమీక్షించాలని అమెరికా సెనేటర్ లిండ్సే గ్రాహం పిలుపు ఇచ్చారు. ఇరాన్–అమెరికా శాంతి చర్చల్లో ఏకైక అధికారిక మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్‌పై ఈ ఆరోపణలు రావడంతో ఆ దేశ మధ్యవర్తిత్వంపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఆ దేశం ఇరాన్ పక్షం వహించిందన్న ఆరోపణలు వచ్చాయి. మధ్యవర్తిదేశం తటస్థవైఖరితో ఉండాలని, ఈ ఆరోపణలతో పాకిస్థాన్ విశ్వసనీయత సందేహంలో పడిందని లిండ్సే గ్రాహం అన్నారు. ఇరాన్‌కు చెందిన ఆర్‌సి–130 విమానాలు, సి–130 టాక్టికల్ హెర్క్యులస్ ట్రాన్స్‌పోర్ట్ విమానాలు, యుద్ధ సామాగ్రిని పాకిస్థాన్‌లో నిల్వ చేసి ఉంచారు. ఐతే చర్చల సమయంలో అనేక సంఖ్యలో అమెరికా,ఇరాన్‌కు చెందిన విమానాలు పాకిస్థాన్‌కు తరలివచ్చాయి. ఐతే కొంతమంది అధికారులు తరలివచ్చిన విమానాలను తాత్కాలికంగా పాకిస్థాన్‌లోనే ఉంచేసినట్లు ఆ దేశ అధికారులు అంగీకరించారు. ఈ మాటలన్నీ నిజమే అయితే పాకిస్థాన్ విశ్వసనీయతపై సందేశాలు ఏర్పడతాయని, ఈ వ్యవహారాన్ని పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని లిండ్సే గ్రాహం అన్నారు. కాగా తాలిబన్ ఉగ్రవాద సంస్థ ప్రధాన అధికార ప్రతినిధి జబిహుల్లా ముజహిబ్ మాట్లాడుతూ, పాకిస్థాన్‌లో యుద్ధ విమానాలను పార్కింగ్ చేయాల్సిన అవసరం ఇరాన్‌కు లేదని, అవన్నీ అసత్యాలని, అదేవిధంగా అఫ్ఘానిస్థాన్‌లో కూడా పార్కింగ్ చేయలేదని అన్నారు.

# మలేషియా తీరంలో వలసబోటు బోల్తా : 14 మంది గల్లంతు



**కౌలాలంపూర్ :** మలేసియా తీరంలో ఒక వలస బోటు తలకిందులు కావడంతో అందులో ప్రయాణిస్తున్నవారిలో 14 మంది జాడ తెలియకుండాపోయారు. మరో 23 మందిని సహాయబృందాలు రక్షించాయి. మలేషియా తీర రక్షణదళం వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చింది. వీరిలో కొందరికి చికిత్సలు అందిస్తున్నారు. జాడ తెలియకుండాపోయిన వలస ప్రయాణికులకోసం మలేషియా తీర ప్రాంత గస్తీ బృందాలు మలక్కా జలసంధిలో తీవ్రంగా అన్వేషణ చేస్తున్నాయి. ప్రమాద సమయంలో ఈ బోటులో 37 మంది ప్రయాణం చేస్తున్నారు. ఈ బోటులో వలస వెళుతున్నవారెవరికీ సరైన అధికారిక పత్రాలు లేవు. మలేసియా పాంక్కోర్ దీవుల వద్ద సోమవారం ఉదయం ఈ ప్రమాద ఘటన జరిగింది. వీరంతా దారిద్ర్యాన్ని భరించలేక మంచి జీవితాన్ని వెతుక్కుంటూ ఇండోనేసియా కిసారన్ నుండి కౌలాలంపూర్‌సహా సలంగోర్,తెరెంగ్గను,పెనాంగ్ వంటి ఆర్థికంగా పరిపుష్టమైన నగరాలకు వలసపోతున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. బోటు తలకిందులైన తర్వాత చాలామంది ప్రయాణికులు ప్రాణాలు నిలబెట్టుకునేందుకు పోరాడుతున్న సమయంలో జాలరులు చూసి వారిని రక్షించారు. బ్రతికిబయట పడిన 23 మందిలో ఏడుగురు మహిళలు ఉన్నారు. ఆసియాలో అత్యంత ప్రమాదకరమైన ఈ ప్రాంతం నుండి ప్రతి సంవత్సరం ఒక లక్ష నుండి రెండు లక్షలమంది వలస ప్రజలు ఇలా అక్రమంగా బోట్లలో ఇటువైపు నుండి తరలివెళ్ళేందుకు సాహసిస్తూ ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలా పేదరికంతో బాధపడుతూ మంచి జీవితం కోరుకునేవారిని ప్రోత్సహించి ఇతర దేశాలకు తరలించేందుకు సిండికేట్ గ్రూపులు ఉన్నాయి. ఈ గ్రూపులు వారిని ప్రోత్సహించి డబ్బు దండుకుని అక్రమ మార్గంలో తరలిస్తూ వారిని ప్రాణాలు బలితీసుకోవడానికి కారణమవుతున్నాయి.

## నీట్ రద్దు

(మొదటి పేజీ తరువాయి)

టెస్టింగ్ ఏజెన్సీ నిర్ణయించింది' అని ఆ సంస్థ తెలిపింది. నీట్ పరీక్షను భారతదేశంలోని 551 నగరాల్లోనూ, విదేశాల్లోని 14 నగరాల్లోనూ నిర్వహించింది. మళ్ళీ నిర్వహించే పరీక్షా తేదీలను, అలాగే సవరించిన అడ్మిట్ కార్డుల జారీ షెడ్యూల్‌ను... రాబోయే రోజుల్లో ఏజెన్సీ అధికారిక మాధ్యమాల ద్వారా తెలియజేస్తామని పేర్కొంది. ఈ పరీక్షకు సంబంధించిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపేందుకు, ఈ విషయాన్ని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఎన్‌టిఎ తెలిపింది. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, జాతీయ పరీక్షా విధానంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని గౌరవిస్తూనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. పరీక్షను మళ్ళీ నిర్వహించడం వల్ల అభ్యర్థులకు, వారి కుటుంబాలకు నిజమైన, గణనీయమైన అసౌకర్యం కలుగుతుందని ఆ సంస్థ అంగీకరించింది. అయినప్పటికీ, పరీక్షా విధానంపై ఉన్న విశ్వాసానికి మరింత తీవ్రమైన, దీర్ఘకాలిక నష్టం జరగకుండా నివారించడానికి ఈ నిర్ణయం తీసుకోవడం అత్యవసరమని అది పేర్కొంది. కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదు, అదనపు పరీక్షా రుసుము వసూలు చేయబడదని ఎన్‌టిఎ ఆ ప్రకటనలో వెల్లడించింది. ఇదిలా ఉండగా, ప్రశ్నపత్రాలను ప్రత్యేకమైన, గుర్తించదగిన వాటర్ మార్క్ ఐడెంటిఫైయర్‌లతో కూడిన జిపిఎస్ ట్రాక్ వాహనాల్లో రవాణా చేశారని, పరీక్షా కేంద్రాలను ఒక కేంద్ర నియంత్రణ గది నుండి ఎఐ సహాయక సిసిటివి నిఘా ద్వారా పర్యవేక్షించారని ఆదివారం ఎక్స్‌లో ఎన్‌టిఎ తెలిపింది. 'నీట్ (యూజీ) 2026 పరీక్షకు సంబంధించి జరిగినట్లు ఆరోపించబడిన అవకతవకలపై రాజస్థాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ చేపట్టిన చర్యలకు సంబంధించిన నివేదికల గురించి జాతీయ పరీక్షల ఏజెన్సీకి తెలుసు. 3న పరీక్ష షెడ్యూల్ ప్రకారం, పూర్తి భద్రతా ప్రోటోకాల్ మధ్య నిర్వహించబడిందని ఎన్‌టిఎ తెలిపింది. రాజస్థాన్ పోలీసుల ఎస్‌ఓజీ అదనపు డైరెక్టర్ జనరల్ (ఎడిజి) విశాల్ బన్సల్ మాట్లాడుతూ, పరీక్షకు ముందు విద్యార్థులకు పంపిణీ చేయబడినట్లు ఆరోపించబడిన ఒక 'గెస్ పేపర్'పై ప్రస్తుతం దర్యాప్తు కేంద్రీకృతమై ఉందని చెప్పారు. **'నీట్ పరీక్షకు సంబంధించి నెలకొన్న వివిధ అపోహల గురించి నేను ఒక నిర్దిష్ట విషయాన్ని స్పష్టం చేయాలనుకుంటున్నాను:** సుమారు 410 ప్రశ్నలతో కూడిన ఒక గెస్ పేపర్ ఉంది. వీటిలో, దాదాపు 120 ప్రశ్నలు కెమిస్ట్రీ నుండి వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి' అని బన్సల్ తెలిపారు. పరీక్షలోని రసాయన శాస్త్ర పత్రంలో 45 ప్రశ్నలు ఉండగా, పరీక్ష కోసం నాలుగు సెట్ల ప్రశ్నపత్రాలను ఉపయోగించారు. 'ఈ 'గెస్ పేపర్' (అంచనా పత్రం) విద్యార్థుల మధ్య పరీక్షకు చాలా ముందుగానే చలామణి అవుతున్నట్లు సమాచారం, అసలు పరీక్షకు 15 రోజుల నుండి ఒక నెల ముందుగానే ఇది వారి చేతులకు చేరడం ప్రారంభమైంది. మేము ఈ గెస్ పేపర్ ఆధారంగా దర్యాప్తు జరుపుతున్నాము, అంతేకాకుండా ఇది బహిరంగంగా కూడా అందుబాటులో ఉంది' అని ఆయన పేర్కొన్నారు.

**పరీక్ష రద్దుపై భగ్గుమన్న విద్యార్థి సంఘాలు**

నీట్ పరీక్ష పేపరు లీక్ జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్‌టిఎ ప్రకటించడంతో దేశ వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. పలుచోట్ల వీధుల్లోకి వచ్చిన ఆందోళన చేశాయి. దేశ రాజధాని ఢిల్లీలో నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎస్‌యుఐ) ఆధ్వర్యంలో మంగళవారం శాస్త్రి భవన్ వెలుపల భారీ నిరసన ప్రదర్శన జరిగింది. కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం సభ్యులు పలువురు ఈ నిరసనలో పాల్గొన్నారు. 'పిఎం రాజీపడ్డారు, పేపర్ రాజీపడింది', 'పేపర్ లీక్, మోదీ సర్కార్ బలహీనం', 'డాక్టర్ డిగ్రీ అమ్మకానికి ఉంది' వంటి నినాదాలు రాసి ఉన్న ప్లకార్డులను చేతుల్లో పట్టుకుని నిరసన తెలిపారు. శాస్త్రి భవన్ వెలుపల భారీగా బారికేడ్లు, పోలీసుల పహారా ఉండగా, 'విద్యార్థులపై అణచివేత ఆపండి' వంటి నినాదాలను గట్టిగా వినిపించారు. నీట్ పరీక్షా ప్రక్రియలో భారీ ఎత్తున అవకతవకలు, తీవ్రమైన లోపాలు జరిగాయని, పరీక్ష రద్దు కావడమే దానికి నిదర్శనమని ఎన్‌ఎస్‌యుఐ పేర్కొంది. లక్షలాది మంది కష్టపడి చదివే విద్యార్థుల భవిష్యత్తును కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం పదేపదే విఫలమైందని ఆరోపించింది. విశ్వసనీయమైన పరీక్షలను నిర్వహించడంలో ఆ సంస్థ పదేపదే విఫలమైందని పేర్కొంటూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, ఎన్‌టిఎపై పూర్తి నిషేధం విధించాలని డిమాండ్ చేసింది.

## నిర్లక్ష్యం సహించబోం

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సిఎం అన్నారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగే విధంగా చూడాలని సూచించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రిపోర్ట్ పంపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**ప్రతీ ఐకెపి సెంటర్‌కు ఒక అధికారి నియామకం**

ప్రతీ ఐకెపి సెంటర్‌కు ఒక అధికారిని నియమించి కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలు తలెత్తకుండా చూడాలని సిఎం అధికారులను ఆదేశించారు. ప్రతీ రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. ధాన్యం లోడింగ్ లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పనిచేయించుకోవాలన్నారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలని, అలా చేస్తే తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చని చెప్పారు. లారీల కొరతను అధిగమించేందుకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

**పంట కొనుగోళ్లపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో కలెక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. జిల్లాల్లో ఎక్కడ సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన అన్ని సహాయ, సహకారాలను అందిస్తుందని తెలిపారు. ధాన్యం సేకరణ విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందించేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

**రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు: మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు**

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. సరిహద్దు రాష్ట్రాల రైతులు కొంత మంది ధాన్యాన్ని తెలంగాణలో కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారని, దీంతో కొన్నిచోట్ల సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు. సరిహద్దు రాష్ట్రాల రైతులు ధాన్యం తీసుకురాకుండా సంబంధిత జిల్లా కలెక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరులోగా ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు.

## జూన్ 2 నుంచి రెండో విడత

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. గత ప్రభుత్వం నగరానికి 2030 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించడం వల్ల లబ్ధిదారుల జీవనోపాధికి ఇబ్బంది కలిగిందని మంత్రి విమర్శించారు. ఈ తప్పు పునరావృతం కాకుండా, పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతానికి 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇళ్లను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని స్థల సేకరణ చేయాలని సూచించారు.

**డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లపై స్పెషల్ డ్రైవ్..**

ఇప్పటికే పూర్తయిన, నిర్మాణ దశలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ నెలాఖరులోగా లబ్ధిదారులను గుర్తించి, కాలనీల్లో మంచినీరు, విద్యుత్, డ్రైనేజి వంటి కనీస వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. హైదరాబాద్ పరిధిలో సొంత స్థలం కలిగి ఉండి, ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులకు ఈ నెలాఖరులోగా మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**భూ ఆక్రమణలపై కఠిన చర్యలు..**

ప్రభుత్వ భూమి అంగుళం అన్యాక్రాంతమైనా సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో నిబంధనలకు విరుద్ధంగా యుఎల్‌సి భూములను రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**రాజకీయాలకు తావులేకుండా ఎంపిక..**

ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పేదరికమే ప్రాతిపదికగా, ఎలాంటి రాజకీయ భేషజాలు లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు. శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్లు ప్రతి వారం ఈ పథకంపై సమీక్ష నిర్వహించి, పేదలకు మేలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ఎంపిలు అసదుద్దీన్ ఓవైసీ, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణకు 10, ఎపికి 16 టిఎంసిలు

(మొదటి పేజీ తరువాయి)

తేదీ వరకు అమలులో ఉంటుందని అధికారులు వెల్లడించారు. నీటి వినియోగం, నిల్వల పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ అవసరం మేరకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కృష్ణా జలాల వినియోగంపై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నీటి పంపిణీ అంశంపై కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కెఆర్‌ఎంబి) ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో ఇరు రాష్ట్రాల నుంచి త్రీసభ్య కమిటీ అత్యవసర సమావేశం జరిగింది. ఈ నెల 14న కెఆర్‌ఎంబి 21వ సమావేశం జరగనున్న నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రెండు రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల తాగునీటి అవసరాలు, ప్రస్తుత జలాశయ నిల్వలు, వేసవి అవసరాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు సుదీర్ఘంగా చర్చించారు.

**తెలంగాణ ఫిర్యాదులో ముందస్తు త్రీసభ్య కమిటీ సమావేశం**

కృష్ణా జలాల వినియోగంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీరు పట్ల తెలంగాణ ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు ఇటీవల లేఖ రాసింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ తనకు కేటాయించిన వాటా కంటే అధికంగా కృష్ణా జలాలను వినియోగించిందని, సంయుక్త ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలలను కచ్చితంగా పర్యవేక్షించాలని కెఆర్‌ఎంబిని కోరుతూ తెలంగాణ సాగు నీటి శాఖ అధికారులు లేఖ రాశారు. 202526 సంవత్సరంలో ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ 533.53 టిఎంసిల కృష్ణా జలాలను వినియోగించుకోగా, తెలంగాణ కేవలం 116.9 టిఎంసిలకు మాత్రమే పరిమితమైందని లేఖలో వివరించారు. ఇది మొత్తం 650.44 టిఎంసిల నీటి వినియోగంలో ఎపి వాటా 82.03 శాతం ఉండగా, తెలంగాణ వాటా కేవలం 17.97 శాతమేనని తెలియజేసింది. ప్రస్తుతం అమలులో ఉన్న తాత్కాలిక 66:34 నిష్పత్తి ప్రకారం కూడా ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన వాటాలో కేవలం 82 టిఎంసిలు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలంగాణ అధికారులు లెక్కలతో సహా కెఆర్‌ఎంబికి వివరించారు. అయితే, గత వినియోగం మేరకు చూస్తే ఈనెల 31 వరకు ఎపికి ఇంకా 142 టిఎంసిల నీరు అవసరమయ్యే అవకాశముందని అంచనా వేశారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల్లో ప్రస్తుతం కనీస నీటి మట్టం (ఎండిడిఎల్) పైగా వరుసగా 146.8 టిఎంసిలు, 152.21 టిఎంసిల నీరు అందుబాటులో ఉందని, మొత్తం నిల్వలు 299.02 టిఎంసిలుగా ఉన్నాయని తెలిపారు. ఈ నిల్వలు వేసవి అవసరాలకు కీలకమని, అందుకే నీటి వినియోగంపై కఠిన నియంత్రణ అవసరమని తెలంగాణ అభిప్రాయం వ్యక్తం చేస్తోంది. కృష్ణా జలాల అంశంపై పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈనెల 14న ఇరు రాష్ట్రాలతో మరింత సమగ్ర చర్చించేందుకు కెఆర్‌ఎంబి సమావేశం కీలకం కానుంది.

## కుదిరిన ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

భారంగా మారిన ఈ తరుణంలో, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మళ్లీ ఎన్‌డిడిబిని రంగంలోకి దించామన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచే వారు పగ్గాలు చేపడతారని, ఆ సంస్థను గట్టెక్కించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది' అని ప్రకటించారు. నార్ముల్ సంస్థకు ఉన్న అప్పుల బాధ్యతను ఎన్‌డిడిబి తీసుకుంటుందన్నారు. కొత్త ఒప్పందం ప్రకారం సేకరించిన ప్రతి లీటర్ పాలపై ఎన్‌డిడిబి రూ. 6.50 చొప్పున నార్ముల్ సంస్థకు చెల్లిస్తుందన్నరు.

**రైతు కళ్లలో ఆనందం చూడటమే మా లక్ష్యం!**

'నార్ముల్‌ను కాపాడుకుంటామని ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన మాటను ఈ రోజు నిలబెట్టుకున్నాం' అని బీర్ల అయిలయ్య సంతోషం వ్యక్తం చేశారు. ఎన్‌డిడిబి లాంటి జాతీయ సంస్థ పర్యవేక్షణలో డెయిరీ నడవడం వల్ల ఇకపై పాల సేకరణ, నిల్వ, మార్కెటింగ్లో అంతర్జాతీయ ప్రమాణాలు అందుబాటులోకి వస్తాయని, ఇది నల్లగొండ రంగారెడ్డి పాడి రైతులకు శాశ్వత భరోసా ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందంతో మదర్ డెయిరీకి ఉన్న మిగిలిన ఆర్థిక భారాలను కూడాఎన్‌డిడిబి స్వీకరిస్తుందన్నారు. ఫలితంగా డెయిరీపై ఎలాంటి ఆర్థిక ఒత్తిడి ఉండదని, ఉమ్మడి జిల్లాల పాడి రైతులకు గిట్టుబాటు ధరతో పాటు సకాలంలో నగదు అందుతుందని మంత్రి శ్రీహరి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మదర్ డైరీ చైర్మెన్ మదుసూధన్ రెడ్డి, పశుసంవర్ధక, డెయిరీ, ఫిషరీస్ సెక్రటరీ ఇలంబర్తి, ఎన్‌డిడిబి ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'విష కాలం'

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిఫలంగా వారికి దక్కింది ఏమిటి? పేపర్ లీకులు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా రంగంలో వ్యవస్థీకృత అవినీతి మాత్రమే అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. 'ఇది కేవలం ఒక వైఫల్యం మాత్రమే కాదు— ఇది యువత భవిష్యత్తుపై చేసిన ఒక నేరం' అని విమర్శించారు. ప్రతిసారీ, 'పేపర్ మాఫియా' ఎటువంటి శిక్ష లేకుండా తప్పించుకుంటుంటే, నిజాయితీపరులైన విద్యార్థులు మాత్రం శిక్షను అనుభవిస్తున్నారని ఆవేదన చెందారు. ఇప్పుడు, లక్షలాది మంది విద్యార్థులు మరోసారి అదే మానసిక ఒత్తిడిని, ఆర్థిక భారాన్ని, అనిశ్చితిని భరించాల్సి వస్తుందని ఆయన అన్నారు. ఒకరి భవిష్యత్తు కఠోర శ్రమ ద్వారా కాకుండా, కేవలం డబ్బు, పలుకుబడి ద్వారా నిర్ణయించబడితే, ఇక విద్యకు అర్థం ఏమిటి? అని కాంగ్రెస్ మాజీ అధినేత ప్రశ్నించారు. 'ప్రధాన మంత్రి గొప్పగా చెప్పుకుంటున్న 'అమృత కాలం', దేశానికి ఒక 'విష కాలం'గా మారిపోయింది'అని గాంధీ వ్యాఖ్యానించారు.

**బెంగాల్‌లో నియామకాలపై తీవ్ర ఆగ్రహం**

కాగా, మాజీ ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్ అగర్వాల్‌ను పశ్చిమ బెంగాల్ కొత్త ప్రధాన కార్యదర్శిగా, సుబ్రతా గుప్తాను ముఖ్యమంత్రి సువేందు అధికారికి ప్రధాన సలహాదారుగా నియమించడంపై రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పించారు. బిజెపి–ఇసి 'దొంగల బజారు'లో దొంగతనం ఎంత పెద్దదైతే, ప్రతిఫలం అంత పెద్దదిగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ నియామకాలు ఎన్నికల సంఘానికి, బిజెపికి మధ్య ఉన్న 'నిస్సిగ్గు కుమ్మక్కు, కుట్ర'ను ప్రతిబింబిస్తున్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ కుమ్మక్కును గోప్యంగా లేదా రహస్యంగా ఉంచడానికి కనీస ప్రయత్నం కూడా జరగడం లేదని ప్రతిపక్ష పార్టీ తెలిపింది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలను పర్యవేక్షించిన 1990 బ్యాచ్ ఐఎఎస్ అధికారి, మాజీ ప్రధాన ఎన్నికల అధికారి అయిన అగర్వాల్‌ను బిజెపి నేతృత్వంలోని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కొత్త ప్రధాన కార్యదర్శిగా నియమించిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. బెంగాల్‌లో ఎస్‌ఐఆర్ తొలగింపులను ప్రత్యేక రోల్ అబ్జర్వర్‌గా పర్యవేక్షించిన మరో 1990 బ్యాచ్ ఐఎఎస్ అధికారి గుప్తాను ముఖ్యమంత్రికి ప్రధాన సలహాదారుగా నియమించారని రమేష్ ఎత్తి చూపారు.

## కఠినంగా శిక్షించాలి

(మొదటి పేజీ తరువాయి)

కష్టపడి, ఆశతో చదువుకుని నీట్ పరీక్షకు హాజరైన లక్షలాది మంది విద్యార్థులను మరోసారి శిక్షకు గురువుతున్నారని సిపిఐ ఆక్షేపించింది. నీట్ స్కామ్ పరీక్షా విధానంలో మోదీ ప్రభుత్వం పూర్తి పతనాన్ని బట్టబయలు చేసిందని మంగళవారం ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం మండిపడింది. ఇది యాదృచ్ఛికం కాదని, ఒక పద్ధతి ప్రకారం జరుగుతోందని, పదేపదే జరుగుతోన్న ప్రశ్నపత్రాల లీకులు, పరీక్ష కుంభకోణాలు, రద్దులు ఈ ప్రభుత్వ హయాంలో పరీక్ష వ్యవస్థ పతనాన్ని బట్టబయలు చేసిందని ఆరోపించింది. పేద, గ్రామీణ, అణగారిన వర్గాల విద్యార్థులను ఫణం గా పెట్టి కోచింగ్ సెంటర్లకు, ఉన్నత వర్గాలకు ప్రయోజనం చేకూర్చే తీవ్ర వివక్షాపూరిత వ్యవస్థను నిర్మిస్తూ మోదీ ప్రభుత్వం పదే పదే విద్యార్థుల ఆకాంక్షలను నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తింది. అసలు నీట్ పరీక్షే అన్యాయమైనదని, వివక్షాపూరితమైనదని సిపిఐ పునరుద్ఘాటించింది.

# పంజాబ్‌పై ఢిల్లీ ప్రతీకారం

## ఐదో విజయంతో ప్లే ఆఫ్ రేస్‌లోకి..!



పంతొమ్మిదో సీజన్‌లో పంజాబ్ కింగ్స్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. ధర్మశాలలో రెండొందలు కొట్టిన పంజాబ్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ చిత్తుగా ఓడించింది. 211 పరుగుల ఛేదనలో టాప్‌ఆర్డర్ విఫలమైనా.. అక్షర్ పటేల్(56) కెప్టెన్ ఇన్నింగ్స్‌కు డేవిడ్ మిల్లర్(51)లు కంగారు పడలేదు. కాస్త కుదురుకున్నాక గేర్ మార్చిన ఇద్దరూ అర్ధ శతకాలతో మెరవగా.. ఇంప్యాక్ట్ సబ్ అశుతోష్ శర్మ(24), అకీబ్ నబీ(10 నాటౌట్) ఒత్తిడికి లోనవ్వకుండా లాంఛనం పూర్తి చేశారు. దాంతో, పంజాబ్‌కు వరుసగా నాలుగో ఓటమి ఎదురవ్వగా.. ఐదో విజయంతో ఢిల్లీ ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చింది.

ప్లే ఆఫ్స్ రేసులో వెనకబడిన ఢిల్లీ క్యాపిటల్స్ అదిరే విజయంతో ముందంజ వేసింది. గత మ్యాచ్‌ల్లో రికార్డు లక్ష్యాన్ని ఛేదించిన పంజాబ్ కింగ్స్‌ను ఓడించి ఆశలు సజీవంగా ఉంచుకుంది. సోమవారం ధర్మశాల వేదికగా జరిగిన మ్యాచ్లో అక్షర్ పటేల్(56), డేవిడ్ మిల్లర్(51) వీరబాదుడుతో పంజాబ్‌పై ప్రతీకార విక్టరీతో మురిసింది ఢిల్లీ. ఛేదనలో ఢిల్లీకి ఆదిలోనే షాకిచ్చాడు యశ్ ఠాకూర్. అభిషేక్ పొరెల్(5)ను బౌల్ చేయగా.. అర్ష్‌దీప్ ఓవర్లో ఫోర్ బాదిన కేఎల్ రాహుల్(9).. షార్ట్ బంతికి దొరికిపోయాడు. 14 పరుగులకే ఓపెనర్లు డగౌట్ చేరారు. ఓ సిక్సర్‌తో అలరించిన కుర్రాడు సహిల్ పరాక్ (0) సైతం అర్ష్‌దీప్ ఓవర్‌లో స్లిప్‌లో చాహల్‌కు క్యాచ్ ఇచ్చేశాడు. అనంతరం కెప్టెన్ అక్షర్ పటేల్(56), స్టబ్స్(12) దూకుడుగా ఆడారు. స్టోయినిస్ ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లు బాదిన అక్షర్ ఆఖరి బంతికి ఔటయ్యాడు. అయినా.. డేవిడ్ మిల్లర్(51) బౌండరీలతో భయపెట్టాడు. ద్వారుషీ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు బాదిన ఈ డాషింగ్ బ్యాటర్ ఆ తర్వాత వికెట్ కీపర్ చేతికి చిక్కాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా ఇంప్యాక్ట్ సబ్ అశుతోష్ శర్మ(24) పట్టువదల్లేదు. స్టోయినిస్ వేసిన 17వ ఓవర్లో అశుతోష్ 4, 6 .. మధవ్ తివారీ(18 నాటౌట్) సిక్సర్ బాదగా 19 రన్స్ వచ్చాయి. కానీ, తర్వాతి ఓవర్లో అశుతోష్ ఔటయ్యాడు. దాంతో.. ఉత్కంఠ నెలకొంది. కానీ, అకీబ్ నబీ(10 నాటౌట్) వస్తూనే ఫోర్, సిక్సర్తో ఢిల్లీకి మూడు వికెట్ల విజయాన్ని అందించాడు.

**ప్రియాన్ష్, శ్రేయాస్ అర్ధశతకాలు...** సొంత మైదానమైన ధర్మశాలలో తొలుత ఆడిన పంజాబ్ కింగ్స్ భారీ స్కోర్ కొట్టింది. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(56) విధ్వంసక ఆటతో రెచ్చిపోగా.. పవర్ ప్లేలో ఢిల్లీ బౌలర్లు నీరుగారిపోయారు. ప్రభ్సిమ్రన్ సింగ్(18)తో కలిసి దంచేశాడు. ముకేశ్ ఓవర్లో ప్రభ్సిమ్రన్ ఔటవ్వగా తొలి వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కూపర్ కొన్నొల్లీ (38) అండగా మిడిల్ ఓవర్లో శ్రేయాస్ అయ్యర్ (59 నాటౌట్) దంచేశాడు. ఆఖర్లో మిచెల్ స్టార్క్ (257) రెండు వికెట్లు తీసినా సూర్యాన్ష్ షెడ్గే(21 నాటౌట్) మెరుపులతో పంజాబ్ స్కోర్ రెండొందలు దాటింది. చివరి ఓవర్లో ఎంగిడి ఏడు పరుగులే ఇవ్వగా పంజాబ్ 210కి పరిమితమైంది.



## ఆసియా వెయిట్ లిఫ్టింగ్‌లో

# కోమల్‌కు కాంస్యం

**గాంధీనగర్:** సొంతగడ్డపై ఆసియా వెయిట్లిఫ్టింగ్ చాంపియన్షిప్లో భారత్ పతకాల ఖాతా తెరిచింది. సోమవారం జరిగిన మహిళల 48 కేజీల విభాగంలో భారత లిఫ్టర్ కోమల్ కోహర్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. స్టార్ వెయిట్లిఫ్టర్ మీరాబాయి చాను గైర్హాజరీలో బరిలోకి దిగిన 23 ఏళ్ల కోమల్ స్నాచ్లో 78 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్లో 99 కేజీలు కలిపి మొత్తం 177 కేజీల బరువును ఎత్తి మూడో స్థానంలో నిలిచింది.

## రెజ్లర్ దీపక్ పునియాకు స్వర్ణ పతకం



**గొండా (యూపీ):** డబ్ల్యూఎఫ్ఐ సీనియర్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్లో భారత స్టార్ రెజ్లర్ దీపక్ పునియా స్వర్ణంతో మెరిశాడు. సోమవారం జరిగిన పురుషుల ఫ్రీ స్టయిల్ 92 కేజీల విభాగం ఫైనల్లో దీపక్ (హర్యానా).. తన రాష్ట్రానికే చెందిన వంశ్ను ఓడించి టాప్ ర్యాంకింగ్ను దక్కించుకున్నాడు. ఇతర విభాగాల్లో సాగర్ (57 కేజీలు), అభిషేక్ (61 కేజీలు), యష్ (74 కేజీలు), నవీన్ (79 కేజీలు) స్వర్ణాలు గెలుచుకున్నారు.

## మహిళ

# అసమానతల మధ్య వలస బతుకులు..



యుద్ధాలు.. అంతర్యుద్ధాలు.. తీవ్రమైన కరువు వంటి అనేకానేక కారణాలతో ఒక దేశం నుంచి మరో దేశానికి వలస వెళ్లే వారి బతుకులు అధ్వాన్నంగా మారుతున్నాయి. ప్రత్యేకించి మహిళలు శారీరక దోపిడికి, మానసిక హింసకు గురవుతున్నారు. సాధారణంగా, వలస అనేది అనేక మహిళలకు కొత్త అవకాశాలు, ఆర్థిక స్వావలంబన, కుటుంబానికి మెరుగైన జీవితం అందించే మార్గంగా కనిపిస్తుంది. అయితే, దేశ సరిహద్దులు దాటే క్షణం నుంచే ప్రమాదాలు ప్రారంభమవుతాయి. ప్రయాణ దశలోనే లైంగిక హింస, దోపిడీ, మోసం, బలవంతపు శ్రమ, అక్రమ రవాణా వంటి సమస్యలు ఎదురవుతాయి. పత్రాలు లేకుండా, సరైన సమాచారం లేకుండా లేదా పరిమిత ఆర్థిక వనరులతో ప్రయాణించే మహిళలు ఎక్కువగా ఈ ప్రమాదాలకు గురవుతున్నారు. నియంత్రణలో లేని మధ్యవర్తులు లేదా బ్రోకర్లు అధిక ఫీజులు వసూలు చేయడం, తప్పుడు హామీలు ఇవ్వడం సాధారణం. వలస ప్రయాణం మొదలయ్యే సమయానికి అనేక మహిళలు అప్పులపాలు అవుతున్నారు. అప్పుల భారంతో వారు నియామక దారులపై ఆధారపడాల్సి వస్తుంది. ఇది వారిని బలవంతపు శ్రమ లేదా మానవ అక్రమ రవాణా వలలోకి నెట్టివేస్తుంది. ఐక్యరాజ్య సమితి నివేదికలను అనుసరించి, అక్రమమార్గాల ద్వారా ప్రయాణించే మహిళలకు ప్రమాదం మరింత ఎక్కువ. దక్షిణాఫ్రికా–జింబాబ్వే మార్గంలో నిర్వహించిన పరిశోధనల ప్రకారం, సరిహద్దు దాటిన కొత్త మహిళల్లో చాలామంది లైంగిక దాడికి గురయ్యారని లేదా అలాంటి ఘటనలను ప్రత్యక్షంగా చూశారని వెల్లడైంది. కొందరు పురుషులు సరిహద్దు దాటేందుకు ధరగా అత్యాచారం చేశామని ఒప్పుకున్నారు. అలాగే కొలంబియా–పనామా మధ్య ఉన్న డారిన్ గ్యాప్ ప్రాంతంలో లైంగిక హింస కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అందుకే, ఇది లాటిన్ అమెరికాలో అత్యంత ప్రమాదకర మార్గా ల్లో ఒకటిగా ముద్రపడింది. మహిళలు అక్రమ రవాణాకు గురైనప్పుడు శారీరక హింసకు పురుషుల కంటే మూడు రెట్లు ఎక్కువగా గురవుతారు. మానవ అక్రమ రవాణా లాభాపేక్షతో నడిచే క్రూర వ్యవస్థ. ఇది లింగ అసమానతలను ఆధారంగా చేసుకొని మహిళల శరీరాలను, శ్రమను సరుకుల్లా కొనుగోలు చేసి అమ్ముతుంది. ప్రపంచవ్యాప్తంగా గుర్తించిన రవాణా బాధితుల్లో 60 శాతం కంటే ఎక్కువ మంది మహిళలు లేదా బాలికలు. వారిలో అనేకమంది తమ స్వదేశం వెలుపల ఇతరత్రా దేశాల్లో ఉన్నట్టు వివిధ అధ్యయనాలు నిరూపిస్తున్నాయి. ఈ సమస్య అంతర్జాతీయ వలస వెళుతున్న మహిళల జీవిత స్వరూపాన్ని స్పష్టంగా చూపిస్తుంది. అంతేకాదు, టెక్నాలజీ అభివృద్ధి కూడా మహిళలను ఇబ్బందుల్లోకి నెడుతున్నది. సామాజిక మాధ్యమాలు, ముందుగానే లక్ష్యంగా చేసుకొని వాడుకునే మెసేజింగ్ యాప్స్ ద్వారా మహిళలను మోసగించడం, ప్రొఫైలింగ్ చేయడం జరుగుతోంది. డీప్‌ఫేక్ ఆధారిత బ్లాక్‌మెయిల్, ఆన్‌లైన్ పర్యవేక్షణ ద్వారా కూడా బెదిరింపులు కొనసాగుతున్నాయి. క్రిప్టోకరెన్సీల ద్వారా లాభాలను తరలించడం వల్ల ఈ నెట్‌వర్క్‌ల ఆర్థిక ప్రవాహాన్ని గుర్తించడం కష్టమవుతోంది.

ప్రపంచంలోని 304 మిలియన్ అంతర్జాతీయ వలసదారుల్లో దాదాపు సగం మహిళలే. వారిలో చాలా మంది గృహ సేవలు, సంరక్షణ రంగాల్లో పనిచేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 75.6 మిలియన్ గృహ కార్మికుల్లో 76 శాతం మహిళలు. ఈరంగం ఎక్కువగా నియంత్రణలేని రంగంగా ఉండటం వల్ల హింస, దోపిడీకి అవకాశాలు ఎక్కువ. ఇళ్లలో పనిచేయడం వల్ల మహిళలు ప్రజా పర్యవేక్షణకు దూరంగా ఉంటారు. ఇది దుర్వినియోగాన్ని గుర్తించకుండా చేస్తుంది. అనేక దేశాల్లో గృహ కార్మికులను కార్మికచట్టాల పరిధిలోకి తీసుకోరు. విశ్రాంతి దినాలు లేకపోవడం, కనీస వేతనం లేకపోవడం, నివాస హక్కులు యజమానిపై ఆధారపడటం వంటి పరిస్థితులు వారిని బలహీన స్థితిలో ఉంచుతాయి. గృహ సేవలలో బానిసత్వానికి గురైన బాధితుల్లో 87 శాతం మహిళలు లేదా బాలికలే. కఫాలా వంటి స్పాన్సర్‌షిప్ వ్యవస్థలలో మహిళల వీసాలు యజమానులకు కట్టుబడి ఉంటాయి. ఇది హింసాత్మక పరిస్థితుల నుండి బయటపడే స్వేచ్ఛను పరిమితం చేస్తుంది. లైంగిక దాడులు, వేతనాలు నిలిపివేయడం, దీర్ఘకాలిక పనిగంటలు సాధారణంగా నమోదవుతున్నాయి. థాయిలాండ్‌లో నిర్వహించిన ఓ సర్వే ప్రకారం, మయన్మార్‌కు చెందిన వలస గృహ కార్మికుల్లో ఆరుగురిలో నలుగురు హింసను అనుభవించారు. ఇతర దేశాలకు చేరుకోవడం అనేది భద్రతను హామీ ఇవ్వదు. పైగా, లింగం, జాతి, జాతీయత, వలస స్థితి ఆధారంగా వివక్ష అనుభవించాల్సి వస్తుంది. కొలంబియాలో వెనిజులా వలసదారుల కోసం ఐక్యరాజ్య సమితి మహిళల విభాగం, చట్టబద్ధ ఉపాధి అనుమతులు, సరిహద్దు మొబిలిటీ కార్డులు అందించిన కార్యక్రమాలు చేపట్టాయి. అయితే ఇలాంటి చర్యలు అత్యధిక శాతం దేశాల్లో లేవు. అనధికారికంగా వలస వెళ్లిన దేశాల్లో ఉంటున్న మహిళలను, తాము ఫిర్యాదు చేస్తే అరెస్టవుతామనే భయం వెంటాడుతూ ఉంటుంది. అందుకే ఎన్నో కేసులు వేదనతో మొదలై, మౌనంగా మిగిలిపోతున్నాయి. కొన్ని నిర్బంధ కేంద్రాల్లో మహిళలు పురుషుల కంటే రెండింతలకుపైగా లైంగిక హింసను ఎదుర్కొంటున్నారు. ఆరోగ్య సేవలకు, ముఖ్యంగా లైంగిక, ఆరోగ్యసేవలకు అవకాశాలు చాలాతక్కువగా ఉంటాయి. ఎంతోఆశతో ఇతర ప్రాంతాలకు వెళ్లి, అక్కడ ఉండలేక, హింసను భరించలేక తిరిగి స్వదేశానికి తిరిగి వచ్చినప్పటికీ, వారి సమస్యలు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. విదేశాలలో గృహసేవలు లేదా సంరక్షణ పనులు చేసినందుకు అపహాస్యం, సామాజిక వేరుచేయడం ఎదురవుతుంది. లైంగిక హింస లేదా అక్రమ రవాణా బాధితులను తప్పు చేసినవారిగా చిత్రీకరించడం సాధారణం. ఎథియోపియా, బంగ్లాదేశ్‌లలో నిర్వహించిన అధ్యయనాలు చూపినట్లుగా, తిరిగి వచ్చిన గృహ కార్మికులు తీవ్రమైన సామాజిక ప్రతిఘటన ఎదుర్కొంటున్నారు. అతి కొన్ని దేశాలు మాత్రమే కౌన్సిలింగ్, నైపుణ్య శిక్షణ, చిన్న వ్యాపారమద్దతు అందిస్తున్నాయి. సరైనఆర్థిక, మానసిక మద్దతు లభించినప్పుడు తిరిగి వచ్చిన మహిళలు ఉన్నతంగా ఎదుగుతారని, మెరుగైన ఫలితాలను సాధిస్తారని పరిశోధనలు సూచిస్తున్నాయి. మహిళల వలసను సురక్షితంగా చేయాలంటే, నైతిక నియామక విధానాలు, సమాన వేతనాలు, చట్టబద్ధ రక్షణలు, ముందస్తు హక్కుల అవగాహన, సమాజ ఆధారిత మద్దతు సేవలు అవసరం. వలస ఒక అవకాశంగా మారాలంటే, అది హింసా చక్రంగా మారకుండా వ్యవస్థాత్మక మార్పులు కావాలి.



# కేంద్రమంత్రి బండి సంజయ్ రాజీనామా చేయాలి

## బాలికపై అత్యాచారానికి పాల్పడిన భగీరథను కఠినంగా శిక్షించాలి

### మహిళా సమాఖ్య డిమాండ్

**ప్రజాపక్షం/చింతలపాలెం :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన కుమారుడిపై నమోదైన ఫోక్సో కేసుకు బాధ్యత వహిస్తూ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన డిమాండ్ చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు ఒక మైనర్ బాలికపై లైంగిక దాడి చేసినట్లు పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బాధిత కుటుంబం ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదని.. లైంగిక దాడి చేసిన ఈ ఆరోపణలపై పారదర్శకంగా.. నిష్పక్షపాతంగా విచారణ జరిపి.. ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని సృజన డిమాండ్ చేశారు. సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఉప్పతల కోటమ్మ, మండల కార్యదర్శి బోరెడ్డి హైమావతి, అధ్యక్షురాలు భీమిశెట్టి పద్మ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

**భద్రాద్రి కొత్తగూడెం :** మైనర్ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) డిమాండ్ చేసింది. మంగళవారం కొత్తగూడెంలోని సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో ఈ మేరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి మాట్లాడుతూ నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడైనంత మాత్రాన చట్టం చుట్టం కాకూడదని, కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తే తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు రత్నకుమారి, షేక్ షాహిన్, కైసార్, పోలుమోరి ధనలక్ష్మి , ఉనిగడప పద్మ, గోనె మని, మంద నిర్మల, గాయిత్రి, శాంతి, బుజ్జమ్మ, సునీత, లత, మద్దెనేని నాగమణి, దార్ల లక్ష్మి, సరోజ, రమ తదితరులు పాల్గొన్నారు.



**సత్తుపల్లి :** కేంద్ర మంత్రి బండి సంజయ్ కొడుకుని పోలీసులకు అప్పజెప్పాలని, పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకొని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోటు కళావతి, ఏపూరి లతదేవి డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం నాయకులు మహాదేవ లక్ష్మి, సీత అధ్యక్షతన సత్తుపల్లి పట్టణంలో జరిగిన సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ బాధితులు ఫిర్యాదుతో ఫోక్సో కేసు నమోదు చేసిన ఇంతవరకు సాయి భగీరథను అరెస్టు చేయలేదన్నారు. కొడుకుపై ఫోక్సో కేసుకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ సత్తుపల్లి పట్టణ కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, మండల కార్యదర్శి తడికమల యోబు, మహిళా సమాఖ్య నా యకులు షేక్ రహిమున్నీస్సా , వెంకటలక్ష్మి , కృష్ణవేణి, చిట్టెమ్మ, నాగలక్ష్మి , సుజాత, నాగమ్మ, జారినా, శ్రీలక్ష్మి , రాజ్యలక్ష్మి , రవళి, తదితరులు పాల్గొన్నారు.




**నాగర్‌కర్నూల్ :** బండి సంజయ్ నైతిక బాధ్యత వహించి తన మంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేయాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు డిమాండు చేశారు. మంగళవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని లక్ష్మాచారి భవనంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు దేశమని అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బండి సంజయ్ నైతిక బాధ్యత వహించి తన మంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండు చేశారు. సమావేశంలో యన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా సెక్రెటరీ ఇందిరమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి అనుష, జ్యోతి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్, సిపిఐ జిల్లా నాయకులు కొత్త రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



**వనపర్తి టౌన్ :** బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ మైనర్ బాలికపై లైంగిక దాడికి నిరసనగా వనపర్తి పట్టణం అంబేద్కర్ చౌక్‌లో ఎఫ్ఐడబ్ల్యూ, సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు కళావతమ్మ మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కొడుకుని పోలీసులకు అప్పజెప్పాలని, పోలీసుల పూర్తిస్థాయిలో విచారణ జరిపి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ జయమ్మ, కో కన్వీనర్ శిరీష, జ్యోతి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి రమేష్, పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్, లక్ష్మి నారాయణ, శేఖర్, వంశీ, స్వామి, రాంబాబు, నాగమణి, కృష్ణ పాల్గొన్నారు.







# మహిళల హక్కులు హరిస్తున్న బిజెపి నాయకులు

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఫయాజ్



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** మైనర్ బాలిక అత్యాచార కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథను తక్షణమే అరెస్టు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ డిమాండ్ చేశారు. పెద్దకొత్తపల్లి మండలంలోని తీర్నాంపల్లి గ్రామంలో మంగళవారం సిపిఐ జెండాను ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని, సిపిఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫయాజ్ మాట్లాడుతూ భేటి బచావో బేటి పడావో ఆకర్షియమైన నినాదాలు ఇచ్చే బిజెపి పాలనలో దేశవ్యాప్తంగా మహిళల హక్కులను బిజెపి నాయకులు హరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మంత్రిని భర్తరఫ్ చేసి బండి సంజయ్ ఆయన కుమారుడిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. కేసు నమోదు అయి 5 రోజులు అయిన ఇప్పటికీ కేంద్రమంత్రి కుమారుడిని అరెస్టు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కేసు నీరుగార్చే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. వెంటనే కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిని అరెస్టు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి జి.వెంకటస్వామి, జి.రామకృష్ణ, ఎం.డి. యూసుఫ్, చాపల శేఖర్, సంఘం కృష్ణ, గోపాల్, శివ, రవి, నిరంజన్, బాలయ్య, చందు, మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐక్య పోరాటంతో డిమాండ్ల సాధన

### ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఈదురు వెంకన్న




**ప్రజాపక్షం/నల్లగొండ :** 2019 నుంచి ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించామని, ఆర్టీసీ కార్మికుల ఐక్య పోరాటంతో 32 డిమాండ్లు సాధించాం అని టిజిఎస్ ఆర్టీసీ ఎంప్లాయస్ యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఈదురు వెంకన్న తెలిపారు. టీజీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నల్లగొండ రీజియన్ విస్తృత కౌన్సిల్ సమావేశం రీజియన్ అధ్యక్షుడు జమాల్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఈదురు వెంకన్న సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 2019 నుంచి ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించామని తెలిపారు.అనంతరం ఆర్టీసీలో కలిసి వచ్చే ఆరు సంఘాలతో జేఏసీ ఏర్పాటు చేసి ఉద్యమ కార్యాచరణతో సమ్మె చేపట్టితే ప్రభుత్వం, యాజమాన్యం స్పందించి చర్చలకు పిలిచి 32 డిమాండ్లను అంగీకరించాయన్నారు. ఆర్టీసీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా విలీనం చేయడం, 2021 వేతన సవరణను 11 గా అమలు చేయడం, ఆర్టీసీలో యూనియన్ కార్యకలాపాలు కొనసాగించుకోవడానికి అనుమతి ఇవ్వడం వంటి అంశాలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందన్నారు. సమ్మెకు మద్దతు తెలిపిన కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు,ప్రజా సంఘాలకు, భారత కమ్యూనిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాబు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి, ఎంప్లాయిస్ యూనియన్ రీజియన్ గౌరవాధ్యక్షుడు మాట్లాడుతూ జేఏసీ ఆధ్వర్యంలో చారిత్రక ఉద్యమం నిర్వహించి 32 డిమాండ్లు సాధించుకున్నామన్నారు. ఇప్పుడు ఆర్టీసీ కార్మిక వర్గం మొత్తం ఎంప్లాయిస్ యూనియన్ను బలోపేతం చేసి, అన్ని డిపోల్లో కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.గోపాల్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు, రాష్ట్ర కార్యదర్శులు కేవీఎస్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి మనోహర్, సహాయ కార్యదర్శులు బాసాని వెంకటయ్య, పాండురంగయ్య, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నందం, నల్లగొండ రీజియన్ కార్యదర్శి ఎన్ఆర్‌సి రాజు, ఏడు డిపోల అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, వివిఎస్‌రెడ్డి, వెంకటయ్య, కోటయ్య, రాజశేఖర్, శోకం వెంకటయ్య, జ్యోతి, శారద, లూర్ధుమ్మ, శంకరమ్మ పాల్గొన్నారు.

# బండి సంజయ్ అధికారాన్ని అడ్డం పెట్టుకుని కేసును నీరుగార్చే కుట్ర

### సిపిఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

**ప్రజాపక్షం/కరీంనగర్ :** తన తనయుడు బండి భగీరథపై నమోదైన పోక్సో కేసును నీరుగార్చేందుకు కేంద్ర మంత్రి హోదాలో బండి సంజయ్ కుట్ర పన్నుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, తక్షణమే బండి సంజయ్‌ని మంత్రి పదవి నుండి భర్తరఫ్ చేయాలని సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నాలుగు రోజుల క్రితం బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై పోక్సో కేసు నమోదైతే ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం దారుణమని, కేసు నమోదు ఆయన తర్వాత అమ్మాయి వివరాలను, ఫోటోలను బండి భగీరథ ఎలా బహిర్గతం చేస్తాడని, అందుకు ఆయన తండ్రి సంజయ్ ఎలా సహకరిస్తాడని శ్రీనివాస్ ప్రశ్నించారు. తండ్రీ, తనయులపై రాష్ట్రంలో ప్రజలు, మహిళలు ఆందోళనలు చేస్తున్నారని, కళ్ళుండి చూడలేని కబోధిలాగ బిజెపి వ్యవహరిస్తుందని, ఈ సంఘటన పార్టీకి సంబంధించిన అంశం కాదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పేర్కొనడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. బిజెపికి సంబం ధం లేదంటూనే బిజెపి పార్టీకి చెందిన వారు అమ్మాయి ఫోటోలను మార్ఫింగ్ చేస్తూ ఆమెను కించపరిచే విధంగా, ఆమె క్యారెక్టర్‌ను అవహేళన చేసే విధమైన పోస్ట్‌లు సోషల్ మీడియాలో పెడుతూ దుష్ప్రచారం చేస్తున్నారని, కనీసం అమ్మా యి అని చూడకుండా ఓ మాజీ ఎమ్మెల్యే పేరుతో ఉన్న అకౌంట్‌లో ఇలా పోస్టులు పెట్టడం దుర్మార్గపు చర్య అని, బిజెపి నాయకుల పేర్లతో ఉన్న గ్రూపుల్లో కూడా వారి ఫాలోవర్స్ పోస్టులు పెడుతున్నారని, సోషల్ మీడియాలో ఎవరెవరైతే దుష్ప్రచారం చేస్తున్నారో వారి ఫేస్ బుక్, ఇన్స్టా గ్రామ్, ట్విట్టర్ అకౌంట్లను పరిశీలించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ పోలీసులను డిమాండ్ చేశారు.

## అట్రాసిటి కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలుశిక్ష

**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ నల్లగొండ ఎస్‌సి,ఎస్‌టి ప్రత్యేక సెషన్స్ కోర్టు మంగళవారం తీర్పు వెలువరించిందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు.డిండి పోలీస్ స్టేషన్ పరిధిలో 2013లో నమోదైన కేసులో చందంపేట మండలం గన్నెర్లపల్లికి చెందిన నక్క పర్వతాలు యాదవ్,డిండి మండలానికి చెందిన నీలం సత్తమ్మలకు కోర్టు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష,రూ.1,000 జరిమానా విధించింది.జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించింది.చందంపేట మండలానికి చెందిన నక్క పర్వతాలు యాదవ్ ఓ ఎస్‌సి యువతితో పరిచయం పెంచుకొని పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకున్నాడు.అనంతరం పెళ్లి చేసుకోమని అడిగిన యువతిని కులాన్ని దూషిస్తూ తిరస్కరించారని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.కోర్టు ఆదేశాల మేరకు అన్ని శిక్షలు ఏకకాలంలో అమలులో ఉంటాయని ఎస్‌పి తెలిపారు. ఈ కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా డి.నరసింహ వాదనలు వినిపించారు.కేసు నమోదు సమయంలో డిండి ఎస్‌ఐగా పనిచేసిన ఎం. రామాంజనేయులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయగా,దేవరకొండ ఎస్‌డిపిఓ కె. మనోహర్ దర్యాప్తు నిర్వహించారు.

## 13న పాలిసెట్-2026 పరీక్ష.. అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఈనెల 13న నిర్వహించనున్న పాలిసెట్ 2026 పరీక్షకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశించారు.మంగళవారం తన చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన,జిల్లాలో మొత్తం 15 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.నల్లగొండ పట్టణంలో 13,నాగార్జునసాగర్‌లో 2 కేంద్రాలు ఉన్నాయని,5810 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరుగుతుందని చెప్పారు.పరీక్ష సజావుగా జరిగేందుకు పోలీస్ బందోబస్తు, పేపర్ ఎస్కార్ట్, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రథమ చికిత్స సౌకర్యాలు కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిధిలో బీఎన్‌ఎస్ 163వ సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.ఆర్టీసీ అధికారులు అవసరమైన బస్సులను నడపాలని సూచించారు.సమావేశంలో పాలిసెట్2026 జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ నరసింహారావు, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురుమిద్ద శ్రీనివాస్



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఇండియన్ పీపుల్స్ అసోసియేషన్ అనుబంధమైన తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభలు మే 25, 26 తేదీలలో హైదరాబాద్‌లో జరుగు సభలను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురుమిద్ద శ్రీనివాస్ కళాకారులకు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ప్రజల నుండి పుట్టిన కలను తిరిగి ప్రజల ప్రయోజనం కోసమే ప్రదర్శించాలని బలమైన సంకల్పంతో ప్రజానాట్యమండలి స్థాపించబడిందన్నారు. వివిధ కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేస్తూ ఈ సంస్థ అవిశ్రాంతంగా పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో అలాంటి కళాకారులకు అనేక సంవత్సరాలుగా గుర్తింపు కార్డు లేకుండా సరైన పారితోషికం లేకుండా సామాజిక భద్రత హామీలు లేకుండా దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం వారిని గుర్తించి గుర్తింపు కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల కష్టాలు, సుఖాలు పాటల రూపంలో బయటకు తీసుకు వచ్చి ఎంతోమందిని మెప్పించి అత్యంత బలమైన ఆయుధం పాట అని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, జంపాల మల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఎడెల్లి శ్రీకాంత్, గోపాలపోయిన వెంకటేశ్వర్లు, నెమ్మాది తారక రామారావు, గురుస్వామి, గుగులోత్ సరిత, లక్ష్మి, దొంతగాని సత్యనారాయణ పాల్గొన్నారు.

## కేంద్ర గ్రామీణ అభివృద్ధి డిప్యూటీ సెక్రటరీ సందర్శన



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** కేంద్ర గ్రామీణ అభివృద్ధి డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ మోనా యాసిన్ మంగళవారం హన్మాపురం తాజ్పూర్ గ్రామాలను సందర్శించడం జరిగింది. హనుమాపూర్ గ్రామంలోని నీటి నిల్వ, కందకం పనులను, నర్సరీ, గ్రామ పంచాయతీ నందు రికార్డులను పరిశీలించారు. తాజ్పూర్ గ్రామంలో మురికి కాల్వ చివర ఇంకుడు గుంత పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి టి. నాగిరెడ్డి, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి సురేష్, ఎంపీడీవో దినకర్, పంచాయతీరాజ్ ఏఈ శ్యాంసుందర్, ఈసీ రాజశేఖర్, గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్, ఏపీవో బాలస్వామి, హనుమాపురం సర్పంచ్ నాగపురి సువర్ణ కృష్ణ పాల్గొన్నారు.

## సెల్‌టవర్ నిర్మాణాన్ని ఆపాలని కోరుతూ నిరసన

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండల కేంద్రంలో ఇండ్ల మధ్యన జియో సంస్థ నూతనంగా నిర్మిస్తున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని ఆపాలని కోరుతూ ఆ ప్రాంత వాసులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సెల్‌టవర్ వల్ల వచ్చే రేడియేషన్‌తో తమ ఆరోగ్యాలు దెబ్బతింటాయని తక్షణమే దీనిని ఆపాలని జిల్లా కలెక్టర్, ఎంపిడిఓ, గ్రామ సర్పంచ్‌లను కోరారు. దీని నిర్మాణాన్ని ఆపకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కోటగిరి విజయలక్ష్మి, సైదులు, సన్నాయిల సాయి, జాన్‌బీ, షేక్ సైదులు, హుస్సేన్, సతీష్‌లు పాల్గొన్నారు.

# నత్తనడకన సాగుతున్న ధాన్యం కొనుగోలు

కేంద్రాల్లో పేరుకుపోయిన రాశులు

కేంద్రాలకు వచ్చిన ధాన్యంలో.. కొనుగోలు చేసింది సగమే..

కాంటా వేసినా..మిల్లర్ల కొర్రీలు.. అధికారుల నిర్లక్ష్యం..అడుగడుగునా రైతుల దోపిడీ

తూతూ మంత్రంగా ప్రతిరోజూ అధికారుల సమీక్ష సమావేశాలు





**ప్రజాపక్షం/నల్లగొండ:** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ తీవ్ర గందరగోళంగా మారింది.ప్రభుత్వం భారీగా కొనుగోళ్లు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో రైతులు మాత్రం నత్తనడకన ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతూ ఉండడంతో రైతన్నలు నానా అవస్థలు పడుతున్నారు.కొనుగోలు కేంద్రాల వద్ద రోజులు గడుస్తున్నా ధాన్యం రాశులు అలాగే పేరుకుపోతుండగా,మిల్లర్ల కొర్రీలు,లారీల కొరత,అధికారుల నిర్లక్ష్యం రైతన్నలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో ఇప్పటివరకు 6,76,249 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరగా,అందులో కేవలం 4,15,908 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. ఇంకా 2,60,341 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పెండింగ్‌లో ఉండటం పరిస్థితి తీవ్రతకు నిదర్శనంగా మారింది. అంటే కొనుగోలుకు వచ్చిన ధాన్యంలో పెద్ద భాగం ఇంకా కేంద్రాల వద్దే ఉండిపోయింది.జిల్లాలో 459 కొనుగోలు కేంద్రాలు ప్రతిపాదించగా,ప్రస్తుతం 430 కేంద్రాలు మాత్రమే పనిచేస్తున్నాయి.కేంద్రాల వద్ద సరిపడా సిబ్బంది లేకపోవడం, తార్పాలిన్లు, లారీల కొరత,హమాలీల సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ధాన్యం కాంటా వేసిన తర్వాత కూడా రోజుల తరబడి మిల్లులకు తరలించకపోవడంతో కేంద్రాల వద్ద గుట్టలుగా ధాన్యం పేరుకుపోతోంది. మరోవైపు మిల్లర్లు తాలు నాణ్యత పేరుతో రైతులను వేధిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.కొనుగోలు కేంద్రాలలో తాలు,తేమ పేరుతో తరుగు కలిపి 40 కిలోల బస్తాకు అదనంగా 4నుండి 6కిలోలు తూకం వేస్తు కోతలు విధిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో మధ్యవర్తుల జోక్యం పెరగడంతో రైతులకు మరింత నష్టం జరుగుతోందని చెబుతున్నారు.ఇప్పటికే జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం విలువ రూ.953 కోట్లకు పైగా ఉన్నప్పటికీ, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడంలో ఆలస్యం జరుగుతోందని సమాచారం. ధాన్యం అమ్మిన తర్వాత కూడా చెల్లింపుల కోసం రైతులు రోజులు తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు ప్రతిరోజూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని ప్రకటిస్తున్నా,క్షేత్రస్థాయిలో మాత్రం ఎలాంటి ఫలితం కనిపించడం లేదని రైతు లు విమర్శిస్తున్నారు. సీఎంఆర్ నమోదు ప్రక్రియ కూడా నత్తనడకన సాగుతుండడంతో మిల్లులు ధాన్యం ఎత్తుకెళ్లడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. వర్షాకాలం దగ్గరపడుతున్న వేళ కేంద్రాల్లో ధాన్యం నిల్వ ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క వర్షం కురిసినా ధాన్యం తడిసి భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని పెండింగ్ కొనుగోళ్లు పూర్తి చేసి, కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



## జూన్ 2లోగా లబ్ధిదారులకు 'డబుల్' ఇళ్లు పంపిణీ

యాదాద్రి జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** మండలంలోని జిబ్లక్ పల్లి, పోచంపల్లి మున్సిపాలిటీలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తి చేసి జూన్ 2 లోగా లబ్ధిదారులకు పంపిణీ చేసేలా అన్ని చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ భాస్కరరావు ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించి పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని కనీస సౌకర్యాలు డ్రైనేజీ విద్యుత్తు మంచినీటి వసతులను తక్షణమే ఏర్పాటు చేసి సిద్ధం చేయాలని అధికారులు సూచించారు. చైర్మన్ మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, కమిషనర్ అంజన్ రెడ్డి, ఎండిఓ భాస్కర్, డిప్యూటీ తాసిల్దారు నాగేశ్వరరావు ఉన్నారు.

### డబుల్ ఇండ్ల పరిశీలన

**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని కొండమడుగు గ్రామంలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావు సందర్శించి ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్ధాంతరంగా మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తి చేసి త్రాగునీరు, రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. మరమ్మతులు చేపట్టిన అనంతరం లబ్ధిదారులకు పంపిణీ చేయునట్లు ఆయన తెలిపారు.

# మిల్లర్లు ధాన్యాన్ని కొనాల్సిందే

ప్రైవేట్ ధాన్యం దించుకునేందుకు ప్రాధాన్యత ఇస్తే కఠిన చర్యలు

కలెక్టర్ బి.చంద్రశేఖర్ హెచ్చరిక

4.10లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జిల్లాలోని రైస్ మిల్లర్లు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని దించుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని, అలా కాదని ప్రైవేట్ ధాన్యం దించుకునేందుకు ప్రాధాన్యత ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ హెచ్చరించారు. రబీ ధాన్యం సేకరణలో భాగంగా మిల్లుల వద్ద లారీల అన్‌లోడింగ్ జాప్యం జరుగుతుందని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో మంగళవారం ఆయన జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్‌తో కలిసి మిర్యాలగూడలోని వాగ్దేవి, మహేశ్వరి రైస్ మిల్లులను ఆయన తనిఖీ చేసి మిల్లుకు వచ్చిన ప్రభుత్వ, ప్రైవేట్ ధాన్యాన్ని పరిశీలించి మిల్లు యజమానితో మాట్లాడుతూ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం పూర్తిగా కొనుగోలు చేసిన తరువాతన ప్రైవేట్ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ధాన్యం లోడ్ లారీల డ్రైవర్లతో ఆయన మాట్లాడారు. మిల్లుకు వచ్చిన లారీలు 12గంటలలోపు అన్‌లోడ్ చేసుకోని తిరిగి కొనుగోలు కేంద్రాలకు పంపించాన్నారు. అవసరమైతే హమాలీలను ఎక్కువ మందిని ఏర్పాటు చేసుకోని అన్‌లోడ్‌ను పెంచాలన్నారు. రానున్న పది రోజుల్లో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, ప్రత్యేకించి ప్రభుత్వ కేంద్రాల ధానయ కొనుగోలును వేగవంతం చేసేందుకు ఇతర ప్రాంతాల నుంచి ధాన్యం రాకుండా డిండి, అవంతీపురం తదితర ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మిల్లుల వద్ద ఒక పోలీస్ కానిస్టేబుల్‌తోపాటు జీపీవో ఇతర అధికారులు నిరంతరం ధాన్యం అన్‌లోడ్ పర్యవేక్షించాలని, అందుకు రైస్ మిల్లర్లు అందరు ఇదే విధానాన్ని పాటించాలన్నారు. అనంతరం మహేశ్వరి రైస్ మిల్లును తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కాగా రైస్ మిల్లు గుమస్తా మాడ్గులపల్లి మండలానికి చెందిన ఒక రైతు నుంచి డబ్బులు తీసుకున్నాడని వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని మాడ్గులపల్లి తహసీల్దార్‌ను ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లాలో 4.10లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఇంకా 2.60లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనాల్సి ఉందన్నారు. జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ మాట్లాడుతూ మిల్లర్లు మిల్ పాయింట్‌కు వచ్చిన వాహనాలను 12గంటల్లోపు అన్‌లోడ్ చేసుకోవాలని, అన్‌లోడ్ చేసుకోవడంలో ఇబ్బందులు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని, పోలీసు తరుపు మిల్లులో ఒక కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వ ధాన్యాన్ని దించుకునేందుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వారి వెంట ఆర్డీవో రమణారెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాంపతినాయక్, డీఎస్‌వో వెంకటేశం, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం చెలగాటం

భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** మే 3వ తేదీన నిర్వహించిన నీట్ పరీక్ష రద్దు నిర్ణయంపై భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తున్న బీజేపీ సర్కార్ తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ప్రకటన విడుదల చేస్తూ, కేంద్ర విద్యాశాఖ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వైఫల్యాల వల్లే నేడు దేశవ్యాప్తంగా అశాంతి నెలకొందని విమర్శించారు. నీట్ పరీక్ష రద్దు కావడం అనేది కేవలం సాంకేతిక లోపం కాదు, అది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని ఎంపీ దుయ్యబట్టారు. 'అధికారంలో ఉన్న బీజేపీకి పాలనపై కనీస చిత్తశుద్ధి లేదు. వ్యవస్థలను సమర్థవంతంగా నడపడంలో విఫలమై, ఇప్పుడు విద్యార్థుల అకడమిక్ ఇయర్ను బలిపీఠం ఎక్కిస్తోంది' అని ఆయన మండిపడ్డారు. దేశంలో ప్రతీ చిన్న విషయంపై సోషల్ మీడియాలో చర్చలు జరిపే బీజేపీ నేతలు, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే ఇలాంటి కీలక అంశంపై ఎందుకు మౌనం వహిస్తున్నారని నిలదీశారు. బీజేపీ ప్రభుత్వం వెంటనే ఈ అంశంపై చర్చ చేపట్టాలని, విద్యార్థుల నష్టానికి సమాధానం చెప్పాలని కిరణ్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కాకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యామ్నాయ ప్రణాళికను ప్రకటించాలని కోరారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అకాల వర్షాల ముప్పును దృష్టిలో ఉంచుకుని యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఈ సీజన్‌లో 3.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అంచనా వేయగా, సోమవారం వరకు 2లక్షల మెట్రిక్ టన్నులను విజయవంతంగా సేకరించామని తెలిపారు. నిరంతర పర్యవేక్షణ, అధికారులతో ప్రతిరోజు సమీక్షలు నిర్వహించడం వల్లనే ఇంత పెద్ద మొత్తంలో సేకరణ సాధ్యమైందని పేర్కొన్నారు. మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియ నెమ్మదించడంపై అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా హమాలీల కొరత వల్ల అన్‌లోడింగ్ ఆలస్యమవుతుందని దీని వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. మిల్లుల వద్ద హమాలీల సంఖ్యను రెండింతలు పెంచి, మూడు షిఫ్టుల్లో పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం దిగుమతి చేసుకోవడంలో నిర్లక్ష్యం వహించే మిల్లర్లపై చట్టపరమైన చర్యలతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే ప్రైవేటు లేదా అదనపు గోదాములను అద్దెకు తీసుకొని ధాన్యాన్ని నిల్వ చేయాలని సూచించారు. ధాన్యం తరలింపు కోసం ప్రస్తుతం ఉన్న 670 లారీలు సరిపోవడం లేదని, అదనపు లారీలు, డిసిఎంలను ఏర్పాటు చేసేందుకు పోలీస్, రవాణాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కొనుగోలు కేంద్రం నుండి మిల్లుకు 5 కిలోమీటర్ల లోపు దూరం ఉంటే, లారీల కోసం వేచి చూడకుండా ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలించాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద గన్నీబ్యాగులు, హమాలీలు అందుబాటులో ఉండేలా తహశీల్దార్లు, మండల అధికారులు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌పి కె. నరసింహ, అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జిల్లా పరిషత్ సిఇఓ శిరీష, పిడిడి ఆర్‌డిఓ సన్యాసయ్య, డిఎస్‌ఓ మోహన్‌బాబు, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిసిఓ ప్రవీణ్ కుమార్, డిఎంఓ నాగేశ్వర్ శర్మ, డిఎం సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ హనుమంత్ రెడ్డి, ఆర్‌డిఓ జయప్రకాశ్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అక్రమ రవాణా జరగకుండా పటిష్ట నిఘా

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ్మ



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** పశువుల అక్రమ రవాణా, ఇసుక, వరి ధాన్యం, పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా పోలీసు శాఖ పటిష్ట నిఘా ఉంచిందని జిల్లా ఎస్‌పి కె. నరసింహ తెలిపారు. మంగళవారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి జాతీయ రహదారి 65పై వద్ద అంతర్ జిల్లా చెక్‌పోస్ట్‌ను ఆయన సందర్శించారు. చెక్‌పోస్టు రికార్డులను పరిశీలించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సాధారణ ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు. తనిఖీల సమయంలో చెక్‌పోస్టు సిబ్బంది స్వీయ రక్షణ జాగ్రత్తలు పాటించాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అక్రమ రవాణా నిర్మూల లక్ష్యంగా జిల్లావ్యాప్తంగా ముఖ్యమైన ప్రాంతాలలో అంతరాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఈ చెక్‌పోస్ట్‌ల ద్వారా అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు, అనుమానిత వ్యక్తుల కదలికలపై పూర్తి స్థాయి నిఘా ఉంచినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు వ్యవసాయ అవసరాల నిమిత్తం సంతలో కొనుగోలు చేసిన పశువులను రవాణా చేస్తే సంత అధికారులు, పశువుల వైద్యుల అనుమతి పత్రాలు వెంట తీసుకెళ్ళాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ రాజశేఖర్, ఎస్‌ఐ బాలు నాయక్, చెక్‌పోస్ట్ విధుల నిర్వహణ సిబ్బంది, జాతీయ రహదారుల సిబ్బంది పాల్గొన్నారు.


## నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలో మే 13 నుంచి 19 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి దశ్రు నాయక్ తెలిపారు.జిల్లా వ్యాప్తంగా 29 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు.ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు సెకండియర్ పరీక్షలు జరుగుతాయి.ఫస్టియర్‌కు 6046, సెకండియర్‌కు 4032 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.ప్రతి కేంద్రంలో తాగునీటి సౌకర్యం, ఏఎన్‌ఎంలు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.విద్యార్థులు సకాలంలో చేరుకునేలా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు,విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులకు సూచించారు. ప్రతి కేందం్ర వద్ద బీఎన్‌ఎస్ 163 సెక్షన్ అమల్లో ఉంటుందని,జిరాక్స్ కేంద్రాలను మూసి ఉంచాలని తెలిపారు.పరీక్షల నిర్వహణ కోసం కన్వీనర్‌గా డీఐఈఓ దశ్రు నాయక్,డీఈసీ సభ్యులుగా ఎం.శ్రీదేవి,ఎం.షెబాలతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

రూ. 10 లక్షల విలువైన వస్తువులు స్వాధీనం

నల్లగొండ జిల్లా డిఎస్‌పి శివరాంరెడ్డి వెల్లడి



**ప్రజాపక్షం/చిట్యాల:** వివిధ ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడిన ఇరువురు అంతర్ జిల్లా నిందుతులను నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలో స్థానిక పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై నల్లగొండ జిల్లా డిఎస్‌పి శివరాంరెడ్డి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘటనా వివరాలను తెలియజేశారు. పాత నేరస్థులైన మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కండ్లకోయ గ్రామానికి చెందిన నీలపు నీలయ్య (26), సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌కు చెందిన బత్తిని నరేష్ అలియాస్ లల్లీ నరేష్(29)లకు చెంచల్‌గూడ జైల్‌లో శిక్షను అనుభవిస్తున్న సమయంలో స్నేహం ఏర్పడింది. వారు బయటికి వచ్చిన తరువాత ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. హైదరాబాద్, మేడ్చల్, దుండిగల్, అమీన్‌పూర్, సంగారెడ్డితో పాటు చిట్యాలలో వారు వరుస దొంగతనాలకు పాల్పడుతూ 6 ద్విచక్ర వాహనాలు, ఆలయంలో చోరీచేసిన దుర్గాదేవి, సింహం పంచలోహ విగ్రహాలు, సుమారు 5 గ్రాముల బంగారం, అన్‌డ్రాయిడ్ టెలివిజన్, లాప్‌టాప్‌ను తస్కరించారు. వీటి విలువ సుమారు రూ. 10 లక్షల వరకు ఉంటుందని ఆయన వివరించారు. మంగళవారం ఉదయం స్థానిక రైల్వే స్టేషన్ క్రాసింగ్ దగ్గర సాధారణ తనిఖీలలో భాగంగా అనుమానస్పదంగా కనిపించిన వీరిరువురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. దొంగిలించిన వస్తువులను పటాన్ చెరువులో వీరు అద్దెకు తీసుకున్న గదిలో దాచిపెట్టారని, వాటినన్నింటిని స్వాధీనం చేసుకున్నట్లు శివరాంరెడ్డి తెలిపారు. కేసును చేధించిన స్థానిక సిఐ నాగరాజు, ఎస్‌ఐ రవికుమార్, పోలీస్ సిబ్బందిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

## ఉపాధి హామీ సమస్యలపై.. 15న గ్రామాల్లో నిరసనలు

20న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాకు పిలుపు



**ప్రజాపక్షం /కాగజ్‌నగర్ :** కాగజ్‌నగర్ మండలంలోని బురదగూడ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ నిర్ణయం మేరకు ఈ నెల 15వ తేదీన ఉపాధి హామీ మరియు వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అన్ని గ్రామాలలో గ్రామపంచాయతీ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.అలాగే ఈ నెల 20న కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే భారీ ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.ఉపాధి హామీ కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, కూలీలకు న్యాయమైన వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు.బురదగూడ గ్రామంలో నూతన గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు.బొర్కుట్ రాజేందర్, పోశెట్టి, ఫీల్డ్ అసిస్టెంట్,ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## పశువుల అక్రమ రవాణా.. నిరోధానికి పకడ్బందీ చర్యలు

సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్, సిపి



**ప్రజాపక్షం/నిజామాబాద్:** పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు గట్టి నిఘా కొనసాగించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి, సీపీ సాయిచైతన్య అధికారులను ఆదేశించారు. బక్రీద్ వేడుకను పురస్కరించుకుని కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జంతు సంక్షేమం గోవధ నిషేధంపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి పశువుల అక్రమ రవాణా నిరోధం, జంతు సంక్షేమ నియమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్, సీపీ సమీక్షించారు. జంతు సంక్షేమం కోసం ఉద్దేశించిన చట్టాల ఉల్లంఘన జరగకుండా చూడాలన్నారు. శాంతియుత వాతావరణంలో బక్రీద వేడుక జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. అదనపు డీసీపీ శుభం ప్రకాష్, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయలక్ష్మి, ఏసీపీలు ప్రకాష్ యాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, దుర్గాప్రమీల, గంగాధరయ్య, పోలీసు, రెవెన్యూ, పశుసంవర్ధక, పంచాయతీ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీ విద్యార్థుల భవిష్యత్తుపై దాడి

**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్:** నీట్ 2026 పరీక్షా పత్రం లీకేజీ కావడం విద్యార్థుల భవిష్యత్తుపై జరుగుతున్న దాడి అని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా సమితి ఆవేదన వ్యక్తం చేసింది. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్ మాట్లాడారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది విద్యార్థుల నమ్మకాన్ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వమ్ము చేసిందని విమర్శించారు. రాజస్థాన్ లోని సికర్ ప్రాంతం నుంచి లీక్ అయిన ప్రశ్నలు అసలు ప్రశ్నాపత్రంతో సరిపోలడం విద్యా మాఫియా కుట్రకు నిదర్శనమని దుయ్యబట్టారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్టీఏను పూర్తిగా ప్రక్షాళన చేయాలని, కార్పొరేట్ కోచింగ్ మాఫియాను నియంత్రించాలని కోరారు.జిల్లా నాయకులు బాన్సడే సచిన్, యముల వెంకటేష్, ఇర్ఫన్ వేణు, రవి పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ పంటపై.. రైతులను ప్రోత్సహించాలి

**ప్రజాపక్షం/మెదక్ :** జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగును రైతులు మరింత సాగు చేసి విస్తరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్ లో ఆయిల్ ఫామ్ సాగు ప్రగతి పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయిల్ ఫామ్ సాగు రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో ఆయిల్ ఫామ్ సాగుకు ప్రత్యేక ప్రాదాన్యత ఇస్తోందన్నారు. తక్కువ వ్యయంతో అధిక లాభాలు అందించే పంటగా ఆయిల్ ఫామ్ రైతులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. రైతులకు నాణ్యమైన మొక్కలు, ఎరువులు, సాంకేతిక సూచనలు అందించేలా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అలాగే ఆయిల్ ఫామ్ పంటపై రైతుల్లో మరింత అవగాహన పెంచేందుకు ప్రత్యేక శిబిరాలు, క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహించాలని అధికారులకు తెలిపారు. సాగు ప్రారంభించిన రైతులకు సకాలంలో సబ్సిడీలు, సాంకేతిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటల వైపు దృష్టి సారిస్తే ఆర్థికంగా మరింత లాభపడతారని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్ వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యాన శాఖ సిబ్బంది,అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం తరలింపునకు లారీలు సిద్ధం

కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ

**ప్రజాపక్షం / నిర్మల్ కలెక్టరేట్ :** జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న వరి, మొక్కజొన్న ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించేందుకు అవసరమైన లారీలను సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం సోన్ మండలం గంజాల్ టోల్‌ప్లాజా వద్ద లారీల సేకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. టోల్‌ప్లాజా మీదుగా వెళ్తున్న ఖాళీ లారీలను గుర్తించి వాటిని ధాన్యం రవాణాకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లారీ డ్రైవర్లు, యజమానులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి ప్రస్తుత పరిస్థితిని వివరించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పెరగకుండా వెంటనే వాహనాలను అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. అనంతరం మామడ మండలం న్యూ సాంగ్వీ గ్రామ రహదారి వద్ద లారీల సేకరణ తీరును పరిశీలించిన కలెక్టర్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. లారీల సేకరణ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేందుకు షిఫ్టుల వారీగా సిబ్బందిని నియమించాలని తెలిపారు. సిబ్బందికి టెంట్లు, కుర్చీలు, త్రాగునీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వాహనాలను ఆపిన వెంటనే సంబంధిత అధికారుల సమన్వయంతో అవసరమున్న కొనుగోలు కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు పండించిన పంటను రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ధాన్యం రవాణాలో ఎలాంటి జాప్యాన్ని సహించబోమని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి , తహసిల్దార్లు సంతోష్, సరిత, శ్రీనివాస్ రెవెన్యూ, రవాణా, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 900క్వింటాళ్ల మక్క సేకరించాం

సిఎం కాన్ఫరెన్స్‌లో..
ఆసిఫాబాద్ కలెక్టర్



**ప్రజా పక్షం /ఆసిఫాబాద్ :** రైతు సంక్షేమాభివృద్ధి, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర మంత్రులు, ఉన్నత స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. మార్క్ ఫెడ్ ద్వారా జిల్లాలోని జైనూర్, కాగజ్ నగర్, కౌ టాల మండలాలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పటివరకు 900 కుంటల మొక్కజొన్నలు కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. యాసంగి మరి ధాన్యం కొనుగోలు కొరకు 40 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని,9 కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ప్రధానంగా దహెగాం,లగ్గాం, ఒడ్డుగూడ, గిరవెల్లి, చంద్రపెల్లి, సాండ్ గాం, దుబ్బగూడ,వీరవెల్లి,గుడ్లబోరి ,సిర్పూర్ టి, సీతానగర్, రవీంద్ర నగర్ కొనుగోలు కేంద్రాలకు ఎక్కువ వరి ధాన్యం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. హమాలీల సంఖ్య, తూకం యంత్రాలను అదనంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని, జిల్లాలో గోనె సంచుల కొరత లేదని, స్థానికంగా రైతుల వద్ద ఉంటే డబ్బులు చెల్లించి కొనుగోలు చేసుకోవాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల హమాలీల కొరకు ఆధారపడకుండా స్థానికంగా ఉన్న హమాలీలను వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి మండల వ్యవసాయ శాఖ అధికారి, మండల వ్యవసాయ విస్తరణ అధికారులను బాధ్యులుగా నియమించాలని, జిల్లాసాయి అధికారులు తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలను ప్రతిరోజు సందర్శించి కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించి ఉదయం, సాయంత్రం నివేదికలు అందించాలని తెలిపారు.ధాన్యం తరలించేందుకు వాహనాల కొరత లేదని, అవసరమైతే స్థానికంగా ఉన్న వాహనాలను వినియోగించుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలు రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## నేటి నుంచే ఇంటర్.. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** జిల్లాలో 202526 విద్యా సంవత్సరానికి సం బంధిచిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి జె.పరశురాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13వ తేదీ బుధవారం నుండి 19వ తేదీ వరకు ఈ పరీక్షలు కొనసాగుతాయని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 12 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతీ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పరీక్షల సమయానికి సంబంధించి, ప్రతీరోజు ఉదయం 9 గంటల నుండి మ ధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2 గంటలనుండి సాయంత్రం 5 గంటల వరకు రెండవ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహిచనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలకు జిల్లా నుండి మొదటి సంవత్సరం విద్యార్థులు 2078 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 589 మంది హాజరుకానున్నారు. పరీక్షల పర్యవేక్షణ కోసం ఒక ఫ్లయింగ్‌స్క్వాడ్, ఒక సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామని, తాను స్వయంగా నిరంతరం కేంద్రాలను తనిఖీ చేస్తూ పర్యవేక్షిస్తానని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం ఇంటర్నెట్ నుండి డౌన్లోడ్ చేసుకున్న హాల్ టికెట్లను అనుమతిస్తామని, వీటిపై ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని పరశురాం స్పష్టం చేశారు.పరీక్షా కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం, వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ శాఖాధికారులతో, విద్యార్థుల రాకపోకల కోసం అదనపు బస్సులు నడపాలని ఆర్టీసి అధికారులతో చర్చించినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాలని, ఏలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆయన కోరారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఇప్పటికే పోలీస్ రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు డిఐఇఓ తెలిపారు.


## ఉపాధి హామీ పనులు.. పర్యవేక్షించిన ప్రజాప్రతినిధులు

**ప్రజాపక్షం/వాంకిడి :** వాంకిడి మండలంలోని సారండీ గ్రామపంచాయతీ పరిధిలోని నార్లపూర్ గ్రామంలో కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం రోజున గ్రామ సర్పంచ్ మొహర్లే బాపూజీ, ఉపసర్పంచ్ దోడ్డజీ,గ్రామ కార్యదర్శి వెంకటేష్ ప్రత్యక్షంగా పరిశీలించారు.గ్రామంలో జరుగుతున్న మట్టి పనులు,రోడ్ల అభివృద్ధి,కాలువల నిర్మాణం తదితర పనుల పురోగతిని వారు సమీక్షించి కార్మికులతో మాట్లాడారు.పనులు నాణ్యతతో పాటు సమయానికి పూర్తి కావాలని అధికారులు,సిబ్బందికి సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాభివృద్ధికి దోహదపడే పనులు చేపట్టడం ఎంతో ముఖ్యమని సర్పంచ్ మొహర్లే బాపూజీ తెలిపారు.కార్మికులు పని సమయంలో తాగునీరు, నీడ వంటి సౌకర్యాలను వినియోగించుకోవాలని,ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.గ్రామ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఉపాధి హామీ పనులను పారదర్శకంగా అమలు చేస్తూ గ్రామ ప్రజలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని అన్నారు.ఈ పరిశీలన కార్యక్రమంలో మెట్ బాపూజీ,సాగర్ వాడ్గురే, సుదాకర్ వడైతో పాటు గ్రామ పెద్దలు, కార్మికులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.ప్రజాప్రతినిధులు గ్రామంలో కొనసాగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు.



# నిరుద్యోగ యువతకు సర్కార్ భరోసా!

'రాజీవ్ యువ వికాసం'తో
స్వయం ఉపాధికి మార్గం సుగమం




**ప్రజాపక్షం / నిర్మల్ :** రాష్ట్రంలోని నిరుద్యోగ యువత చిరకాల స్వప్నమైన స్వయం ఉపాది కల నెరవేరే దిశగా అడుగులు పడుతున్నాయి. గత పన్నెండేళ్ళుగా ఉపాది పథకాలు ఆశించిన స్థాయిలో అమలు కాక, ఉపాది మార్గాలు మూసుకుపోయి నిరుద్యోగ యువత తీవ్ర నిస్సాహాయత స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. గత ప్రభుత్వాల హ యాంలో స్వయం ఉపాది పథకాలు దాదాపుగా అటకెక్కడంతో, చేతిలో నైపుణ్యం, ఉన్నా ఆర్థిక సోథమత లేక వేలాది మంది యువకులు నిరుద్యోగులుగా మిగిలిపోయారు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తెరపైకి తీసుకురావడంతో జిల్లాలోని వేలాది మంది నిరుద్యోగుల్లో మళ్ళీ కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం 600 కోట్ల రూపాయలను కేటాయించడమే కాకుండా, ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించడం యువతలో హర్షాన్ని నింపుతోంది. నిర్మల్ జిల్లాలోని , నిర్మల్, భైంసా , ఖానాపూర్, లోకేశ్వరం, కడం, సారంగాపూర్ వంటి వివిధ మండలాల నుండి సుమారు వేల సంఖ్యలో యువతీ యువకులు ఈ పథకం కింద రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. సుమారు ఎనిమిది నెలల క్రితమే ఈ పథకానికి సంబంధిచిన దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ నిదుల కొరత , సాంకేతిక కారణాల వల్ల ఈ ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా బడ్జెట్ కేటాయింపులతో ఈ పథకానికి పుర్జీవం లభించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పోరేషన్ల ద్వారా అందే ఈ రుణాలు ఇకపై నేరుగా లబ్దిదారులకు అందే అవకాశం ఉంది. ప్రభుత్వం తీసుకున్న ఈ ఆకస్మిక నిర్ణయం, ఏళ్ళ తరబడి నీక్షిస్తున్న నిరుద్యోగులకు కొండంత అండగా నిలిచింది. ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం, నిరుద్యోగులకు లక్ష రూపాయల నుండి నాలుగు లక్షల రూపాయల వరకు స్వయం ఉపాది యూనిట్లను మంజూరు చేయనున్నారు. వీటిలో ముందుగా ఒక లక్ష రూపాయల విలువైన చిన్న తరహా యూనిట్లకు ప్రాధాన్యత ఇచ్చి, ఆపై మిగిలిన దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించనున్నారు. మండలాల్లోని యువతకు కూడా ఈ రుణాలు అందేలా చూడాలని ప్ర భుత్వం భావిస్తోంది. నిరుద్యోగులు తమ కాళ్ళమీద తాము నిలబడేలా చేయడమే ఈ పథకం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని, ఎంపికైన అభ్యర్థులకు రుణాల మంజూరు పత్రాలను లేదా యూనిట్లను అంద.ఏయాలని ప్రభుత్వం యుద్ద ప్రాతిపదికన చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో, స్థానిక ఎమ్మెల్యేలు మరియు ఇన్‌చార్జి మంత్రుల పర్యవేక్షణలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరగనుంది. తమ జీవితాల్లో చీకట్లు తొలగి కొత్త వెలుగులు వస్తాయని జిల్లా నిరుద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ధాన్యం లారీలు సమకూర్చని కాంట్రాక్టర్‌పై కేసు

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు..
సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** వరిధాన్యం కొనుగోలు ప్రక్రియకు ఆటంకాలు కలిగేలా వ్యవహరిస్తున్న వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. ధాన్యం రవాణాకు లారీలు సమకూర్చని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం రైస్‌మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో ప్రభుత్వ సలహాదారు, కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల నుండి నిర్దేశిత రైస్‌మిల్లులకు సకాలంలో లారీలు సమకూర్చని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా కొనసాగేలా రైస్‌మిల్లర్లు కూడా పూర్తిస్థాయిలో సహకరించాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన గురుతర బాధ్యత మిల్లర్లపై ఉందన్నారు. సరిపడా హమాలీలను సమకూర్చుకుని మిల్లుల వద్ద వెంటనే ధాన్యం అన్‌లోడింగ్ జరిగేలా చొరవ చూపాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందార్, రాష్ట్ర యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డీఎస్ఓ శ్రీకాంత్‌రెడ్డి, సివిల్ సప్లయి డిఎం ప్రవీన్, డీసీఓ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి వీరస్వామి, డీ టీసీ దుర్గాప్రమీల, మార్కెటింగ్ శాఖ ఏడీ గంగుబాయి, మార్కెట్ కమిటీ కార్యదర్శి అర్చన, రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## వేగవంతంగా ధాన్యం సేకరణ

కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత వేగవంతంగా చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీఓలు, సివిల్ సప్లై, వ్యవసాయ, మార్కెటింగ్, ట్రాన్స్పోర్ట్, పోలీస్, గ్రామీణాభివృద్ధి, తహసిల్దార్లు, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులు, ఇతర శాఖల అధికారులతో గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా ధాన్యం సేకరణ ప్రక్రియ ఎలా కొనసాగుతుందో అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లులలో ఎంతమంది హమాలిలు ఉన్నారని, ఎన్ని లారీలు ఉన్నాయని తాసిల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత వేగంగా జరగాలని, అన్లోడింగ్ ప్రక్రియలో హమాలీల సంఖ్య పెంచుకోవాలని, లారీల సంఖ్యను పెంచాలని, లారీలు అందుబాటులో లేకుంటే డీసీఎంలు, ట్రాక్టర్లను కూడా అనుమతించాలని, అధికారులందరూ క్షేత్రస్థాయిలో ఉండాలని, అకాల వర్షలతో ధాన్యాన్ని కాపాడడానికి టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచుకోవాలనీ అధికారులను ఆధేశించారు. మిల్లర్లు అన్లోడింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి లారీలను అందుబాటులో ఉంచలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబాదాస్, రాజేశ్వర్, ఆర్డీఓ రమాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, సివిల్ సప్లై అధికారి నిత్యానంద, ట్రాన్స్ పోర్ట్ అధికారి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లాలో గోవుల తరలింపు కలకలం

**ప్రజాపక్షం / నిర్మల్ :** నిర్మల్ జిల్లాలోని ప్ర ముఖ పుణ్యక్షేత్రాలైన కదిలి, కాల్వ, గండి రా మన్న, అడెల్లి మరియు దేవరకోట ఆలయాల గోశాలల నుండి గోవుల తరలింపు వ్యవహారం ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. భక్తులు మొక్కల రూపంలో భక్తితో సమర్పించిన గోవులను, ఎద్దులను ఆలయ కమిటీల కు తెలియకుండా రహస్యంగా తరలిస్తుండటం పై భక్తులు మరియు హిందూ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో జిల్లాలోని ఆలయాలకు ఇన్‌చార్జి అధికారి తీరుపైవిమర్శలు వెల్లువెత్తున్నాయి.



### చైర్మన్లతో లేని సమన్వయం ఫలితంగా ఏకపక్ష నిర్ణయాలు

జిల్లాలోని ప్రధాన ఆలయాలకు ఇన్‌చార్జి ఈ.ఓ.గా ఒక్కరే కొనసాగుతుండటంతో, ఆల య పాడిందిపాట ఆడింది ఆట అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. తా జాగా ఈ.ఓ. తీరుపై తీవ్ర అసహానం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ చైర్మెన్లతో కనీస సమన్వ యం లేకుండా, వారిని సంప్రదించకుండానే ఈ .ఓ. స్వంత నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆ యన పేర్కొన్నారు. గండి రామన్న సాయిబా బా ఆలయ గోశాల నుండి ఇటీవల గోవులను తరలిస్తున్న వాహనాన్ని భక్తులు అడ్డుకోవడంతో ఈ అక్రమ రవాణా బట్టబయలైంది. అభివృద్ధికి అడ్డంకిగా ఈ.ఓ. వైఖరి సదరు ఇన్‌చార్జి ఈ.ఓ. పనిచేస్తున్న అన్ని ఆలయాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని, అడెల్లి, కదిలి, కాల్వ వంటి పుణ్యక్షేత్రాల్లో ఆయన వైఖరి వల్ల ఆలయాల అభివృద్ధి కుంటుపడుతుందని ఆరోపణలు ఉన్నాయి. ఈఓ తీరుపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయ ని స్థానికులు గుర్తు చేస్తున్నారు. గోవుల తరలింపుపై భక్తులు ప్రశ్నిస్తున్నా ఈఓ పొంతన లేని సమాధానాలు చెబుతూ కాలయాపన చేస్తున్నారని, దీని వెనుక ఏదో బలమైన కారణం లేదా అక్రమ రవాణా కోణం దాగి ఉందని అనుమానిస్తున్నారు.నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, భక్తుల మనోభావాలను దెబ్బతీస్తూ, ఆలయ కమిటీల ను నిర్లక్ష్యం చేస్తున్న ఇన్‌చార్జి ఈ.ఓ.ను తక్షణ మే బదిలీ చేయాలని డిమాండ్ రోజు రోజుకు పె రుగుతోంది. పవిత్ర పుణ్యక్షేత్రాల గోశాలలను అక్రమ రవాణా కేంద్రాలుగా మారుస్తున్న వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం దేవాదాయ శాఖ ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

## బండి సంజయ్‌ని కేంద్ర సహాయ.. మంత్రి పదవి నుండి తొలగించాలి

కొడుకు తప్పు చేస్తే ఎందుకు మాట్లాడడం లేదు
ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ప్రజాపక్షం / ఖానాపూర్ :** సమాజం పట్ల మహిళల పట్ల గౌరవం ఉంటే కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆయన కొడుకు బండి భగీరథ్ చేసిన నీచమైన పనికి బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలన్న నిర్మల్ డిసిసి అధ్యక్షుడు ఖానాపూర్ ఎం.ఎల్.ఏ. వెడ్మ బొజ్జు పటేల్ స్థానిక ఎం.ఎల్.ఏ. నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బండి సంజయ్ నిజమైన శ్రీ రాముడి భక్తుడైతే హిందు ధర్మం పైన ఆయనకి గౌరవం ఉంటే హనీట్రాప్ పేరుతో అమ్మాయిలను మోసం చేస్తూ నీచపు పనులు చేస్తున్న ఆయన కొడుకుని పోలీసులకు సరెండర్ చేయించి చట్టానికి అప్పగించాలి, ప్రజా ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పేద, ధనిక అనే తేడాలు ఉండవు, ప్రతి ఒక్కరికి ఒకే చట్టం వర్తింస్తుందని, ముఖ్యమంత్రి అనేక సందర్భాల్లో హెచ్చరించారు. కొన్ని రోజుల క్రితం రాష్ట్రానికి దేశ ప్రధాని రావడం వల్ల అభివృద్ధి కార్యక్రమాల దృష్ట్యా ఈ సమస్య పైన కొంత ఆలస్యం అయినప్పటికీ వెంటనే ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం ఒక ఐపిఎస్ ప్రత్యేక అధికారిణి నియమించి కేసు విచారణ జరిపిస్తున్నారని, బండి సంజయ్ కొడుకుపైన అధికారులు కేసు బుక్ చేసి ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేశారు, ప్రతిపక్ష బిఆర్ఎస్ అనవసరంగా ప్రభుత్వం పైన బురద చల్లే ప్రయత్నం చేస్తే వారికే నష్టం, బిజేపి పార్టీకి చిత్తశుద్ధి ఉంటే బండి సంజయ్‌ని మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేసి పార్టీ నుండి సస్పెండ్ చేయాలన్నారు. మహిళలు ఆడపిల్లల రక్షణ కొరకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి ప్రతి క్షణం అగాయిత్యాలు జరగకుండా డేగ కన్నుల ఈగల్ టీం (ప్రత్యేక బృందం) షీ టీమ్సలు రాష్ట్రంలు అణువణువు పర్యవేక్షిస్తున్నాయన్నారు.

'సూర్య మాగ్నమోపస్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'వీరభద్రుడు'. త్రిష హీరోయిన్‌గా నటిస్తోంది. ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న డ్రీమ్ వారియర్ పిక్చర్స్, ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రిలీజ్ అవుతోంది.'

## నిద్రలో నడుస్తూ 'టార్టాయిస్' హత్యలు




ఎస్ కె గోల్డెన్ ఆర్ట్స్ ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్, ఎన్ వి ఎల్ క్రియేషన్స్, మధుపాల మహా మూవీస్ పతాకంపై రాజ్ తరుణ్, అమృత చౌదరి హీరో హీరోయిన్‌గా తెరకెక్కిస్తున్న చిత్రం 'టార్టాయిస్'. శ్రీనివాస్ అవసరాల, ధన్య బాలకృష్ణ ముఖ్య పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని రిత్విక్‌కు మార్ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు, మధుపాల సురేష్ ఈ చిత్రానికి నిర్మాతలు. ఈ సినిమాకు సంబధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసారు. ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ సంగీతం అందించారు. రాజ్ తరుణ్ 25వ చిత్రంగా కెరీర్‌లో బెస్ట్ సినిమా అవుతుంది. హీరోకి నిద్రలో నడిచే అలవాటు ఉంది, నిద్రలో నడుచుకుంటూ వెళ్లి కొన్ని మర్డర్స్ చేస్తాడు. తర్వాత ఏమి జరుగుతుంది అనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రానికి చిత్రీకరించాం అని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ : శబరి, ఎడిటర్ : గుళ్ళపల్లి మాధవ్ కుమార్, ఆర్ట్ : దేవర మధుకర్, కథ,మాటలు & దర్శకత్వం : రిత్విక్ కుమార్. నిర్మాతలు:విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు, మధుపాల సురేష్.

## 'వీరభద్రుడు' మాస్ మసాలా ఎంటర్‌టైనర్

### ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరో సూర్య



సూర్య మాగ్నమోపస్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'వీరభద్రుడు'. త్రిష హీరోయిన్‌గా నటిస్తోంది. ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రిలీజ్ అవుతుంది. మే 14న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఘనంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈవెంట్‌లో హీరో కార్తీ, డైరెక్టర్ వెంకీ అట్లూరి, నిర్మాత సుప్రియా యార్లగడ్డ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరో సూర్య మాట్లాడుతూ నేను ఇక్కడికి వచ్చిన ప్రతీసారి చాలా అదృష్టవంతుడిగా భావిస్తాను. నాకు తెలుగు అంత బాగా రాకపోవచ్చు కానీ తెలుగు వారి మనసు మాత్రం నాకు బాగా తెలుసు. సుప్రియతో మాకు ఎప్పటినుంచో చాలా మంచి స్నేహం ఉంది. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ సినిమాను రిలీజ్ చేయడం చాలా గౌరవంగా భావిస్తున్నాం. ఈ సినిమాతో ప్రేక్షకులు ఖచ్చితంగా చాలా సంతృప్తి పొందుతారు. రాకేందు మౌళి చాలా చక్కని మాటలు రాశారు. రామజోగయ్య శాస్త్రికి, శ్యామ్‌కి థ్యాంక్యూ. చాలా మంచి పాటలు రాశారు. ఫస్ట్ హాఫ్ చాలా మంచి ఎమోషనల్ కోర్ట్‌రూమ్ డ్రామాగా సాగుతుంది. సెకండ్ హాఫ్ మాత్రం పూర్తి స్థాయి థియేటర్ మాస్ మసాలా మూమెంట్స్‌తో ఉంటుంది. చాలా మంచి హ్యూమర్, ఫన్ ఉంటాయి. మే 14న ఈ సినిమా విడుదల అవుతోంది అని అన్నారు. హీరో కార్తీ మాట్లాడుతూ షూటింగ్ జరుగుతుండగా ఇక్కడ 'రోలెక్స్' ఉన్నారని చెప్పారు. అందుకే హాయ్ చెప్పాలని వచ్చాను.ఈ సినిమా ఫస్ట్ లుక్ నాకు చాలా నచ్చింది. ఇది మాస్ మసాలా అలాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని కూడా చెప్పొచ్చు. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. ట్రైలర్‌ని నేను చాలా ఎంజాయ్ చేశాను. గజిని డేస్ గుర్తుకు వచ్చాయి. ఇలాంటి క్యారెక్టర్‌ను అన్నయ్య మాత్రమే చేయగలరు. ఆ మాస్ ఆయనకే సాధ్యపడుతుంది. నేను తప్పకుండా తెలుగు వెర్షన్ కూడా చూస్తాను. ఇలాంటి సినిమాలు థియేటర్‌లోనే చూడాలి. సినిమాను సెలబ్రేట్ చేసుకునే ప్రేక్షకుల కోసం తీసిన చిత్రం ఇది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను అని చెప్పారు. డైరెక్టర్ వెంకీ అట్లూరి మాట్లాడుతూ ప్రతి పాత్రలోనూ అద్భుతంగా రాణించారు. సూర్యని, కార్తిని తెలుగు ప్రేక్షకులు ఎంతగానో అభిమానిస్తారు. వాళ్ల సినిమాలు తమిళంలో రిలీజ్ అయితే ఎంత పండగలా ఉంటుందో, తెలుగులో కూడా అంతే ప ండగ వాతావరణం ఉంటుంది. సూర్య ఎంతో హంబుల్ హ్యూమన్ బీయింగ్. ఆయనతో దాదాపు 90 రోజులు పని చేసే అవకాశం వచ్చిం ది. ఆయన చేసే సమాజ సేవ కూడా అద్భుతంగా ఉ ంటుంది. ఈ సినిమా గొప్ప విజయాలు సాధించి, అద్భుతాలు క్రియేట్ చేయాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ ఆర్.జె. బాలాజీ, గే య రచయిత రామజోగయ్య శాస్త్రి, రాకేందు మౌళి, ఫైట్ మాస్టర్ విక్రమ్ పాల్గొన్నారు.

### చిత్రలహరి కోసం వేచి చూశాం

## దూరదర్శిని డైరెక్టర్ కార్తికేయ కొమ్మి



సువిక్షిత్, గీతికా రతన్ జంటగా ఓ యదార్థ సంఘటన ఆధారంగా రూపొందుతోన్న ఫీల్‌గుడ్ లవ్ ఎంటర్‌టైనర్ 'దూరదర్శిని'. కలిపింది ఇద్దరిని ఉప శీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకత్వంలో వారాహ మూవీ మేకర్స్ పతాకంపై జయ శంకర్ రెడ్డి. ఎం, పాటిమీది సంతోష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం మే 15న విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం దర్శకుడు కార్తికేయ కొమ్మి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఇంతకు ముందు నేను సాధ్యం, వసూల్ రాజా, లక్ష్మీ బాంబ్ సినిమాలకు దర్శకత్వం చేశాను. నేను కొత్తవాళ్లతో చేసిన తొలి ప్రాజెక్ట్ ఇది. యదార్థ సంఘటనతో చాలా రియలిస్టిక్‌గా ఈ సినిమాను రూపొందించాను. చిత్రలహరి టైమ్ పీరియడ్ మిస్ అయిన వారికి ఆ టైమ్‌లో చిత్రలహరి అనుభూతిని పొందిన వారికి ఈ సినిమా పూర్తి సంతృప్తినిస్తుంది. చిత్రలహరి గురించి అందరూ ఎలా వెయిట్ చేసే వారు. అక్కడ జరిగే ప్రేమ కథ. చిత్రలహరి అనేది గ్యాదరింగ్ పాయింట్‌లా ఎలా ఉండేది. అందరూ ఇది కేవలం లవ్‌స్టోరీ అనుకుంటున్నారు. కానీ ఈ చిత్రంలో తల్లిదండ్రులకు, యూ త్‌కు, సమాజానికి నచ్చే అంశాలు ఉన్నాయి. అందరికీ 90వ దశకం రోజులను గుర్తుకు తె స్తుంది. అందరూ చిత్రలహరి ప్రోగ్రామ్ కోసం వేచి చూసిన రో జులు గుర్తుకు వస్తాయి. ఈ సినిమాలో మంచి ఎమోషన్ ఉంది. అందరి హృదయాలను హత్తుకుంటుంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరికి వాళ్ల గోల్డెన్ డేస్‌లోకి తీసుకవెళుతుంది. ఆంధ్రాలో జరిగిన ఒక రియాల్ ఇన్‌సిడెంట్ ఇది. ఇప్పుడు ఆ వ్యక్తి అతను అరుణాచలంలో ఉన్నా డు. అతని జీవితంలో జరిగిన కథను స్ఫూర్తిగా తీసుకుని ఈ కథను తయారుచేశాం. ఆయనతో మాట్లాడినప్పుడు ఆయన చెప్పిన లైఫ్ స్టోరియే సినిమా ఇది. ఆయన సొంత కొడుకు వల్ల ఆ పెద్దాయన బిక్షాటన చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది అనేది ఈ కథ. యదార్థ సంఘటన చుట్టు అల్లుకున్న కథ ఇది. చాలా రియలిస్టిక్‌గా ఉంటుంది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో జరిగే ప్రేమకథ.

### ఆది హీరోగా 'శంబాల' నిర్మాతల కొత్త చిత్రం

శంబాల' సినిమా కాంబినేషన్ లో మరో సినిమా రానుంది. షైనింగ్ పిక్చర్స్ నిర్మాతలు మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభిమోజు, దర్శకుడు యుగంధర్ ముని, హీరో ఆది కలసి ఇప్పుడు మరో సినిమాకు ప్లాన్ చేశారు. ఈ చిత్రానికి బృందా రవీందర్ దర్శకత్వం వహించనున్నారు.అద్భుతమైన కథ తోడవ్వడంతో వీరంతా కలిసి ముందుకు వ చ్చారు. ఎమోషన్స్‌తో పాటుగా ఈ సారి హారర్ ఎలిమెంట్స్‌ను సరికొత్తగా చూపించబోతున్నారు. భయం, ఉత్కంఠ, అన్ లిమిటెడ్ ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్స్‌తో భారతీయ తెరపై మునుపెన్నడూ చూడని ఒక అద్భుతమైన అనుభూతిని అందించేందుకు సిద్ధమైయ్యారు. ఈ క్రమంలో కాన్సెప్ట్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో ఆది సాయి కుమార్ లుక్, రక్తం కారుతున్న తీరు, చుట్టూ ఉన్న పువ్వులు,ఆకులు, కనిపిస్తున్న పాత కాలం నాటి స్టాంప్ ఇవన్నీ చూస్తుంటే ఓ కొత్త ప్రపంచంలోకి ప్రేక్షకులని తీసుకు వెళ్లేలా కనిపిస్తున్నారు. కాన్సెప్ట్ పోస్టర్‌తోనే ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించారు. శ్రీ చరణ్ పాకాలని మ్యూజిక్ డైరెక్టర్‌గా మళ్లీ కలసి పని చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.




## జూన్ 12న 'ఆర్ కె దీక్ష' విడుదల

ఆర్ కె ఫిలిమ్స్, సిద్ధ క్రియేషన్స్ బ్యానర్‌లపై డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వం వహించి నిర్మించిన చిత్రం ఆర్ కే దీక్ష. డిఎస్ రెడ్డి సమర్పణలో రూపొందిన ఈ చిత్రంలో ఢీ, జోడి ఫేమ్ అక్స ఖాన్, అలేఖ్య రెడ్డి హీరోయిన్‌లుగా నటించ గా, కిరణ్ హీరోగా కనిపించనున్నారు. తులసి, అనూష, కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూన్ 12న థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించింది.దర్శక నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ 'ఆర్ కే దీక్ష' సినిమా సెన్సార్ కార్యక్రమా లు పూర్తయ్యాయి. యాక్షన్ సన్నివేశాలు ఎ క్కువగా ఉండటంతో సెన్సార్ 'ఏ' సర్టిఫికెట్ జారీ చేశారు. పెద్దగా కట్స్ లేకుండా సర్టిఫికెట్ ఇచ్చిన అధికారులకు ధన్యవాదాలు. ఈ సినిమా చాలా బాగా వచ్చింది. దీక్ష, పట్టుదలతో ప్రయత్నిస్తే ఏదైనా సాధించగలమనే కాన్సెప్ట్‌తో హీరో పాత్రను తీర్చిదిద్దాం. హీరో కిరణ్ ఈ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంటారు. ఆయన భీముని పాత్రలో చెప్పిన వన్ మినిట్ నాన్ స్టాప్ డైలాగ్ హైలైట్ అవుతుంది. అక్సఖాన్ ఈ చిత్రంలో డ్యాన్సర్ పాత్రలో కనిపిస్తుంది. ఆమెపై తెరకెక్కించిన 'నంది నంది' పాట ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. రోహిత్ శర్మ నెగెటివ్ రోల్‌లో నటించారు. నటి తులసి మంచి పాత్ర చేశారు. సంగీత దర్శకుడు రాజ్ కిరణ్ అద్భుతమైన పాటలు అందించారు. మన వీర జవాన్‌ల గొప్పతనాన్ని తెలియజేసే పాటను మధుప్రియ ఆలపించారు. త్వరలోనే ఆడియో విడుదల చేస్తాం. ఈ సినిమాలో కూడా అలాంటి పాత్రనే దర్శకుడు ఇచ్చారు. భీముని పాత్రలో చెప్పిన వన్ మినిట్ డైలాగ్ తర్వాత వచ్చే ఫైట్ సీన్ ప్రేక్షకులకు నచ్చుతుంది. యాక్షన్, రొమాన్స్, కామెడీ ఇలా అన్ని అంశాలు ఉన్న మా సినిమాను అందరూ ఆదరించాలి అన్నారు.హీరోయిన్ అక్స ఖాన్ మాట్లాడుతూ ఈ చిత్రంలో నేను డ్యాన్సర్ పాత్రలో నటిస్తున్నాను. నిజ జీవితంలో కూడా డ్యాన్సర్‌ను కావడంతో ఈ పాత్రకు బాగా కనెక్ట్ అయ్యాను. 'నంది నంది' పాట చాలా ప్రత్యేకంగా ఉంటుంది. మంచి ఫైట్స్ కూడా సినిమాలో ఉన్నాయి. నాకు ఈ అవకాశం ఇచ్చిన రామ కృష్ణ గౌడ్‌కు ధన్యవాదాలు. జూన్ 12న విడుదలవుతోంది అన్నారు. ఈ ప్రెస్ మీట్‌లో నటి తులసి, నటి మౌనిక మాట్లాడారు.



## పోలీసులు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

లేకపోవడంతో కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం బండి సంజయ్ మేనమామకు నోటీసులు అందజేశారు. కేసు పర్యవేక్షణ అధికారి డిసిపి రితిరాజ్ సమక్షంలో మరోసారి బాధితురాలి స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డు చేశారు. అనంతరం పోక్సో సెక్షన్ 5 (1) రెడ్ విత్ 6ను అదనంగా జత చేశారు. కాగా, బండి భగీరథ్ తనపై నమోదైన పోక్సో కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. భగీరథ్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈనెల 14న వెకేషన్ బెంచ్‌లో విచారణ జరగనుంది. భగీరథ్.. తన కుమార్తెను వేధిస్తున్నాడంటూ 17 ఏళ్ల బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 8న కేసు నమోదైన సంగతి తెలిసిందే. మరోవైపు ఆ బాలిక, ఆమె తల్లి తనను డబ్బు కోసం బెదిరిస్తున్నారంటూ భగీరథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 8వ తేదీనే కరీంనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఎఐఎడిఎంకెలో చీలిక

(మొదటి పేజీ తరువాయి)

47 స్థానాల్లో మాత్రమే గెలుపొందడంతో పళనిస్వామి నాయకత్వాన్ని ప్రశ్నిస్తూ సుమారు 30 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు శిబిరంలో చేరినట్లు భావిస్తున్నారు. సీనియర్ నాయకులు ఎస్.పి. వేలుమణి, సి.వి. షణ్ముగం ఈ తిరుగుబాటు వర్గానికి నాయకత్వం వహిస్తున్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళనిస్వామి, డిఎంకె మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని భావించారని కూడా ఆయన ఆరోపించారు. డిఎంకెని వ్యతిరేకించడానికి, దానిని 'సమూలంగా నిర్మూలించడానికి' ఎఐఎడిఎంకె పార్టీ ఆవిర్భవించిందని గుర్తుచేస్తూ, ఎం.కె. స్టాలిన్ నేతృత్వంలోని పార్టీ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న పళనిస్వామి ప్రతిపాదనను పార్టీ సభ్యులందరూ వ్యతిరేకించారని షణ్ముగం పేర్కొన్నారు. ఇటువంటి ప్రతిపాదన ఏదైనా ఎఐఎడిఎంకె ప్రాథమిక సూత్రాలకు విరుద్ధమని ఆయన జోడించారు. పార్టీకి ఇప్పుడు కొత్త జీవం అవసరమని, 'అమ్మ (జయలలిత) పాలన' తిరిగి రావాలని, అందువల్ల తాము టివికెకు మద్దతు ఇవ్వాలని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, ఎఐఎడిఎంకె నాయకత్వం ఈ ఆరోపణలను 'వదంతులు'గా కొట్టిపారేసింది. తమ సొంత జిల్లాల్లో విజయం సాధించడంలో విఫలమైన తిరుగుబాటు నాయకులు, ఇప్పుడు 'అబద్ధాల మూటలను విప్పుతున్నారని' ఆరోపించింది. ఎక్స్ వేదికగా చేసిన ఒక పోస్ట్‌లో వేలుమణి, షణ్ముగం, సి. విజయభాస్కర్ వంటి నాయకులే స్వయంగా టివికె ప్రభుత్వంలో మంత్రి పదవుల కోసం ప్రయత్నిస్తున్నారని పార్టీ ఆరోపించింది. పొత్తులకు సంబంధించిన నిర్ణయాలను కేవలం కొద్దిమంది ఎమ్మెల్యేలు తీసుకోలేరని స్పష్టం చేసిన పార్టీ నాయకత్వం, పార్టీ కార్యకర్తలు పళనిస్వామి వెనుక దృఢంగా నిలిచారని పేర్కొంది. ఎంజీఆర్ స్థాపించిన ఎఐఎడిఎంకెలో చెలరేగిన కలకలం, 1987లో వ్యవస్థాపకుడు ఎం.జి. రామచంద్రన్, 2016లో అప్పటి ముఖ్యమంత్రి జె. జయలలిత మరణాల తర్వాత జరిగిన అంతర్గత అధికార పోరాటాల జ్ఞాపకాలను తిరిగి గుర్తుకు తెచ్చింది. రెండు పార్టీల మధ్య ఎన్నికల అనంతర పొత్తు చర్చలు జరుగుతున్నాయన్న షణ్ముగం వాదనలను డిఎంకె కూడా తోసిపుచ్చింది. తన సొంత పార్టీలోనే 'చీలిక' సృష్టించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. కాగా, ఎన్నికల పరాజయానికి గల కారణాలపై క్షుణ్ణంగా చర్చించి, భవిష్యత్తులో పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ సర్వసభ్య మండలి సమావేశం ఏర్పాటు చేయాలని ఎఐఎడిఎంకె సీనియర్ నాయకులు పళనిస్వామిని కోరారు.

### అన్నాడిఎంకె రెబల్ ఎమ్మెల్యేలతో సిఎం విజయ్ భేటీ

తమిళనాడులో నూతనంగా ఏర్పడ్డ టివికె ప్రభుత్వం బలనిరూపణ చేసుకోవాల్సిన నేపథ్యంలో అన్నాడిఎంకె రెబల్ ఎమ్మెల్యేలతో సిఎం విజయ్ భేటీ అయ్యారు. అన్నాడిఎంకె నేత, ఎమ్మెల్యే షణ్ముగం ఇంటికి టివికె అధ్యక్షుడు, తమిళనాడు సిఎం విజయ్ వెళ్లి కలిశారు. బుధవారం అసెంబ్లీలో బలపరీక్ష ఉన్న నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది.

## అరెస్టు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)




ఇటి నరసింహ మాట్లాడుతూ బండి భగీరథ పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి 4 రోజులు గడుస్తున్న పోలీసులు ఇప్పటివరకు అరెస్టు చేయకుండా కాలయాపన చేసిన పోలీసులు ఇప్పుడు పరారీలో ఉన్నారని తెలపడం దారుణమన్నారు.ఈ కేసుతో బండి సంజయ్‌కి, బిజెపికి సంబంధం లేదని కేవలం కుటుంబ విషయం అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు మాట్లాడటం మహిళల పట్ల వారి దృక్పథం, రేపిస్టులకు సహకరించే వీరి దుర్మార్గమైన నీతి బయటపడిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ప్రేమ్ పావని, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ జిల్లా కార్యవర్గ సభ్యులు జి చంద్రమోహన్ గౌడ నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్ ,మహమ్మద్ సలీం ఖాన్, హెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ ,జిల్లా కౌన్సిల్ సభ్యులు చెట్టు కింది శ్రీనివాస్ ,ఆరుట్ల రాజ్ కుమార్, సక్రిబాయి,బాలకృష్ణ, మహమూద్, సైఫ్, చైత్యన్య, అనిల్ కుమార్, నర్సింగ్ రావు, గౌస్, దశరథ్, భగత్ సింగ్, సుశాంత్, అరుణ్, ఫహీం, తదితరులు పాల్గొన్నారు.

**కేసును నీరుగార్చే ప్రయత్నం – 'మహిళా సంఘాలు'**

బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైనందున నిందితుడిని అరెస్ట్ చేయాలని మహిళా సంఘాలు డిమాండ్ చేశారు. మైనర్ బాలిక ఫిర్యాదుపై వెంటనే చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు, నిందితులకు సమాచారం ఇచ్చి కేసును నీరుగార్చే ప్రయత్నం చేశారని విమర్శించాయి. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.జ్యోతి, పిఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు వి.సంధ్య, పిఓడబ్ల్యు అధ్యక్షురాలు స్వరూప, అనసూయ, ఎఐడిడబ్ల్యూఎ నాయకులు మల్లు లక్ష్మీ, సిఎంఎస్ అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడారు. ఎన్.జ్యోతి మాట్లాడుతూ ఈ కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు అప్పగించి నిష్పక్షపాత విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. అలాగే బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులకు తక్షణ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**కేసు నిర్లక్ష్యం చేయడం సరికాదు : ఎఐఎస్ఎఫ్**

మైనర్ బాలికపై లైంగిక దాడి చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథను అరెస్ట్ చేసి విచారించాలని.. కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలని రౌండ్ టేబ్ల్ సమావేశంలో పాల్గొన్న పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ అధ్వర్యంలో వివిధ పార్టీల విద్యార్థి, యువజన, మహిళా సంఘాలతో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు బండి వ్యవహారంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ... కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు మారుడు ఒక మైనర్ బాలికపై లైంగిక దాడి చేసినట్లు పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బాధిత కుటుంబం ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదని.. కేంద్ర మంత్రి కుమారుడు మైనర్ బాలికపై లైంగిక దాడి చేసిన ఈ ఆరోపణలపై పారదర్శకంగా.. నిష్పక్షపాతంగా విచారణ జరిపి.. ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని.. రాష్ట్రంలో చట్టాలు ఎవరికీ వత్తాసు కా కుండా అందరికి ఒకేలా ఉండాలని.. తప్పు చేసిన వారిని శిక్షి ంచాలని.. రాష్ట్ర ప్రభుత్వం సిట్ విచారణ పేరుతో జాప్యం చే యకూడదని హితవు పలికారు. రౌండ్ టేబ్ల్ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కా ర్యదర్శి తాళ్ల నాగరాజు, బిఆర్‌ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు, మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నేదునూరు జ్యోతి, పిడిఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శులు పి.నాగరాజు, అనిల్, సుమ ంత్, మహిళా సంఘాల ప్రతినిధులు సంధ్య, అనసూయ, స్వరూప, ఝాన్సీ, ఏఐడీఎస్ఓ నాయకుడు రాజేష్ నాయక్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ రెహమాన్, గ్యార నరేష్, కసోజు నాగజ్యోతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చైతన్య యాదవ్, వంశీ వర్ధన్‌రెడ్డి, ఎండి అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ప్రతిష్ఠంభన

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యేల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని తాను భావిస్తున్నానని సుధాకరన్ ఢిల్లీ లో విలేకరులతో అన్నారు. తాను తన అభిప్రాయాలను అధిష్టానానికి తెలియజేశానని, ఒక పార్టీ కా ర్యకర్తగా వారు అడిగిన ప్రశ్నలకు తనకు సాధ్యమైనంత మేరకు సమాధానాలు ఇచ్చానని రాధాకృష్ణన్ తెలిపారు. యుడిఎఫ్ కూటమి భాగస్వామ్య పక్షమైన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్)కు ఈ విషయంలో ఏదైనా పాత్ర ఉండాలా వద్దా అని విలేకరులు ప్రశ్నించగా, ఆ పార్టీని ఈ వివాదంలోకి ఎందుకు లాగుతున్నారని ఆయన ఎదురు ప్రశ్నించారు. కేరళ ముఖ్యమంత్రి ఎంపికపై నిర్ణయం వీలైనంత త్వరగా వెలువడుతుందని చెప్పారు. తాను చెప్పదలచుకున్న విషయాలను పార్టీ అధిష్టానానికి తెలియజేశానని, బుధవారం నాటికి ఒక నిర్ణయం వెలువడే అవకాశం ఉందని మురళీధరన్ చెప్పారు. వాండూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎన్నికైన ఎమ్మెల్యే ఎ.పి. అనిల్ కుమార్ మాట్లాడుతూ, నిర్ణయం తీసుకునే ముందు అధిష్టానం అన్ని కోణాలను క్షు ణ్ణంగా పరిశీలిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి పదవికి ప్రధాన పోటీదారులుగా సీనియర్ నాయకులు రమేష్ చెన్నితాల, వి.డి. సతీశన్, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ ఉన్నారు. అంతకుముందు రోజు, కేరళ ముఖ్యమంత్రి ఎంపిక కేవలం ఎమ్మెల్యేల అభిప్రాయం ఆధారంగానే జరగదని, దానికి బదులుగా యుడిఎఫ్ భాగస్వామ్య పక్షాల, సాధారణ ప్రజల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారని మురళీధరన్ పేర్కొన్నారు. ఎంపిక కాబోయేది కేవలం కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి మాత్రమే కాదని, మొత్తం యుడిఎఫ్ కూటమికి సంబంధించిన ముఖ్యమంత్రి అని, కాబట్టి కూటమి భాగస్వామ్య పక్షాల అభిప్రాయాలను కూడా తప్పక పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని ఆయన అన్నారు. తిరువనంతపురంలో ఒక టీవీ ఛానెల్‌తో మాట్లాడుతూ, ఎమ్మెల్యేల అభిప్రాయాల ఆధారంగా మాత్రమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటే, అది ఇప్పటికి ఎప్పుడో పూర్తయి ఉండేదని మురళీధరన్ వ్యాఖ్యానించారు. మురళీధరన్‌తో పాటు, కొత్త ముఖ్యమంత్రిని నిర్ణయించే ముందు ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలని సుధీరన్ కూడా భావిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ వేణుగోపాల్‌కు ఈ పదవి అప్పగిస్తే, యుడిఎఫ్ రెండు ఉప ఎన్నికలను ఎదుర్కోవాల్సి వస్తుందని సతీశన్ వర్గం వాదిస్తోంది. వేణుగోపాల్‌కు ఎన్నికైన ఎమ్మెల్యేలలో అత్యధికుల మద్దతు ఉందని, ఉప ఎన్నికల్లో యుడిఎఫ్ విజయాలను సాధించిపెట్టగల వ్యూహకర్త ఆయనని వేణుగోపాల్ వర్గం పేర్కొంటోంది. కేరళకు చెందిన కాంగ్రెస్ ఎంపిలలో అత్యధికులు కూడా వేణుగోపాల్‌కే మద్దతు ఇస్తున్నారని ఆ వర్గం చెబుతోంది. చెన్నితాల విషయానికి వస్తే, ఆయన అత్యంత సీనియర్ నాయకుడని, క్లిష్ట సమయాల్లో సైతం పార్టీకి, నెహ్రూగాంధీ కుటుంబానికి ఒక బలమైన అండగా నిలిచారని చెన్నితాల వర్గం చెబుతోంది. ఆయన అనుభవాన్ని ప్రస్తావిస్తూ, ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా ఆయన పనిచేసిన కాలంలో, ఆయనతో కలిసి లేదా ఆయన నాయకత్వంలో పనిచేసిన అనేకమంది నాయకులు ఇతర రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగానో లేదా కేంద్ర మంత్రులుగానో ఎదిగారని వారు గుర్తుచేస్తున్నారు. ఇంతటి సీనియర్ నాయకుడికి ఈసారి అవకాశం కల్పించకపోవడం ఆయనకు జరిగే అన్యాయమేనని వారు వాదిస్తున్నారు.

## రాజీనామా చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

విభేదాలు ఉన్నాయి. ఆయనను తొలగించే విషయంపై అధికార లేబర్‌పార్టీలోనే ముసలం పుట్టింది. ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత పార్టీలోనే ఆయనకు వ్యతిరేక వర్గం తయారైంది. స్టార్‌మర్ తన పదవికి రాజీనామా చేయాలని బాహాటంగా కోరుతున్న ఎంపీల సంఖ్య 81కి చేరింది. రాజీనామా చేయాలి లేదా ఒక కాలపట్టికను ప్రకటించాలని వారు కోరుతున్నారు. పదవికి రాజీనామా చేయాలని అధికారికంగా ఆయనను కోరాలంటే 81 మంది అధికారపార్టీ ఎంపీలు సంతకాలు చేయాలి. అంటే 20 శాతం మంది సహచరులు మద్దతు ఇవ్వాలి. ఆయన పదవిలో కొనసాగేందుకు పెద్ద పోరాటం చేస్తున్నారు. ప్రధానమంత్రి పదవికి ఎప్పుడు రాజీనామా చేస్తారో ఒక కాలపట్టిక ప్రకటించాలని కోరుతున్నవారిలో హోంమంత్రి షబానా మహమూద్ కూడా ఉన్నారు. ప్రస్తుతం స్టార్‌మర్‌కు ఆరోగ్యశాఖామంత్రి వెస్ స్ట్రీటింగ్‌తోపాటు మాజీ ఉప ప్రధానమంత్రి ఏంజెలా రేనర్ నుండి అతిపెద్ద సవాలు ఎదురవుతోంది.ప్రధానమంత్రి పదవికి వారిద్దరూ పోటీ పడుతున్నారు.

ఇలా తనను రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నవారి వెనుక బండారాన్ని బయట పెడతానని కూడా స్టార్‌మర్ అంటున్నారు. కానీ రోజురోజుకూ ఆయన రాజీనామాపై రగడ ముదిరి పాకాన పడుతోంది. మంత్రివర్గంలో కూడా ఆయన రాజీనామా చేసే విషయంపై విభేదాలు రగులుకున్నాయి. లండన్ స్థానిక ఎన్నికల్లో అత్యంత ఘోరంగా స్టార్‌మర్‌పార్టీ పరాభవం పొందడం కూడా ఆయనకు అతిపెద్ద సమస్యగా మారింది. లండన్ స్థానిక ఎన్నికల్లో గతంలో 1156 స్థానాలు గెలుచుకున్న స్టార్‌మర్‌పార్టీ ఇటీవల జరిగిన ఎన్నికలలో 1500 స్థానాలు పోగొట్టుకుని ఘోరంగా చతికిలబడిపోయింది. అంతకుముందు జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఎక్కువమంది లేబర్‌పార్టీ ఎంపీలు లండన్ చుట్టూ ఉన్న ప్రాంతాల నుండే విజయకేతనం ఎగురవేశారు. కానీ ఇప్పుడు ఆయన అవేచోట్ల పరాభవం పొందారు. ఎప్‌స్టీన్‌ఫైల్స్‌తోపాటు ఈ ఓటమి కూడా ఆయనను వెంటాడుతోంది. అంతేకాకుండా ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు ఇప్పటివరకూ ఆయన నెరవేర్చలేదు. వలస సమస్య, జీవన వ్యయాల సమస్యలను ఆయన పరిష్కరించలేదు. ఆయన పాపులారిటీ రేటింగ్ కూడా ఘోరంగా పడిపోయింది. జెఫ్రీ ఎప్‌స్టీన్‌ఫైల్స్‌లో పేరు నమోదు చేసుకున్న పీటర్ మాండెల్సన్‌ను తెలిసి తెలిసీ స్టార్‌మర్ అమెరికాకు దౌత్యవేత్తగా నియమించారని ఆరోపణలు వచ్చాయి. కానీ ఆయన అవినీతి గురించి తనకు ముందుగా తెలియదని వాదిస్తున్నారు. తెలిసే అన్నీ చేశారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com